# గ్రీసుదేశపు పురాణగాథలు



వేమూరి వేంకటేశ్వరరావు

# గ్రీసుదేశపు పురాణగాథలు

వేమూరి వేంకటేశ్వరరావు

# విషయ సూచిక


ముందు మాట .......... 4

1. పురాణగాథలు ఎందుకు చదవాలి? .......... 6

2. గ్రీకు పురాణగాథలు: ఒక పరిచయం .......... 11

3. క్రోనస్: టైటనుల అధినేత .......... 17

4. ఒలింపియనులు .......... 24

5. జూస్: ఒలింపియనుల  అధినేత .......... 34

6. అపస్వరం అనే ఏపిల్ పండు కథ .......... 38

7. ట్రోయ్ మహా సంగ్రామం .......... 43

8. ట్రోయ్ సంగ్రామం నిజమా? కల్పనా? .......... 48

9. ఇలియాడ్: సంగ్రహంగా .......... 52

10. కస్సాండ్రా కథ .......... 57

11. క్రీసస్ ఉదంతం .......... 60

12. ఆర్టెమీస్, ఒరాయన్ల ప్రేమ గాథ .......... 65

13. ఎడిపస్ విషాద గాథ .......... 72

14. ప్రొమీథియస్  – మానవుల శ్రేయోభిలాషి .......... 79

15. ప్రథమ స్త్రీ పెండోరా కథ .......... 82

16. కేసియోపియా  కథ .......... 87

17. రాజుగారివి గాడిద చెవులు .......... 93

18. హెరాక్లీస్  కథ ........................................................................................ 99

19. పంకజ ప్రాదుర్భావం ................................................................................106

20. గ్రీకు తత్త్వవేత్తల ప్రాదుర్భావం .......................................................................111

21. గ్రీకు  భాషలో  పేర్లు,  వాటి అర్థాలు, వాటి ఉచ్చారణలు .........................................118

వేమూరి వేంకటేశ్వరరావు తెలుగు పుస్తకాలు...............................................................128

వేమూరి వేంకటేశ్వరరావు జీవిత సంగ్రహం................................................................129

# ముందు మాట

ఈ పుస్తకం రాయమని నన్ను ప్రేరేపించినది ఒక విమాన ప్రయాణం. భారతదేశం వెళ్లడానికి శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరేను. తూర్పు కోస్తాలో ఉన్న నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. విమానం కిందకి దిగడానికి సన్నాహాలు అయిపోయాయి. కుర్చీల వీపులు తిన్నగా చెయ్యమన్నారు. చేసేం. కుర్చీలకున్న పటకాలు నడుం చుట్టూ కట్టుకోమన్నారు. కట్టుకున్నాం. విమానాన్ని పరుగుబాటకి ఎదురుగా అమర్చి, కిందికి దిగుతోంది. దిగువున నేల కనిపిస్తోంది. ఇంతలో, గభాల్న, విమానం జోరు పుంజుకుని పైకి లేవడం మొదలు పెట్టింది. “మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం అడ్డుగా ఉంది. విమానాల రాకపోకలని నియంత్రించే బురుజులో పనివారు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,” అని చోదకుడు చెప్పేడు.

మార్చి 1977 లో టెనెరీఫ్ దీవి మీద ఉన్న విమానాశ్రయంలో పరుగుబాట మీద రెండు విమానాలు ఢీకొని 583 మంది స్వర్గస్తులయిన సంగతి ఒక్క సారి గుర్తుకి వచ్చి ఒళ్ళు ఝల్లుమంది! మనస్సుని కుదుట పరచుకోడానికి నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా కార్యక్రమం చూద్దామని వెతకడం ఉపక్రమించేను. “అపస్వరం అనే ఏపిల్ పండు కథ” (The Apple of Discord) ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.

కొంటె బొమ్మలతో చెప్పిన కథ. పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ వినని కథ. ఆసక్తితో చూసేను. ఇంత మంచి కథ ఇప్పటివరకు నాకు తారస పడకుండా ఎలా జారిపోయిందా అనుకుంటూ గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ అని తెలిసింది. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత మా అమ్మాయిని అడిగితే, “చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను” అని చెప్పింది. విస్మరించదగ్గ చిన్న విషయం పెద్ద తగాదాకి దారి తీసినప్పుడు ఈ కథని ఉపమానంగా చెబుతారు అని చెప్పింది మా అమ్మాయి. నేను పుస్తకాల పురుగుని అయినప్పటికీ ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో

అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ గ్రీసు దేశపు పురాణకథల గురించి ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటిలో కొన్నింటిని క్రోడీకరించి చిన్న చిన్న కథలుగా కొన్ని, వ్యాసాలుగా కొన్ని రాసేను. అదే ఈ పుస్తకం. ఈ అధ్యాయాలని ఏ క్రమంలోనైనా చదవచ్చు.

ఈ వ్యాసాలలో వచ్చే పేర్లు మనకి పరిచయం లేనివి. కానీ సంస్కృతం పేర్ల లాగే గ్రీకు పేర్లు కూడా అర్థభూయిష్టాలు. కొన్ని కొన్ని పేర్ల వర్ణక్రమాలలోను, ఉచ్చారణలోనూ తేడా అత్యల్పం. అందుకని ఈ పేర్లని ఎలా రాయాలో, ఎలా ఉచ్చరించాలో, వాటి అర్థాలు ఏమిటో చెప్పడానికి చివరి అధ్యాయం కేటాయించేను.

ఈ పుస్తకంలో బొమ్మలన్నీ వికీపీడియా సౌజన్యంతోటి, గూగుల్ సౌజన్యంతోటి వాడుకున్న బొమ్మలు. ఆయా సంస్థలకి ధన్యవాదాలు.

వేమూరి వేంకటేశ్వరరావు

ప్లెజంటన్, కేలిఫోర్నియా

2021

# 1. పురాణగాథలు ఎందుకు చదవాలి?

మనకి వేదాలు, అష్టాదశ పురాణాలూ, రామాయణ, మహాభారతాల వంటి ఇతిహాసాలు ఉండగా, ఇతర దేశాల పురాణగాథలు ఎందుకు చదవడం? మన పురాణగాథల గురించి లోతుగా అర్థం చేసుకోవాలంటే ఇతరుల పురాణగాథలు కూడా తులనాత్మకంగా అధ్యయనం చెయ్యాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రచారంలో ఉన్న పురాణగాథలన్నిటిలోనూ కొన్ని ఉమ్మడి ప్రతీకలూ, లక్షణాలూ కనబడతాయి. వీటిని ప్రాగ్రూపాలు (archetypes) అని తెలుగులో అంటారు. అన్ని సమాజాలలోను ఒక "సామూహిక చైతన్యం" (collective consciousness) ఉంటుందనిన్నీ, ఆ ఉమ్మడి చేతనలోంచే పురాణగాథలు (myths) రూపుదిద్దుకున్నాయనీ మానసిక శాస్త్రజ్ఞులు అంటారు. కలలకీ, జానపద కథలకీ, పురాణగాథలకీ ఒకటే కథాసూత్రం ఉంటుందనిన్నీ, వాటి ప్రయోజనం "తీరని కోర్కెలు తీర్చడం" (wish fulfillment) అనిన్నీ జోసెఫ్ కాంప్^బెల్ (Joseph Campbell) అభిప్రాయం! వీటన్నిటిలోనూ అంతర్గతంగా ఉన్న కథానిర్మాణాన్ని అయన "monomyth" అన్నారు. అనగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పురాణగాథ ఒక్కటే! దాన్నే వేరు వేరు జాతులు, వేరు వేరు కాలాలలో, వేరు వేరు భాషల్లో, వేరు వేరు విధాలుగా చెప్పుకున్నారు.

అసలు గాథ అంటే కథనరూపక గేయం అని అర్థం; పాడుకోడానికి అనువైన కథ. గాథలని ఆలాపించే వ్యక్తి గాథకుడు. వీరుల గురించి చెప్పే గాథలు వీరగాథలు (ballads). పరిమాణాన్నిబట్టి వీరగాథలని లఘుగాథలు, చక్రీయ గాథలు (ballad cycles) అని విడగొట్టవచ్చు. లఘుగాథలు చిన్న కథలు. చక్రీయ గాథలు పంచతంత్రం కథలలా గొలుసు కథలు. వీరగాథలలో అసలు కథ ఒక వంతు, కల్పన పది వంతులు అనడం అతిశయోక్తి కాదు. వీరగాథలలో అతిలోక వ్యక్తులు, అతీంద్రియ శక్తులు, అద్భుత కథనాలు, అభూత కల్పనలు లేకపోతే జానపదులను ఆకర్షించవు. మనం ఇక్కడ చవి చూడబోయేవి ఇటువంటి గ్రీసు దేశపు జానపద ఐతిహాసిక చక్రీయ గాథలు (epic cycles) నుండి సేకరించినవి. ఇవి తరతరాలుగా ప్రజలలో మౌఖికంగా వ్యాప్తి చెందిన కథలు. పాశ్చాత్య సంప్రదాయాలని, సంస్కృతులని, వాఙ్మయాన్ని ప్రభావితం చేసిన కథలు.

ఇంగ్లీషులో “myth” అనే మాటని తెలుగులో “పురాణగాథ” అనొచ్చు. పురాణగాథలకి రెండు ప్రయోజనాలు ఉన్నాయి. మొదటి ప్రయోజనం – పిల్లలు కుతూహలంతో అడిగే, ఇబ్బంది పెట్టే, ప్రశ్నలకి తేలికగా సమాధానాలు చెప్పడానికి. ఏమిటా ప్రశ్నలు? ఈ ప్రపంచాన్ని ఎవ్వరు తయారు చేసేరు? ఎప్పుడు తయారు చేసేరు? ఈ ప్రపంచం ఎన్నాళ్ళు ఉంటుంది? మొట్టమొదట ఎవ్వరు పుట్టేరు? చచ్చిపోయిన తరువాత ఎక్కడకి వెళ్తాము? మొదలైనవి. రెండవ ప్రయోజనం – మనం ఉంటున్న సాంఘిక వ్యవస్థ వెనుక, మన ఆచార వ్యవహారాల వెనుక ఒక కారణ–కార్య లంకె ఉందని సూచించడం కొరకు. సనాతన కాలపు గ్రీసు దేశపు సమాజంలో దేవుళ్ళ గురించి, దేవతల గురించి, సాహసోపేతమైన ధీరుల గురించి, భయంకరమైన రాక్షసాకారాల గురించి, వికృతమైన “చంపూ మానవులు” (human–animal hybrids) గురించి ఎన్నెన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తుపానులు ఎందుకు వస్తున్నాయి? అగ్నిపర్వతాలు ఎందుకు పేలుతున్నాయి? భూకంపాలకి కారణం ఏమిటి? పూజలు, వ్రతాలు, మొదలైన కర్మకాండలు ఎందుకు చెయ్యాలి? మొదలైన ప్రశ్నలు అప్పుడే కాదు ఇప్పుడు కూడా అడుగుతున్నారు. వీటికి సమాధానాలు చెప్పడం కోసం పురాణగాథలు పుట్టుకొచ్చాయి.

హిందువులకి వేదాల వంటి పురాతన ప్రమాణ గ్రంథాలు ఉన్నాయి. కంచు యుగం (Bronze age) రోజులలో, పాశ్చాత్యులకి, ప్రత్యేకించి గ్రీసు దేశంలో, ఉన్నవల్లా తరతరాలుగా వస్తున్న మౌఖిక సాహిత్యము, సంప్రదాయాలు. ఆ కథలు వివిధ గాయకుల నోట ప్రయాణం చేసి, కాలక్రమేణా మార్పులుచెంది, చివరికి లిఖిత రూపంలో గ్రంథస్థం అయేయి. ఈ రకంగా గ్రంథస్థం అయిన వాటిల్లో చెప్పుకోదగ్గవి హోమర్ (Homer, ఉరమరగా సాధారణ శకానికి పూర్వం 8 వ శతాబ్దంలో) రాసిన ఇలియాడ్ (Illiad), ఆడెస్సి (Odyssey) అనే రెండు గ్రంథాలు. ఇలియాడ్ లో ముఖ్యమైన కథాంశం ట్రోయ్ లో జరిగిన యుద్ధం. ఈ యుద్ధం పైకి చూడడానికి రెండు మానవ సైన్యాల మధ్య జరిగిన యుద్ధంలా కనిపించినా, ఈ యుద్ధానికి ప్రేరణ కారకులు దేవతలు, వారి మధ్య ఉండే ఈర్ష్య, అసూయ, మొదలైన వైషమ్యాలు. యుద్ధం అయిపోయిన తరువాత విజయం సాధించిన గ్రీకు సైన్యంలో కొంత మంది పదేళ్ళపాటు సముద్ర ప్రయాణం చేసి, చిట్టచివరకు రోమ్ నగరం చేరుకుంటారు. ఈ బృహత్ ప్రయాణం గురించి చెప్పే కథ ఆడెస్సి.

ట్రోయ్ యుద్ధంలో బతికి బయటపడ్డ యోధులు కొందరు ఇటలీ చేరుకుని రోమ్ సామ్రాజ్యపు సంస్థాపనకి కారకులు అయేరు. అప్పుడు గ్రీకు కథలకి సమాంతరంగా రోమ్ పురాణగాథలు పుట్టుకొచ్చేయి. ఈ కథలలో పాత్రల పేర్లు మారేయి కానీ మౌలికంగా గ్రీకు పాత్రలనే పోలి ఉంటాయి. రోమ్ సామ్రాజ్యం బలం పుంజుకునే వేళకి గ్రీసు దేశంలో ప్రజలపై పురాణగాథల ప్రభావం సన్నగిల్లడం మొదలయింది కానీ వాటి అవశిష్టాలు అలెగ్జాండర్ కాలం వరకు మిగిలే ఉన్నాయి.

ఈ యుద్ధాలలో ప్రముఖ పాత్రలు ధరించిన మానవులు, దేవతలు ఎక్కడనుండి వచ్చేరు? హోమర్ తరువాత ఒక శతాబ్దం గడచిన పిమ్మట (ఉరమరగా సా. శ. పూ. 7 వ శతాబ్దంలో) హేసియోడ్ (Hesiod) అనే చరిత్రకారుడు రాసిన థియోగొని (Theogony) అనే గ్రంథంలో ఈ ప్రపంచం ఎలా పుట్టిందని ప్రాచీన గ్రీకులు నమ్మేవారో మొదటిసారి చూస్తాం. ఈ గ్రంథంలోనే ఆదిలో ఒక అస్తవ్యస్తమైన పరిస్థితి నుండి గాయా (Gaia) అనే భూదేవత పుట్టడం, తరువాత ఆమె ప్రాథమిక ప్రకృతి శక్తులకు ఎలా జన్మనిచ్చిందో, వారి నుండి రాక్షసగణాలు, దేవగణాలు, ఎలా పుట్టుకొచ్చేయో, ఆయా వంశవృక్షాలతో సహా కూలంకషంగా వర్ణించబడ్డాయి. కాలక్రమేణా ఈ కథలని ఆధారంగా చేసుకుని శిల్పులు శిల్పాలు మలిచేరు, చిత్రకారులు బొమ్మలు గీసేరు, కవులు గ్రంథాలు రచించారు, నిర్మాతలు సినిమాలు తీసేరు. చిట్టచివరకు అధునాతన కాలంలో వ్యాపార సంస్థలు కూడా ఆ కాలపు పేర్లని, శాల్తీలని వాడుకుంటున్నారు.

గ్రీకు పురాణగాథలలో దేవతలే కాదు, శూరులు, వీరులు అయిన మానవులు కూడా ఉన్నారు. ఉదాహరణకి మహా బలవంతుడైన హెర్క్యులిస్ (Hercules) పేరు తెలియనివారు ఉండరు. మొట్టమొదటి మానవ స్త్రీ పెండోరా (Pandora) తెరవకూడని పెట్టె తెరచి మానవ లోకానికి పెద్ద సమస్య తెచ్చి పెడుతుంది. దంతపు విగ్రహాల అందాన్ని చూసి, ప్రేమలో పడడం పిగ్మేలియన్ (Pygmalion) కథాంశం. అరాక్నే (Arachne) అనే సాలె వనిత ఆత్మస్థైర్యాన్ని “పొగరుబోతు ప్రవర్తన” గా పరిగణించి ఆమెని శిక్షించాడానికి సాలెపురుగుగా మార్చేస్తారు ఆనాటి దేవతలు. ఏది ముట్టుకుంటే అది బంగారం అయిపోవడం వల్ల మైదస్ (Midas) పడ్డ పాట్లు మనకి తెలియనివి కావు.

నార్సిస్సస్ అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని దాని మీద ప్రేమలో పడడం అనే కథని ఆధారంగా చేసుకునే ఇంగ్లీషులో narcissism అనే మాట వచ్చింది.

గ్రీకు పురాణగాథలలో వచ్చే రాక్షసాకారాలు, వికృతమైన జంతు–నర సంకరాకారాలు  చాల మట్టుకి కథలలో చదివే ఉంటాం. పేగసస్ (Pegasus) అనే  గుర్రానికి రెక్కలు ఉంటాయి. సెంటార్ (centaur) ముందు భాగం మనిషిలా ఉంటే వెనక భాగం గుర్రంలా ఉండే నరతురంగం.  ఈ రకం నరతురంగాలనే హిందూ పురాణాలలో కింపురుషులు అన్నారు. మనకి ఉన్నట్లే వారికీ కిన్నరులు (satyrs) ఉన్నారు. స్ఫింక్స్ (Sphinx) అనేది స్త్రీ రూపంలో ఉన్న నరసింహం. ఇంకా విచిత్రమైన శాల్తీలు చాలా ఉన్నాయి.

నేడు మనం బజారులో కొనుక్కునే అనేక వస్తువుల పేర్లు గ్రీకు పురాణ గాథల నుండి సేకరించినవే! పాదరక్షలని చేసే నైకీ (Nike) సంస్థ పేరు ఎక్కడినుండి వచ్చిందని? చంద్రుడి దగ్గరకు మానవులని మోసుకెళ్లిన రాకెట్ అపాలో (Apollo) పేరు ఎక్కడిదో తెలుసా? అమెజాన్ డాట్ కామ్ (Amazon.com) కంపెనీ పేరులో  అమెజాన్  ఎక్కడినుండి వచ్చిందో తెలుసా?  అమెరికాలో బట్టలు ఉతుక్కునే ఒక సబ్బు వ్యాపార నామం ఏజాక్స్ (Ajax). అమెరికాలో ఆటలాడే జట్లు పేర్లు టైటన్స్, స్పార్టన్స్, ట్రోజన్స్, వగైరా పేర్లు అన్నీ గ్రీసు దేశపు పురాణాలలో పేర్లే.

ఇటువంటి నేపథ్యం ఉన్న గ్రీకు సమాజంలో, ఇటువంటి పురాణకథలని, మానవాతీత మహత్తర శక్తులని నమ్మిన గ్రీకు సమాజంలో కాలక్రమేణా కార్య–కారణ హేతువాద దృక్పథం  చోటు చేసుకుంది. ఈ కొత్త దృక్పథానికి విత్తులు హోమర్ కాలంలోనే పడ్డాయేమో కానీ, అవి మొలకెత్తడం మొదలెట్టి ఒక ఆకారం సంతరించుకొనడం థేల్స్ (Thales, ఉరమరగా సాధారణ శకానికి పూర్వం 5 వ శతాబ్దం) తో ప్రారంభం అయిందని చెప్పుకోవచ్చు. అటుపైన గ్రీకు దార్శనికుల సారథ్యంలో, కట్టలు తెంచుకు ప్రవహించిన నదిలా, ఒక కొత్త రకపు ఆలోచనా  స్రవంతి  పెల్లుబుకి ప్రపంచం అంతటిని ముంచెత్తింది.  అదే ఈ నాటి శాస్త్రీయ దృక్పథం. ఇప్పుడు గ్రీసులో కాని, పాశ్చాత్య దేశాలలో కానీ మిగిలినది కథలు మాత్రమే! ఆ కథలు నేర్పిన దృక్పథం ఎప్పుడో  కాలగర్భంలో కలిసిపోయింది.  .

ఉపయుక్త గ్రంథాలు


1. Joseph Campbell, The Masks of God,
2. Joseph Campbell, The Hero with a Thousand Faces (1949), Dewey Decimal: 201/.3 22
3. L. Strauss, Introduction to a Science of Mythology (1964–71)
4. Vladimir Propp, A Morphology of the Tale, Leningrad (1928), *Morphology of the Tale* was translated into English in 1958 and 1968.

# 2. గ్రీకు పురాణగాథలు: ఒక పరిచయం




బొమ్మ: పురాణకాలంలో గ్రీసు దేశం, పరిసర ప్రాంతాలు, దేశాలు

ఆధునిక పాశ్చాత్య నాగరికత యొక్క పునాదులు గ్రీసు దేశంలో కనిపిస్తాయి. ఆర్కిమిడీస్, పైథాగరోస్, సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి ఆద్యులకి గ్రీసు దేశం పుట్టినిల్లు. ఆధునిక శాస్త్రాల మీద గ్రీసు దేశపు ప్రభావం అడుగడుగునా కనిపిస్తూనే ఉంటుంది. అంతే కాదు. పాశ్చాత్య సాహిత్యం మీద, శిల్పాల మీద, తైలవర్ణ చిత్రాల మీద, సినిమాల మీద, ఆటల మీద కూడా గ్రీసు దేశపు పురాణగాథల ప్రభావం మెండు. కనుక గ్రీసు దేశపు పురాణగాథలపై అవగాహన మనకి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. మౌర్య సామ్రాజ్యపు రోజుల నుండి భారతదేశం మీద గ్రీసు ప్రభావం మెండుగా ఉందనే చెప్పాలి. ఈ సందర్భంలో గ్రీసు మీద భారతదేశపు ప్రభావం ఏమైనా ఉందా అన్న విషయం కూడా ఆలోచించవలసిన అంశమే!

గ్రీసు దేశపు పురాణగాథలు చదువుతూ ఉంటే వాటికీ హిందూ పురాణ గాథలకి మధ్య పోలికలు కనిపిస్తూ ఉంటాయి. ఈ పోలికలు పేర్లలో కావచ్చు, సంఘటనలలో కావచ్చు, వ్యక్తుల ప్రవర్తనలో

కావచ్చు, దేవతల ఆయుధాలలో కావచ్చు, దేవతల వాహనాలలో కావచ్చు, దేవతలకి మానవులకి మధ్య సంబంధబాంధవ్యాల రూపేణా కావచ్చు. ఈ పోలికలకి కారణాలు రకరకాల కోణాలలో వెతకవచ్చు. కానీ హిందూ పురాణగాథలకి, గ్రీసు పురాణగాథలకి మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. ప్రస్తుతానికి వాటన్నిటిని పక్కన పెట్టి వారి పురాణగాథలని ఒక నఖచిత్రంలా అర్థం చేసుకుందాం.

మనకే కాదు, చాల సమాజాలలో పురాణగాథలు ఉన్నాయి; ఈజిప్ట్, నోర్స్, గ్రీస్, వగైరా. ఈ కథలు అన్నిటిలోను ఈ ప్రపంచం ఎలా పుట్టుకొచ్చిందో, అందులో మానవుడు ఎలా ఉద్భవించేడో, రకరకాల కోణాలలో ఆవిష్కరణ జరుగుతుంది. అంతే కాకుండా దేవతలు, స్వర్గం, నరకం, మొదలైన విషయాల మీద పరిశీలన జరుగుతుంది. వీటిని సునిశితంగా పరీక్షించి చూస్తే వీటన్నిటిలోను కొన్ని పోలికలు కనిపిస్తాయి. దీనికి రెండు కారణాలు ఉండొచ్చు. ఒకటి, విభిన్న ప్రదేశాలలో, విభిన్న కాలాలలో నివసిస్తున్న మానవుల మేథలో, ఈ విశ్వం యొక్క ఆవిర్భావాన్ని గురించి పోలికలు ఉన్న ఆలోచనలు వచ్చి ఉండవచ్చు. రెండు, అనాది కాలంలో ఈ విశ్వం యొక్క ఆవిర్భావం గురించి ఒక చోట వచ్చిన మౌలికమైన ఊహా తరంగాలు నాలుగు దిశలకి వ్యాపించి, కాలక్రమేణా దేశ, కాల, పరిస్థితులకి మార్పులు చెంది, రకరకాల కథలుగా అవతరించి ఉండవచ్చు. స్వర్గం, నరకం, దేవతలు, దానవులు, మంచి, చెడు అనే భావాలకి భౌగోళిక పరిధులు ఉన్నట్లు తోచదు.

పురాతన కాలపు గ్రీసు దేశంలో ప్రజలు బహుదేవతారాధకులు. ప్రకృతిలో మనకి కనిపించే శక్తులు దేవతల ఆధీనంలో ఉంటాయని నమ్మేవారు. ఆయా దేవతలు ప్రసన్నమైతే ఆయా శక్తులు మనకి అనుకూలంగా ఫలితాలని ఇస్తాయని నమ్మేవారు.

గ్రీసు దేవతలలో ఏకోదరుల మధ్య వివాహాలు జరిగితే తప్పుకాదు; అదే విధంగా తల్లికి కొడుకుకి మధ్య వైవాహిక సంబంధం కానీ, తండ్రికి, కూతురుకి మధ్య వైవాహిక సంబంధం కానీ సమ్మతమే. సృష్ట్యాదిలో ఈ రకం సంబంధాలు తప్పనిసరి. ఈ రకం సంబంధాలు మన పురాణాలలోను కనబడతాయి. దేవతలని, అమరులని మానవ లోకంలో ఉన్న విలువల పట్టకం ద్వారా విమర్శించి

ప్రయోజనం లేదు. అదే విధంగా ఇరవై ఒకటవ శతాబ్దపు విలువలని, శాస్త్ర పరిజ్ఞానాన్ని గజం బద్దలా వాడి వీరిని విమర్శించి లాభం లేదు.

మన ప్రాచీన పురాణగాథలు రామాయణ, మహాభారతాలలో ఇమిడి ఉండడమే కాకుండా మన అష్టాదశ పురాణాలలో కూడ ఉన్నాయి. ఇదే విధంగా గ్రీసు దేశానికి సంబంధించిన ప్రాచీన పురాణ గాథలు హోమర్ (సా. శ. పూ. 800) రాసిన ఇలియాడ్, ఆడెస్సి అనే గ్రంథాలలోను, హెసియోడ్ (సా. శ. పూ. 700) రాసిన థియోగొనీ లోను, వర్జిల్ (సా. శ. పూ. 20) రాసిన ఎనియాడ్ (Aeneid), వగైరా గ్రంథాలలోనూ కనిపిస్తాయి. (ఇక్కడ ఇచ్చిన తేదీలు అన్నీ సుమారుగా తీసుకోవాలి; కచ్చితంగా ఎవ్వరికీ తెలియదు. సా. శ. పూ. అంటే "సాధారణ శకానికి పూర్వం," అనగా పాత పద్ధతిలో, "క్రీస్తు పూర్వం" అని అర్థం.)

గ్రీకు పురాణాలలో కథలకి, మన పురాణగాథలకి మధ్య ఎంత "గట్టి" పోలికలు అంటే ఒకరి నుండి మరొకరు "అనుకరించారా?" అన్న అనుమానం రాక మానదు. "ఎవరి నుండి ఎవరు?" అనే ప్రశ్న వేసుకుని అనవసరంగా ఆరాట పడే కంటే ఆ పోలికలు కొన్ని చూద్దాం.

ఉదాహరణకి మేషాది మీన పర్యంతం ఉన్న ద్వాదశ రాశులనే తీసుకుందాం. భూమి నుండి సూర్య చంద్రులని చూసినప్పుడు నేపథ్యంలో కనిపించే నక్షత్ర సమూహాలకి మన పూర్వులు మేషం, వృషభం, ----, మీనం అని పేర్లు పెట్టేరు. ఎందుకని ఈ పేర్లు పెట్టేరుట? ఆ నక్షత్ర సమూహాలు ఆయా శాల్తీల ఆకారాలలో ఆనాటి వీక్షకులకి కనిపించి ఉంటాయి. నా కంటికి ఈ ఆకారాలు అలా అనిపించలేదు. ఎక్కడో, ఎవ్వరికో ఒక నక్షత్ర సమూహం మేషం ఆకారంలోనో, వృషభం ఆకారంలోనో కనిపించి ఉండు గాక. కానీ అవే నక్షత్ర సమూహాలు అన్ని దేశాలలో అవే ఆకారాలలో కనిపించేయనడం నమ్మశక్యం కాని ఊహ. ఈ రాశి చక్రం లోని పేర్లు ఇటు నుండి అటు అయినా వెళ్లి ఉండాలి. లేదా, అటు నుండి ఇటు అయినా వచ్చి ఉండాలి. లేదా, వీటికి మూలం మరొక భౌగోళిక ప్రాంతంలో ఉండి ఉండాలి.

మరొక ఉదాహరణగా మన వారాల సంగతి చూద్దాం. మొదటగా, వారానికి ఏడు రోజులే ఎందుకు ఉండాలి? సప్తర్షి మండలం (బృహదృక్షం లేదా పెద్ద ఎలుగు) లోను, లఘు ఋక్షం లేదా చిన్న ఎలుగు) లోను ఏడేసి నక్షత్రాలు ఉండడము వల్ల ఏడుకి కొంత ప్రత్యేకత వచ్చి ఉండవచ్చు. ఆకాశంలో కదులుతూ, స్ఫుటంగా కనిపించే నభోమూర్తులు – అనగా, సూర్యుడు, చంద్రుడు, బుధ, శుక్ర, కుజ, గురు, శని గ్రహాలు – ఏడు కావడం మరొక కారణం కావచ్చు. ఆ రోజుల్లో కృత్తికలో ఏడు నక్షత్రాలు ఉండడం (ఇప్పుడు ఆరే ఉన్నాయి!) ఏడుకి ప్రత్యేకత వచ్చి ఉండవచ్చు. లేదా, చాంద్ర మాసంలో 28 రోజులు కనుక అందులో నాలుగు వారాలు సరిగ్గా ఇముడుతాయి కనుక వారానికి ఏడు రోజులు ఉంటే లెక్కకి సదుపాయంగా ఉంటుంది కదా! (ఈజిప్టులో వారానికి పది రోజులు ఉండేవి! రోమ్ లో వారానికి ఎనిమిది రోజులు ఉండేవి.) వారానికి ఏడు రోజులు ఉంటే బాగుంటుందని మొదట ప్రతిపాదించింది బాబిలోనియాలో!

ఇక వారాల పేర్లు చూడండి. ఇక్కడ ఇంగ్లీషు వారాల పేర్లకి, తెలుగు పేర్లకి మధ్య సామరస్యం కనిపించదు. తెలుగు (సంస్కృతం) పేర్లు అకాశంలో కనిపించే గ్రహాల పేర్లని ఆధారంగా చేసుకుని పెట్టినవి (రవి, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని). కానీ ఇంగ్లీషు పేర్లలో ఒక క్రమబద్ధత కనిపించదు. ఇంగ్లీషులో గ్రహాల పేర్లని ఆధారంగా చేసుకుని పెట్టినవి Saturday, Sunday, Monday. మిగిలినవి జెర్మనీ దేవుళ్ళ పేర్లని ఆధారంగా చేసుకుని పెట్టినవి. గ్రీసు దేశంలో పెట్టినవి రవి, చంద్ర, మంగళ (ఏరిస్), బుధ (హెర్మీస్), గురు (జూస్), శుక్ర (ఏఫ్రొడైటి), శని (క్రోనోస్). గ్రీసు, రోమక పురాణగాథలలో వీటి వెనుక చాల లోతైన కథలు ఉన్నాయి.

మన వారాల పేర్లకి, మన పురాణ గాథలకి మధ్య లంకె ఉందేమో కానీ నాకు కనబడ లేదు. “వేదకాలంలో ఏడు వారాల భావన (concept) లేదు. మనకు తిథులు, మాసాలు మాత్రమే తెలుసు. తిథుల గురించి, నక్షత్రాల గురించి విపులంగా ఉన్న ప్రాచీన వైదిక వాఙ్మయం, వారాల గురించి రాయలేదనే చెప్పాలి. అయితే, తరువాతి కాలంలో ఏడు రోజులు, ఏడు గ్రహాలు మనకు హోరశాస్త్రం ద్వారా, ఆ తరువాత సూర్య సిద్ధాంతం ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చాయి (హోరశాస్త్రముపై గ్రీకుల, రోమన్ల, పారశీకుల ప్రభావం ఉంది)” అంటూ సురేశ్ కొలిచాల అభిప్రాయపడ్డారు.

నక్షత్రాల పేర్లు, రాసుల పేర్లు చూసినప్పుడు కొంత సంబంధం ఉన్నట్లు అనిపించవచ్చు; కానీ ఇది మనవాళ్ళు క్లాసు పీకితే కనిపిస్తున్న సంబంధమో, నిజంగానే ఉందో ఖరాఖండిగా చెప్పడం కష్టం.

నెలల పేర్లు వచ్చేసరికి మాత్రం మన చైత్ర వైశాఖాదులకి తార్కికమైన కారణం ఉంది. పూర్ణిమ నాడు చంద్రుడు ఏ నక్షత్రంతో కలసి ఉంటాడో ఆ నెలకి ఆ నక్షత్రం పేరు వస్తుంది. ఉదాహరణకి చంద్రుడు పౌర్ణమినాడు చిత్త నక్షత్రంలో ఉంటే ఆ నెలకి చైత్రం అని పేరు. జనవరి, ఫిబ్రవరి, వగైరాలకి ఇటువంటి సంబంధం కనిపించదు.

మనకి మేరువు పర్వతం ఉంటే వారికి ఒలింపస్ పర్వతం ఉంది. మేరువు పర్వతం చుట్టూ సప్తద్వీపములు ఉండుననియు, ఈ పర్వతం స్వర్ణమయమై దేవతలకు స్థానమై ఉండుననియు మన పురాణాలు చెబుతున్నాయి. ఒలింపస్ పర్వతం మీద వారి దేవతలు అందరూ ఉంటారు. మన దేవతలూ, వారి దేవతలూ అమరులే. మన దేవతలకి అమృతం తాగితే అమరత్వం సిద్ధించింది. వారి దేవతలు "అంబ్రోజియా" తింటారు, "నెక్టర్" తాగుతారు. విష్ణుమూర్తి మోహినీ వేషంలో దేవతలకి అమృతం పంచిపెడుతున్న సమయంలో కశ్యపుని పౌత్రుడైన రాహువు దేవతల వరసలో చేరి దొంగతనంగా అమృతం తాగినందుకు శిక్షగా విష్ణుమూర్తి అతని తలని తన చక్రంతో నరికినప్పుడు శిరోభాగము రాహువు గాను, మొండెము కేతువు గాను మారతాయి. గ్రీసు పురాణాలలో టెంటలస్ "అంబ్రోజియా" ని దొంగిలించి తిన్నందుకుగాను ఆకలిదప్పికలతో పాతాళంలో పడి ఉండమని శాపం పొందుతాడు.

తనకి పుట్టిన సంతానమే తన మరణానికి కారణం అవుతుందని తెలుసుకుని రేయాకి పుట్టిన ప్రతి బిడ్డని క్రోనస్ మింగేస్తాడు. చిట్టచివరికి కడసారపు బిడ్డ జూస్ ప్రాణం కాపాడడానికి రేయా కుట్ర పన్నుతుంది. ఇక్కడ శంతనుడు-గంగ కథ కానీ కంసుడు-కృష్ణ కథ కానీ గుర్తుకి వస్తుంది. ఇలా వెతికితే బాహిరంగా ఇంకా చాల పోలికలు కనిపించినా ఇలియాడ్, ఆడెస్సి వగైరాలలో కనిపించే గ్రీసు పురాణ గాథలకి రామాయణ, మహాభారతాలలోను, హిందూ పురాణాలలోను కనిపించే కథలకి

మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. ఈ కథల ద్వారా ఈ పోలికలు, తేడాలు ఏమిటో వివరంగా తెలుసుకుందాం.

ఉపయుక్త గ్రంథాలు

Hesiod, Theogony (దేవతల ప్రవర, జన్మ వృత్తాంతం), Penguin Classics,

Stephen Markel, Origins of the Indian Planetary Deities, Edwin Mellen Press Limited, 1995

మహీధర నళినీమోహన్, నక్షత్ర వీధులలో భారతీయుల పాత్ర, అవంతి ప్రచురణలు, 2-2-185 /56/10 సోమసుందర్ నగర్, హైదరాబాదు, 500 013, నవంబరు 1997

https://en.wikipedia.org/wiki/Greek_mythology

# 3. క్రోనస్: టైటనుల అధినేత

గ్రీసు దేశపు పురాణగాథలలో మూడు తరాల "శాల్తీలు" కనిపిస్తారు: మొదటి తరం సృష్ట్యాదిలో ఉండే అస్తవ్యస్తత (chaos) నుండి పుట్టినవారు. వీరిని "దేవుడు," "దేవత" అని అభివర్ణించడానికి బదులు వీటిని మూర్తిత్వం లేని అభిజ్ఞానాలు (amorphous symbols) గా కానీ, అపరావతారాలు (personified concepts) గా భావించవచ్చు. రెండవ తరం వారు టైటనులు (Titans). సాంప్రదాయికంగా వీరిని దేవగణాలలో ఉంచుతారు కానీ, ఒక విధంగా చూస్తే వీరిలో కొందరు మన రాక్షసులని పోలిన శాల్తీలులా అనిపిస్తారు. మూడవ తరం వారు ఒలింపస్ పర్వతం మీద స్థిరనివాసం ఏర్పరచుకున్న ఒలింపియనులు. ఈ మూడవ తరం వారు మనకి పరిచయమైన దేవగణాల (అనగా, "దేవుళ్ళు," "దేవతలు") కోవ లోకి వస్తారు.

ఇక్కడ gods అనే ఇంగ్లీషు మాటని "దేవుళ్ళు," "దేవతలు" అని వాడడం జరిగింది. నిదానంగా ఆలోచిస్తే "gods" అన్న మాటని సురులు, అసురులు అని తెలిగించి సురులని "దేవతలు" గా పరిగణించి, అసురులులో మంచి వాళ్ళని "దేవతల" కోవలో పడేసి, చెడ్డ వాళ్ళని రాక్షసులుగా లెక్కలోకి తీసుకోవచ్చు. ఈ సూక్ష్మ భేదాలని విస్మరించి అందరినీ "దేవుళ్ళు" అనే – లింగ భేదం లేకుండా – అనడం జరిగింది.

గ్రీసు దేవుళ్ళు హిందూ దేవుళ్ళలాంటి వాళ్లు కారు; వీళ్లల్లో ఈర్ష్య, అసూయ, పగ, జుగుప్స వంటి లక్షణాలు మానవులలో కంటె ఎక్కువ మోతాదులో ఉన్నట్లు అనిపిస్తుంది. వీరు మానవులని సృష్టించి వారిని చదరంగంలో పావులని నడిపినట్లు నడిపి ఆడుకుంటారు. ఉదాహరణకి అందంలో ఎవరు గొప్ప అని పోటీ పడి ముగ్గురు దేవతలు ట్రోయ్ నగరంలో మహా సంగ్రామానికి కారకులు అవుతారు.

## 1. మొదటి తరం మూర్తిత్వం లేని అభిజ్ఞానాలు (“దేవశక్తులు”)

మొదట్లో – సృష్ట్యాదిలో – అంతా అస్తవ్యస్తం. ఆ అస్తవ్యస్తం (chaos) నుండి మొట్టమొదట గాయా (Gaia) లేదా భూదేవి, మరి కొన్ని ఇతర ప్రాథమిక శక్తులు (లేదా అపరావతారాలు, లేదా దైవాంశాలు) పుట్టుకొచ్చేయి: (1) ఎరోస్ (Eros) అనే కామ దైవం, (2) ఎబిస్ (Abyss) అనే పాతాళం. ఇక్కడే పాతాళ లోకానికి అధిపతి అయిన టార్టరస్ (Tartarus) ఉంటాడు. అదే పేరున ఒక బందిఖానా కూడా ఉన్నది, (3) ఎరిబస్ (Erebus) చీకటికి అధిపతి, (4) నిక్స్ (Nyx ) రాత్రికి అధిపత్ని, మొదలైనవి.

టార్టరస్ (పాతాళ లోకం) నుండి రకరకాల రాక్షసాకారాలు పుట్టుకొచ్చేయి. వాటిల్లో ముఖ్యమైనవి: (1) సెర్బిరస్ (Cerberus) అనే మూడు తలకాయల కుక్క. ఇది నరకపు ద్వారాల దగ్గర కాపలా కాస్తూ ఉంటుంది. (2) డ్రేగన్ (Dragon) – “జేసన్, ఆర్గోనాట్లు, బంగారు ఉన్ని” కథలో వచ్చే పెద్ద పామును పోలిన శాల్తీ. (3) స్పింక్స్ (Sphinx) – మానవ ముఖం, సింహపు శరీరం, పక్షి రెక్కలు కల ఒక వింత జంతువు. (4) హార్పీస్ (Harpies) – మానవ ముఖం ఉన్న ఒక రకం పక్షి. (5) సైరన్లు (Sirens) – రెక్కలు ఉన్న స్త్రీ రూపాలు. (6) గోర్గన్ (Gorgon) లు – ఈ వికృతాకారులలో పేరెన్నిక గన్నది మెడ్యూసా (Medusa). ఈ మెడ్యూసా తలలో జుత్తుకి బదులు పాములు ఉంటాయి. ఈ మెడ్యూసా ఎవరిని చూస్తే వారు రాయిగా మారిపోతారు.

ఎరిబస్ కీ  నిక్స్ కీ పుట్టిన ఖేరాన్ (Charon)  పాతాళ లోకంలో ఉన్న నరకానికి వెళ్లే దారిలో వచ్చే స్టిక్స్ (Styx) వంటి నదులని దాటడానికి పడవ నడుపుతూ ఉంటాడు. చనిపోయినవారు ఈ నదులని దాటుకుని అటు వెళ్ళాలి. మన వైతరణికి ఇక్కడ  స్టిక్స్ కి పోలిక చూడండి.

## 2. రెండవ తరం దేవగణాలు (టైటనులు)

గ్రీకు పురాణాలలో గాయా సంతానం గురించి పరస్పర విరుద్ధమైన కథలు ఎన్నో ఉన్నాయి. బాగా ప్రచారంలో ఉన్న కథనాల ప్రకారం పురుషుని సహాయం లేకుండా గాయా, ఆకాశానికి అధిపతి అయిన యూరెనస్ కి జన్మనిచ్చింది, అప్పుడు అతను ఆమెని ఫలవంతురాలిని చేసాడు. ఈ తల్లీ-కొడుకుల కలయిక నుండి మొదట టైటనులు (Titans) జన్మించారు. (వీరు కాసింత రాక్షస అంశ ఉన్న వారులా అనిపిస్తారు కానీ వీరిని "టైటన్ దేవగణాలు" అనే అంటారు.) తరువాత ఒంటికన్నుతో ఉండే సైక్లాపులు (Cyclops) ముగ్గురు పుట్టేరు. తరువాత అందవికారంగా, ఏభయ్ తలలు, వందేసి చేతులతో, హెకటాంకీర్ లు (Hecatonchires) అనే శతబాహులు ముగ్గురు పుట్టేరు. వారి పేర్లు ప్రస్తుతానికి అనవసరం.

అందవికారంగా ఒంటికన్నుతో ఉన్న సైక్లాపులని, వందేసి చేతులు ఉన్న హెకటాంకీర్ లని చూసి యూరెనస్ అసహ్యించుకుని వారిని తిరిగి తల్లి గాయా (అనగా, భూదేవి) గర్భకుహరం లోకి (అనగా, పాతాళం లోకి) తోసేసేడు. ఈ అమానుష చర్యకి మిక్కిలి దుఃఖ పడి ప్రతీకారం కోసం గాయా ఒక కొడవలిని తయారు చేసి, అదను కోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

సైక్లాపులు, హెకటాంకీర్ లు జన్మించిన తరువాత ఇంక రాక్షస ఆకారాలు ఉన్న పిల్లలు పుట్టకుండా గాయా-యూరెనస్ లు విడిపోయారు.

యూరెనస్-గాయా (ఆకాశం-భూమి) ల కలయిక వల్ల పుట్టిన పన్నెండుమంది టైటనులలో ఆరుగురు మగ, ఆరుగురు ఆడ:

మగవారు: (1) ఓషనస్ (సముద్రాలకి అధిపతి), (2) హైపీరియన్ (కాంతికి అధిపతి), (3) కోయస్ (బుద్ధి, దూరదృష్టికి అధిపతి), (4) క్రీయస్ (గగన వీధిలోని నక్షత్ర రాసులకి అధిపతి), (5) క్రోనస్ (కాలానికి అధిపతి), (6) అయాపిటస్ (నీతికి అధిపతి).

ఆడవారు: (1) టేథీస్ (మంచినీటికి అధిపత్ని), (2) థియా (దృష్టికి అధిపత్ని), (3) నేమొజీన్ (జ్ఞాపక శక్తికి అధిపత్ని), (4) ఫీబీ (వర్చస్సుకి అధిపత్ని), (5) రేయా (మాతృత్వానికి అధిపత్ని), (6) థీమస్ (ధర్మదేవత లేదా చట్టబద్ధతకి అధిపత్ని).

ఈ టైటన్ దేవగణాల గురించి తరువాత, సందర్భం వచ్చినప్పుడు, సావధానంగా మాట్లాడుకుందాం. ప్రస్తుతానికి కొన్ని ఆసక్తికరమైన చిల్లర విషయాలని చూద్దాం. (ఇక్కడ ఏకోదరుల మధ్య వివాహాలు గమనించండి. సృష్ట్యాదిలో ఇది తప్పదు!)

- "సముద్రపు జంట" అయిన ఓషనస్ (Oceanus) కీ టేథీస్ (Tethys) కీ అనేకమంది ఎలనాగలు లేదా "జలదేవతలు" (Nymphs) పుట్టేరు.
- "ఆకాశపు జంట" అయిన హైపీరియన్ (Hyperion) కీ థియా (Theia) కీ పుట్టిన పిల్లలలో హీలియోస్ (సూర్యుడు), సెలీన్ (చంద్రుడు) ముఖ్యులు.
- "భూ జంట" అయిన క్రోనస్ (Cronus) కీ రేయా (Rhea) కీ పుట్టిన పిల్లలే టైటనులు.
- అయాపిటస్ (Iapetus) కి పుట్టిన పిల్లలలో చాలా మందిని మనం గుర్తించగలం:

(1) ఏట్లస్ (Atlas) నిరంతరం భూమిని భుజాల మీద మోసే శాల్తీ.

(2) ప్రొమీథియస్ (Prometheus) మానవుల పుట్టుకకి కారకుడు.

(3) ఎపిమీథియస్ (Epimetheus) మొట్టమొదటి మానవ స్త్రీని – పెండోరా ని – జూస్ ఆజ్ఞానుసారం తయారు చేసేడు. ప్రొమీథియస్, ఎపిమీథియస్ లు దేవతలకి, మానవులకి మధ్య లంకె వంటి వారు.

## 3. క్రోనస్ ఉత్థానపతనాలు

మొదటి తరం టైటనులలో క్రోనస్ కడసారం. క్రోనస్ కుతంత్ర బుద్ధి కలవాడు, అత్యంత భయంకరమైనవాడు. తల్లి గాయాకి జరిగిన అవమానానికి పగ తీర్చుకోగల సమర్ధుడు. క్రోనస్ ఒక రాత్రి యూరెనస్ మీదకి లంఘించి అతని జననాంగాలని తల్లి ఇచ్చిన కొడవలితో నరికేసి వాటిని

సముద్రంలో విసిరేసాడు. ఆ జననాంగాల నుండి స్రవించిన స్రావములతో ఒక రకం రాక్షసులు, జలకన్యలు, తదితరులు పుట్టుకొచ్చేరు. అలా పుట్టుకొచ్చిన వారిలో ఏఫ్రోడీటీ (Aphrodite) ఒకామె. ఈ సౌందర్యవతి లైంగిక ప్రేమకి చిహ్నం. ఇంగ్లీషులో కామోద్దీపక పదార్థాలని aphrodisiac అనడానికి మూలం ఇదే!

అంగవిహీనుడైన యూరెనస్ భూమిని వదలి పోతూ తనకి చేసిన అవమానానికి క్రోనస్ ప్రతిఫలం అనుభవిస్తాడనిన్నీ, తనకి జరిగినట్లే క్రోనస్ కి అతని పిల్లల చేతిలోనే ప్రతీకారం జరుగుతుందనిన్నీ చెబుతాడు (శపిస్తాడు?)

తండ్రిని పదవీ భ్రష్టుడిని చేసి రాజ్యం నుండి బహిష్కరించిన తరువాత క్రోనస్ సైక్లాపులని, హెకటాంకీర్ లని టార్టరస్ లో బంధిస్తాడు. ఇతర టైటనులు అతని సభికులుగా అయ్యారు. క్రోనస్ తన తండ్రిని తరిమేసిన తరువాత తన యొక్క సోదరి అయిన రేయాని జీవిత భాగస్వామినిగా స్వీకరిస్తాడు.

క్రోనస్–రేయాలకి పుట్టిన సంతానంలో ముగ్గురు మగ, ముగ్గురు ఆడ:
మగ వారు: హేడిస్, పొసైడన్, జూస్.
ఆడ వారు: హెస్టియా, డిమీటర్, హేరా.

తండ్రి యూరెనస్ ఇచ్చిన శాపం పదే పదే గుర్తుకి రాగా, రేయాకి పుట్టిన పిల్లల్ని పుట్టిన వెంటనే క్రోనస్ కబళించడం మొదలు పెడతాడు. అప్పుడు రేయా తన కడసారపు కొడుకు జూస్ ని ఒక పన్నాగం పన్ని రక్షిస్తుంది. క్రీట్ లో ఉన్న ఒక కొండ గుహలో జూస్ ని ప్రసవించగా అక్కడ జలకన్యలు జూస్ ని పెంచి పెద్ద చేస్తారు. అప్పుడు రేయా ఒక రాయిని పొత్తిళ్ళలో చుట్టబెట్టి "ఇదిగో నీ కొడుకు" అని చెబుతూ క్రోనస్ కి అందిస్తుంది. క్రోనస్ ఆ కట్టని అలానే అమాంతం మింగేస్తాడు.



బొమ్మ. క్రోనస్ తన బిడ్డనే తినెయ్యడం! Painting by Peter Paul Rubens (వికీపీడియా)



బొమ్మ. రేయా రాయిని దుప్పటిలో చుట్టబెట్టి క్రోనస్ కి ఇస్తున్న దృశ్యం (వికీపీడియా)

పెరిగి పెద్ద అయిన తరువాత జూస్ మందు కలిపిన సారాని తండ్రి క్రోనస్ కి ఇస్తాడు. అది తాగగానే వికారం పుట్టి వాంతి చేసుకుంటాడు. అలా గర్భకుహరంలో పెరుగుతున్న తన తోబుట్టువులకి విముక్తి కలిగిస్తాడు! పెరిగి పెద్దయిన తరువాత తన తోబుట్టువులతో కలసి పదేళ్ళపాటు టైటనులతో పోరు

కొనసాగించి, విజయం సాధించి, ఒలింపస్ పర్వతం తన (దేవతల పక్షం) వశం చేసుకుంటాడు. ఈ పోరాటాన్నే "టైటన్ మహా సంగ్రామం" అంటారు. ఈ పోరాటంలో ఓడిపోయిన క్రోనస్ ఏమయ్యాడో ఇదమిత్థంగా తెలియదు: టార్టరస్ లో బందీ అయాడని కొందరు, ఎలీసియం (Elysium) కి అధిపతిగా వెళ్లాడని కొందరు అంటారు. (ఎలీసియం అనేదానిని ఒక రకం స్వర్గసీమగా ఊహించుకోవచ్చు!)

చాలమంది స్త్రీలతో సంపర్కం ఉండడం వల్ల క్రోనస్ కి చాలమంది పిల్లలు ఉన్నారు. ఉదాహరణకి క్రోనస్ కి సముద్రపు జలకన్య ఫిలిరా (Phylyra)కి పుట్టిన కుమారుడు ఖైరాన్ (Chiron). బొమ్మలలో ఖైరాన్ ని "నరాశ్వం" (centaur) గా చిత్రిస్తారు; అనగా ముందు భాగం మనిషి ఆకారంలోను, పృష్ఠ భాగం గుర్రం ఆకారంలోనూ ఉండే నాలుగు కాళ్ళ శాల్తీ. పిల్లలని ప్రతిభావంతులుగా చెయ్యడంలో ఇతను అందె వేసిన చెయ్యి! ఇతను మూలికలు, ఓషధులు, మందులు యెడల విశేషమైన నైపుణ్యం కలవాడు.

# 4. ఒలింపియనులు



బొమ్మ: ఒలింపస్ పర్వతం (వికీపీడియా)

ఒలింపస్ పర్వతం గ్రీసు దేశంలో మిక్కిలి ఎత్తయిన పర్వతం (2,918 మీటర్లు ఎత్తు). దాని ఠీవి, దాని రాజసం, దాని అందంతో పాటు అది అందరికి అందుబాటులో లేని కారణంగా ప్రాచీన గ్రీసు దేశస్తులు దానిని దేవతల ఆలవాలంగా ఆరాధించేరు. ఈ పర్వతం మీదనే “టైటన్ మహాసంగ్రామం”లో విజయం సాధించిన ముఖ్యమైన పన్నెండు మంది దేవతలు నివాసమున్నారని ప్రాచీన కాలంలో గ్రీసు దేశస్తులు నమ్మేవారు. ఈ పన్నెండు మందిని “ఒలింపియనులు” అని పిలుస్తారు.

ఈ పన్నెండు మంది ఒలింపియను దేవతలలో --

- క్రోనస్ కి రేయాకి పుట్టినవారు ఐదుగురు: జూస్, పొసైడన్, హేరా, డిమీటర్, హెస్టియా. (అనగా, ఈ టైటనులు మొదటి తరం ఒలింపియనులు).

- జూస్ కి హేరా కి పుట్టిన పిల్లలు ఇద్దరు: ఏరీస్, హెఫయెస్టస్.
- జూస్ కి ఇతరులతో ఉన్న వివాహేతర సంబంధాల వల్ల పుట్టినవారిలో ఒలింపియను దేవతలుగా లెక్కలోకి వచ్చేవారు నలుగురు: హెర్మీస్, ఎథీనా, ఆర్టెమీస్, అపాలో. (అనగా, ఈ ఆరుగురు మొదటి తరం ఒలింపియనులు, రెండవ తరం టైటనులు)
- చిట్టచివరగా, యూరెనస్ వృషణాల నుండి పుట్టిన ప్రేమ దేవత ఏఫ్రోడీటీ. (పాతాళలోకానికి అధిపతి అయిన హేడీస్ ని ఈ పన్నెండు మందిలో లెక్కించరు.)

## 4.1 జూస్ కొలువులోని  ఒలింపియను దేవతల సమాచారం



బొమ్మ:  జూస్ (వికీపీడియా)

జూస్ కొలువులో ఉన్న పన్నెండు మంది ఒలింపియను దేవతలని  మరొక సారి మరొక కోణంలో చూద్దాం. కొన్ని కొన్ని పేర్లు దరిదాపు ఒకేలా ఉంటాయి కనుక  అన్ని పేర్లని ఇంగ్లీషు లిపిలో కూడా చూపుతున్నాను. ఉత్సాహం ఉన్నవాళ్లు గూగుల్ ఉపయోగించి  ఇంకా సమాచారం సేకరించగలరు.

1. జూస్ (Zeus): (రోమక పురాణాలలో జూపిటర్, Jupiter).  క్రోనస్ – రేయాల కొడుకు. దేవతలకి అధిపతి. ఆకాశానికి అధిపతి.  ఇతని ఆయుధం మెరుపులు, పిడుగులు. ఒకొొక్కసారి ధర్మ నిరతుడు. ఒకొొక్కసారి క్రూరంగా ప్రవర్తిస్తాడు. మన ఇంద్రుడి లాంటివాడు;  వేద భాషలోని ధౌష్పితృ (द्यौष्पितृ) కీ , గ్రీకు భాషలోని  జూస్ కి, లాటిన్ భాషలోని జూపిటర్ కి మధ్య పోలిక చూడండి. ఋగ్వేదం (1.164.33) ప్రకారం ఇంద్రుడు ద్యయుష్ (ఆకాశం) కి, పృధ్వి (భూదేవి) కి పుట్టిన కొడుకు.
2. హేరా (Hera):  (రోమక పురాణాలలో జూనో, Juno). క్రోనస్ – రేయాల  కూతురు. జూస్ చెల్లెలు, పట్టమహిషి.  ఈమెలో  అసూయ, క్రూరత్వం కనిపిస్తూ ఉంటాయి.  భర్తలో ఉన్న పర స్త్రీ వ్యామోహం ఈ లక్షణాలని రెచ్చగొడుతూ ఉంటాయి.
3. పొసైడన్ (Poseidon): (రోమక పురాణాలలో నెప్ట్యూన్,  Neptune). జూస్ తోబుట్టువు; ఒలింపియనులలో జూస్ తరువాత ముఖ్యుడు. సముద్రాలకి అధిపతి. పొసైడన్  కి కోపం వస్తేనే సముద్రంలో తుపానులు వస్తాయని నమ్మేవారు. ఒడీసియస్ (Odysseus లేదా Ulysses) మీద దశాబ్దాల పాటు కక్ష పెంచుకున్నాడు.
4. డిమీటర్ (Demeter):  (రోమక పురాణాలలో సీరీస్, Ceres). పాడి పంటలకి అధిపత్ని. క్రోనస్ – రేయాల కూతురు; జూస్ తోబుట్టువు; జూస్ కీ పొసైడన్  కి ప్రియురాలు.
5. ఎథీనా (Athena): (రోమక పురాణాలలో మినర్వా, Minerva).  విద్యలకి అధిపత్ని; జూస్ శిరస్సు నుండి సచేలంగా, సాలంకృతంగా పుట్టింది;  ఒడీసియస్  అంటే ఇష్టం; ఆర్టెమిస్ (Artemis),  హేస్టియా (Hestia)ల వలె  నిష్కళంకమైన శీలం;
6. అపాలో (Apollo): (రోమక పురాణాలలో కూడా అపాలో, Apollo).  జూస్ – లేతో లకి పుట్టిన కొడుకు.  ఆర్టెమిస్–అపాలోలు కవలలు. సంగీత సాహిత్యాలలో దిట్ట. డెల్ఫైలో ఉన్న

ఇతని ఓరకిల్ (గణాచారి) చెప్పే జోశ్యాల మీద అందరికీ ఎక్కువ నమ్మకం. (రెండవ తరం ఒలింపియను.)

7. ఆర్టెమీస్ (Artemes): (రోమక పురాణాలలో డయానా, Diana.) జూస్ – లేతో లకి పుట్టిన కూతురు. ఆర్టెమిస్–అపాలోలు కవలలు. ఎతినా వలె కాసింత మగరాయుడు. ఈమె మృగయావినోదాలకి అధిపత్ని. మంచి అందగత్తె. (రెండవ తరం ఒలింపియను.)
8. ఏరీస్ (Ares): (రోమక పురాణాలలో మార్స్ , Mars) యుద్ధ విద్యలకి అధిపతి; జూస్ – హేరా లకి పుట్టిన కొడుకు; రక్త పిపాస మెండు.
9. ఏఫ్రొడీటి (Aphrodite): (రోమక పురాణాలలో వీనస్, Venus) లైంగిక ప్రేమకి అధిపత్ని. యూరెనస్ జననాంగాలని కోసి సముద్రంలో పారేసినప్పుడు వాటి నుండి స్రవించిన తెల్లటి నురుగు నుండి పుట్టిన వ్యక్తి అని ఒక కథనం ఉంది. ట్రోయ్ లోజరిగిన యుద్ధానికి ప్రేరణ కారకులలో ఈమె ఒకరు. అందాలు చిందే ఏఫ్రొడైటి కురూపి, అవిటి అయిన హెఫయెస్టస్ (Hephaestus) ని పెళ్లి చేసు కోవడం కాసింత ఆశ్చర్యం కలిగించే విషయం. (టైటనుల తరానికి చెందిన ఒలింపియను);
10. హెర్మీస్ (Hermes): (రోమక పురాణాలలో మెర్కురీ, Mercury) కృత్తిక కన్యలలో ఒకరు, ఏట్లస్ కూతురు అయిన మాయ (Maia) కీ జూస్ కి పుట్టిన కొడుకు. దేవ దూత; బహుముఖ ప్రజ్ఞావంతుడు; దేవతల వార్తావాహకుడు. చెలగాటాలు ఆడడంలో దిట్ట. వీణ లాంటి వాయిద్యాన్ని పట్టుకుని విశ్వ పర్యటన చేస్తూ ఇక్కడి వార్తలు అక్కడకి చేర్చుతూ ఉంటాడు. ఈ కోణంలో హెర్మీస్ కి మన నారదుడికి పోలిక కనిపిస్తుంది. హెర్మీస్ కొడుకు ఒకడు నరమేషం (సగం మనిషి, సగం మేక) లా పుడతాడు. హెర్మీస్ కి ఏఫ్రొడీటికి పుట్టిన కొడుకు హెర్మేఫ్రొడీటస్ అర్ధనారి – అనగా ఒకే శరీరంలో ఆడా, మగా ఉన్న స్వరూపం. మరణించిన వారి ఆత్మలని దగ్గర ఉండి, చెయ్యి పట్టుకుని అధో (యమ) లోకానికి తీసుకెళతాడు.
11. హెఫయెస్టస్ (Hephaestus): (రోమక పురాణాలలో వల్కన్ , Vulcan) అగ్ని దేవుడు. దేవతల కమ్మరి. కురూపి. అందాలరాసి ఏఫ్రొడైటిని పెళ్లి చేసుకున్నాడు. హేరా


కొడుకు; తండ్రి ఎవ్వరో తెలియదు (జూస్ కావచ్చు) లేదా హేరాకి అనిషిక్తంగా పుట్టిన బిడ్డ (parthenogenous child) కావచ్చు!

12. హెస్టియా (Hestia) కానీ డయనీసస్ (Dionysus) కానీ:

(a) క్రోనస్ కి రేయాకి పుట్టిన ప్రథమ సంతానం హేస్టియా. జూస్, పోసైడన్, డిమీటర్, హేరా ల సోదరి. అపాలో, పొసైడన్ ఇద్దరూ ఈమె కోసం పోట్లాడుకుంటూ ఉంటే వారి పోట్లాటని ఆపడానికి జీవితాంతం కన్యగా ఉండిపోతానని ప్రతిన పూనుతుంది. దీనికి ప్రతిఫలంగా పూజలన్నిటిలోను ప్రథమ తాంబూలం ఇవ్వాలని జూస్ ఈమెకి "వరం" ఇచ్చేడు.

(b) జూస్ కీ మానవ వనితకు పుట్టిన బిడ్డ కనుక డయనీసస్ సంపూర్ణ దైవత్వం లేని వ్యక్తి (demigod) కనుక ద్వాదశ ఒలింపియనుల జాబితాలో ఇమడక పోవచ్చు.


ఒలింపస్ పర్వతం మీద నివాసం ఉండే ఈ మూడవ తరం దేవతలలో జూస్ – హేరా ల సంతానమే ఎక్కువమంది!




బొమ్మ. ఒలింపియన్ దేవతలు

(Courtesy, Mythologian.net,, No copyright infringement intended )

## 4.2 గ్రీసు పురాణ పాత్రల వంశవృక్షం




బొమ్మ. ముఖ్యమైన పాత్రల వంశవృక్షం, టూకీగా

(Courtesy, Digital Maps of the Ancient World, No copyright infringement intended)

మొదటి తరం:

యూరెనస్ కీ గాయా కీ → క్రోనస్, రేయా, థీమస్ (పెద్ద)

రెండవ తరం (టైటనులు):

క్రోనస్ కి రేయా కీ → జూస్, హేరా, పొసైడన్, హేడిస్, డిమీటర్, హెస్టియా

మూడవ తరం (ఒలింపియనులు)

జూస్ కి హేరా కీ → ఏరీస్, హెఫయెస్టస్ (లేదా, హేరా → హెఫయెస్టస్?)

జూస్ కి మేటిస్ కీ → ఎథీనా

జూస్ కి లేతో కీ → అపాలో, ఆర్టెమీస్

జూస్ కి మయియా కీ → హెర్మీస్

జూస్ కి సెమిలీ కీ → డయనీసస్

జూస్ కి డయోన్ కీ → ఏఫ్రొడీటి? లేదా యూరెనస్ వృషణాల నుండి → ఏఫ్రొడీటి? (లేదా, జూస్ కి డయోన్ కీ → ఏఫ్రొడీటి?)
జూస్ కి ఇతరులతో → పెర్సిఫొనీ, పెర్సియస్, హెరాక్లిస్, ట్రోయ్ కి చెందిన హెలెన్, మినోస్, కాకుండా నేమొజీన్ తో తొమ్మిది మంది మూజ్ లు. (ఈ మూజ్ లు కళలకి, విద్యలకి అధిపత్నులు.)

హేడీస్ (Hades): క్రోనస్ – రేయా ల కొడుకు. జూస్, పోసైడన్, డిమీటర్, హేరా, హేస్టియా ల సోదరుడు. క్రోనస్ ని పదవీ భ్రష్టుడిని చేసేక క్రోనస్ రాజ్యం ముక్కలైపోయింది. పాతాళం హేడీస్ కి దక్కింది. అప్పుడు హేడీస్ తన రాణి పెర్సిఫోనితో గద్దె కెక్కి మరణించిన ఆత్మలపై అధోలోకంలో పాలన సాగించేడు. ఈ పరిపాలనలో సెర్బిరస్ అనే మూడు తలల కుక్క అతనికి సహాయపడింది.

థీమస్ (Themis): యూరెనస్–గాయా ల పుత్రిక. జూస్ భార్యలలో ఒకరు. "ధర్మం" అనే అమూర్త భావానికి మూర్తీభవించిన ప్రతీక ఈమె. అనగా, ఈమె ధర్మపరిపాలనకి అధినేత్రి. ఈమె కుడి చేతిలో దుష్ట శిక్షణకి ఒక కత్తి, ఎడమ చేతిలో నిష్పక్షపాత ధర్మపాలనకి గురుతుగా ఒక త్రాసు ఉంటాయి. ఈమె కళ్ళకి కట్టిన గుడ్డ తీర్పు కొరకు వచ్చిన ప్రత్యర్థుల సాంఘిక స్థాయికి అతీతంగా ఆమె తీర్పు ఉంటుందని సూచిస్తుంది. జూస్ అంతటివాడు తనకి వచ్చిన ధర్మసందేహాలని తీర్చుకుందుకి ఈమెని సంప్రదిస్తూ ఉంటాడు.

## 4.3 గ్రీసు పురాణకథలపై ఒక వ్యాఖ్య

గ్రీసు పురాణ కథలు అన్నీ కేవలం పుక్కిటి పురాణగాథలని మనకి ఇప్పుడు తెలుసు. కానీ మనకి ఈ రోజులలో రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, జీసస్, మహమ్మద్, వగైరాలు ఎటువంటి "చారిత్రక" వ్యక్తులో ఆ కాలంలో ప్రజలకి ఒలింపియను దేవతలు కూడా "చారిత్రక" వ్యక్తులే! కానీ కాలక్రమేణా ఇవి మానవులకి నీతులు నేర్పే పురాణకథలుగా పరిగణన చెందడం మొదలయింది.

విమర్శకులకు గ్రీసు దేశపు పురాణకథలలో తరచు మానవ జీవితాలలో దేవతలు తల దూర్చి మానవులని ఆటలలో పావులులా ఉపయోగించుకుంటున్నట్లు కనిపించవచ్చు. లేదా, ఆశా దృక్పథంతో చూసేవారికి గర్వమదాంధకారంతో ప్రవర్తించడం  వల్ల కలిగే నష్టం ఎలా ఉంటుందో చూపించే నీతి కథలా ఉండొచ్చు. ఎప్పుడైనా  ఒక మనిషి కానీ, ఒక చిల్లర దేవత కానీ తన కంటే పై మెట్టులో ఉన్న దేవతతో సమాన ఉజ్జినని విర్రవీగడడం  మొదలు పెడితే ఆ వ్యక్తి తక్షణం శిక్ష అనుభవించడం మనం తరచు చూస్తాం.

# 5. జూస్: ఒలింపియనుల అధినేత



బొమ్మ. జూస్ (వికీపీడియా)

జూస్ దేవలోకానికి – అనగా, గ్రీసు దేవతలకి ఆవాసమైన ఒలింపస్ పర్వతం మీద ఉన్న అమర లోకానికి – అధిపతి. పోలికలు ముమ్మూర్తులా సరిపోవు కానీ జూస్ ని మన ఇంద్రుడితో పోల్చవచ్చు.

ఋగ్వేదంలో ఆకాశానికి అధిపతి అయిన "డయుస్" పేరుకి, జూస్ కి మధ్య ఉన్న పోలిక కేవలం కాకతాళీయం కాదు. వీరిరువురి ఆయుధాలు మెరుపులు, పిడుగులు అవడం గమనార్హం.

క్రోనస్ – రేయాలకి పుట్టిన పిల్లలో కనిష్ఠుడు అయిన జూస్ జన్మ వృత్తాంతం, జూస్ గద్దెకి ఎక్కిన వయినం చూస్తే క్రోనస్ చరిత్ర పునరావృత్తమయిందా అని అనిపిస్తుంది. తన తండ్రిని పదవీ భ్రష్టుడిని చేసి, టార్టరస్ లో బందీ చేసి జూస్ గద్దెకి ఎక్కిన ఉదంతం ఎలా నడుస్తుందో చూద్దాం.

## 5.1 జూస్ జన్మ వృత్తాంతం

తన తండ్రి యూరెనస్ శాపం ఏ విధంగా పరిణమిస్తుందో అనే భయంతో క్రోనస్ తన సంతానాన్ని మింగేసి తన కడుపులో బంధిస్తాడు. కానీ రేయా పన్నుగడ పన్ని తన కడసారపు బిడ్డ జూస్ స్థానంలో ఒక రాయికి దుప్పటి గుడ్డ చుట్టబెట్టి క్రోనస్ కి ఇస్తుంది. ఆ రాయిని క్రోనస్ మింగేస్తాడు. ఈ విధంగా క్రోనస్ కడుపులోకి వెళ్లకుండా జూస్ రక్షణ పొందుతాడు. రేయా అప్పుడు జూస్ ని తీసుకుని క్రీట్ ద్వీపంలో, ఒక గుహలో, దాచిపెడుతుంది. అక్కడ ముగ్గురు వసంత దేవతలు జూస్ ని పెంచి పెద్ద చేస్తారు.

జూస్ పెద్దవాడు అయిన తరువాత అతని భార్య మెతీస్ ఇచ్చిన మత్తు పదార్థం కలిపిన పానీయాన్ని తన తండ్రికి ఇచ్చి క్రోనస్ వాంతి చేసుకోనేటట్టు చేస్తాడు. ఫలితంగా అప్పటి వరకు క్రోనస్ పొట్టలో ఎదుగుతూన్న రేయా యొక్క మిగతా సంతానం, రాయితోపాటు బయటకి వచ్చేస్తారు.

తన తోబుట్టువులు క్రోనస్ కడుపు నుండి విడుదల అయిన తరువాత గద్దె కొరకు యుద్ధం చెయ్యమని క్రోనస్ కి సవాలు విసురుతాడు, జూస్. పదవిలోఉన్న టైటన్లతో పదేళ్ళపాటు యుద్ధం చేసి, చివరకి, సైక్లోప్స్ (వీరికి టార్టరస్ నుండి జూస్ విముక్తి కల్పించాడు) సహాయంతో జూస్, అతని సహోదరులు విజయం సాధించారు. అదే సమయంలో క్రోనస్, ఇతర రాక్షసులు టార్టరస్ లో ఖైదు పాలవుతారు. ఆ తరువాత జూస్ తన సోదరి హేరాని పెళ్లి చేసుకుంటాడు. జూస్, అతని మిత్ర బృందం, ఒలింపస్

పర్వతం మీద స్థిరనివాసం ఏర్పరచుకుంటారు. హేడిస్ (Hades) పాతాళానికి, పొసైడన్ (Poseidon) సముద్రాలకి, జూస్ (Zeus) ఆకాశానికి అధిపతులు అవుతారు. జూస్ దేవలోకానికి అంతటికి పాలకుడుగా చెలామణి అవుతాడు.

జూస్ కి ఏడుగురు భార్యలు. ఏడుగురు భార్యలూ అమరులే. వారి పేర్లు: మెతీస్ (Metis), థీమస్ (Themis), యురినోమి (Eurynome), డిమీటర్ (Demeter), నేమొజీన్ (Mnemosyne), లేతో (Leto), హేరా (Hera). అయినా జూస్ కి స్త్రీ లోలత్వం పోలేదు. జూస్ అనేక స్త్రీలతో మొత్తం 92 మంది పిల్లలకి తండ్రి అవుతాడు!

"తన కంటే గొప్పవాడు" అయిన కుమారునికి జన్మనిస్తుంది అని తెలిసి, జూస్ తన మొదటి భార్య అయిన మెతీస్ ని మాయ చేసి, ఈగగా మార్చి, మింగేస్తాడు. ఆమె అప్పటికే ఎథీనాని గర్భాన్న కలిగి ఉంది. ఏది ఏమయినప్పటికీ, ఎథీనా పూర్తిగా పెరిగి, యుద్ధం కొరకు దుస్తులు, ఆయుధాలు ధరించి, జూస్ తల నుండి బయటికి వస్తుంది.

జూస్ కి నేమొజీన్ (Nemesis) తో పుట్టిన తొమ్మిది మంది అడ పిల్లల్ని “మూజ్” (Muse) లు అంటారు. తల్లి నేమొజీన్ జ్ఞాపక శక్తికి అధిపత్ని అయితే తొమ్మిది మంది “మూజ్” (Muse) లు సాహిత్యాలకి , కళలకి, శాస్త్రాలకి అధిపత్నులు. ఒక గ్రంథ రచన వంటి భృహత్కార్యం తలపెట్టినప్పుడు సాహిత్యాలకి అధిపత్ని అయిన మూజ్ ని ఆహ్వానించి పని ఉపక్రమించడం ఆనవాయితీగా జరుగుతుంది.



బొమ్మ. జూస్ రథం (Alfred Church గీసిన చిత్రం. వికీపీడియా నుండి)

# 6. అపస్వరం అనే ఏపిల్ పండు కథ



బొమ్మ. పేరిస్ తీర్పు చెప్పడం (వికీపీడియా నుండి)

గ్రీసు దేశపు  పురాణ గాథలలో ఒక కథ ఇది. ప్రస్తుతం టర్కీ దేశం ఆక్రమించిన ప్రాంతాన్ని పూర్వం ఏసియా మైనర్ అనేవారు. ఈ ప్రాంతపు ఈశాన్య మూలకి ట్రోయ్ అనే నగరం ఉండేది. గర్భవతిగా ఉన్న ఈ నగరపు రాణి హెకూబా (Hecuba) ఒక రాత్రి  ఒక వింతైన జ్వాలని ప్రసవించినట్లు కలని కన్నది. రాజు ఆస్థాన జ్యోతిష్కుడిని పిలిపించి కలకి అర్థం చెప్పమని అడిగేరు.

"రాజా! రాణి వారు ప్రసవించబోయే బాలుడు ట్రోయ్ నగరపు వినాశనానికి కారకుడు అవుతాడు! ఈ రాజ్యాన్ని, ప్రజలని రక్షించుకోవాలంటే ఈ బాలుడిని హతమార్చవలసిందే"  అని జోశ్యంతో పాటు సలహా కూడా  చెప్పేడు, ఆస్థాన జ్యోతిష్కుడు!

భూపతనమైన వెంటనే బాలుడిని హతమార్చమని భటుడికి  ఆదేశం ఇచ్చేడు రాజు. ముక్కుపచ్చలారని పసికందు ప్రాణాలు తియ్యలేక భటుడు ఆ పసికూనని ఇడా (Ida) పర్వతం మీద ఒక  చెట్టు కింద వదిలేసి వెళ్ళిపోయాడు. ఆ పసి కందుని ఒక ఎలుగుబంటి చూసింది. పాపని చూసి, జాలిపడిందో ఏమో  రాత్రల్లా కాపలా కాసింది. మరునాడు బాలుడు ఏమయ్యాడో చూద్దామని భటుడు తిరిగి వచ్చేడు. ఆ బాలుడు ప్రాణాలతో కనిపించేసరికి "ఈ బాలుడు భవిష్యత్తులో ఏదో  సాధించవలసి ఉంది.

అందుకనే ప్రాణాలతో బయట పడ్డాడు" అనుకుంటూ ఆ పసివాడిని రహస్యంగా తన ఇంటికి తీసుకెళ్లి పెంచుకున్నాడు. శుక్లపక్ష చంద్రుడిలా పెరిగిన పేరిస్ (Paris) స్ఫురద్రూపి, సత్యసంధుడు, శీలవంతుడుగా ముల్లోకాలలోను పేరు తెచ్చుకున్నాడు.

పందేలలో పోటీకని పేరిస్ కోడె దూడలని పెంచేవాడు. పందెంలో తన గిత్తని ఎవ్వరి గిత్త ఓడగొడితే వారికి బంగారు కిరీటం బహుమానంగా ఇస్తానని పేరిస్ ఒక సారి సవాలు విసిరేడు. స్వర్గలోకంలో ఉన్న ఏరీస్ (Ares) ఈ సవాలు విన్నాడు. తానే స్వయంగా ఒక గిత్త రూపం దాల్చి పోటీలోకి దిగేడు. యుద్ధాలకి అధినేత అయిన ఏరీస్ ఈ పోటీని అనాయాసంగా గెలిచేడు. పేరిస్ పెద్దమనిషి తరహాలో ఓటమిని అంగీకరించి ఏరీస్ కి బంగారు కిరీటాన్ని బహూకరించేడు. ఈ సంఘటనతో "సత్యసంధుడు, మాట తప్పని పెద్దమనిషి" అని పేరిస్ భూమి మీద, స్వర్గంలోనూ పేరు ప్రతిష్ఠలు తెచ్చుకున్నాడు. ఇలాంటి పేరు రావడంతో ఒక అనూహ్యమైన పందేనికి పేరిస్ ఎలా న్యాయనిర్ణేత అయేడో చూద్దాం.

స్వర్గానికి అధినేత జూస్ భార్యలలో ఒకరైన థెమిస్ (Themis) జూస్ కొడుకులలో ఒకడు జూస్ ని పదవీభ్రష్టుడిని చేస్తాడని జోశ్యం చెప్పింది. ఈ జోశ్యం ఇలా ఉండగా జూస్ ఒక రోజు సముద్రపుటొడ్డుకి విహారానికని వెళ్లి, అక్కడ తేటిస్ (Thetis) అనే ఎలనాగ ని చూసి, మనసు పడి, గాంధర్వ విధిని పెళ్లి చేసుకుంటానంటాడు. అప్పుడు తేటిస్ కి పుట్టబోయే కొడుకు తండ్రిని మించిన వాడు అవుతాడు అని మరొకరు ప్రొమీథియస్ జోశ్యం చెబుతాడు. జూస్ రెండు, రెండు కలిపితే నాలుగు అని లెక్క వేసుకుని, పెద్ద ఎత్తున కంగారు పడి, తేటిస్ ని పీలియస్ (Peleus) అనే ముసలి మానవుడికి ఇచ్చి పెళ్లి చెయ్యడానికి తాంబూలాలు ఇప్పించేసేడు. అప్పుడు తేటిస్ కి పుట్టే కొడుకు మానవుడు అవుతాడు కనుక జూస్ ప్రాణానికి హాని ఉండదు. (దరిమిలా తేటిస్ కి ఒక కొడుకు పుడతాడు. అతని పేరు అఖిలీస్. ఈ కొడుకు ప్రాణాలకి ధోకా ఉండకూడదని ఆ తల్లి అఖిలీస్ మడమ చేత్తో పట్టుకుని పిల్లాడి నగ్న శరీరాన్నంటిని స్టిక్స్ నదిలో ముంచుతుంది. ఆ నీరు తగిలిన శరీరం వజ్రంలా తయారయి అఖిలీస్ ని కవచంలా కాపాడుతుంది!)

తేటిస్ – పీలియస్ వివాహపు విందుకి జూస్ అందరినీ ఆహ్వానించేడు – కలహభోజని అని పేరు తెచ్చుకున్న ఒక్క అరిస్ (Eris) ని తప్ప! తనకి ఈ విధంగా జరిగిన అవమానానికి అరిస్ కోపోద్రేకురాలు అయింది. అసహనంతో రగులుతున్న అరిస్ అతిథులు బారులు తీర్చి భోజనాలు చేస్తున్న మందిరానికి గాలివానలా దూసుకు వచ్చింది. ఆమె లోపలికి రాకుండా హెర్మీస్ అటకాయించి అగ్గి మీద గుగ్గిలం జల్లేడు. అరిస్ బయట నుండే "ఇదే నా పెండ్లి కానుక" అంటూ ఒక బంగారు ఏపిల్ పండుని అతిథుల మధ్యకి విసిరింది. ఆ బంగారు ఏపిల్ పండు మీద "ఇది ముల్లోకాలలోను అందమైన అతివకి మాత్రమే" అని రాసి ఉంది. ఇంకేముంది. "ఆ పండు నాదే!" అంటూ అక్కడ ఉన్న దేవతలంతా ఎగబడ్డారు. ఆ దొమ్మీలో హేరా, ఎథీనా, ఏఫ్రొడీటి అనే ముగ్గురు దేవతలు ఆ పండుని స్వాధీన పరచుకుందుకి పోటీ పడ్డారు. హేరా సాక్షాత్తు జూస్ భార్య. పైపెచ్చు పట్టమహిషి. ఈమె స్త్రీలకి, వివాహ జీవితాలకి అధినేత్రి. ఎథీనా విద్యలకి అధినేత్రి. ఏఫ్రొడీటి అందాలకి దేవత.

ఈ ముగ్గురిలోను పండు ఎవ్వరికి చెందాలి? ముగ్గురూ దేవతలకి రాజైన జూస్ ని తీర్పు చెప్పమన్నారు! జూస్ కి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు అయింది. ఎవరి పక్షాన్న తీర్పు చెబితే ఎవ్వరికి కోపం వస్తుందో! వారిలో ఒకామె తన పట్టమహిషి కూడా!

"ఈ సమస్యని న్యాయబద్ధంగా పరిష్కరించగలిగే స్థోమత భూలోకంలో ఉన్న ఒక్క పేరిస్ కి తప్ప మరెవ్వరికీలేదు" అంటూ తన కొడుకు హెర్మీస్ ని తోడు ఇచ్చి అందరిని భూలోకంలో ఇడా పర్వతం మీద పశువులనికాసుకుంటూన్న పేరిస్ దగ్గరకి పంపి ఇబ్బంది నుండి తప్పుకున్నాడు జూస్!

సాక్షాత్తు స్వర్గలోకానికి అధిపతి అయిన జూస్ తనయుడు హెర్మీస్ స్వయంగా వచ్చి అడుగుతూ ఉంటే పేరిస్ కాదనలేకపోయేడు.

దేవతల ముందు నిలబడి ముగ్గురిని పరకాయించి చూస్తున్నాడు.

దేవతలు ముగ్గురూ ఎలాగో ఒకలాగ పేరిస్ ని మభ్యపెట్టి తీర్పు తమవైపు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు.

“నన్ను ఎంపిక చేస్తే నిన్ను ఐరోపాకీ, ఆసియా మైనరుకి చక్రవర్తిని చేస్తాను,” అని ఆశ పెట్టింది హేరా.

ఎథీనా  ముందుకి వచ్చి, “నీకు విద్యాబుద్ధులు ప్రసాదిస్తాను. యుద్ధరంగంలో తిరుగులేని అస్త్రాలు ఇస్తాను,” అని ఎర చూపించింది.

చిట్టచివరికి తన కురులని సుగంధం వెదజల్లే పువ్వులతో అలంకరించుకున్న  ఏఫ్రొడీటి  ముందుకి వచ్చి, “పేరిస్ ! నువ్వు నన్ను ఎన్నుకున్నావంటే నీకు మరపురాని అనుభవాన్ని ప్రసాదిస్తాను. స్త్రీ యొక్క ప్రేమ ఎలా ఉంటుందో చవి చూపిస్తాను. స్పార్టా రాణి హెలెన్ ని మించిన అందగత్తె ఈ భూలోకంలో లేదు. ఆమె పొందు నీకు దక్కేలా వరం ఇస్తాను. ఆమె నీ సందిట బందీ అయేలా  చేస్తాను. ఏమంటావు?”

హెలెన్ అసాధారణమైన అందగత్తె. ఆమె చేతి కోసం ఎందరో యువకులు ఉవ్విళ్ళూరేవారు. శూరులు, వీరులు, మేధావులు, ఒకరేమిటి? ఆ జాబితాలో అగమెంనాన్, పెద్ద ఏజాక్స్, చిన్న ఏజాక్స్, ఒడీసియస్, నెస్టర్, ప్రభృతులు ఉన్నారు! వీరిలో హెలెన్ ఎవరిని ఎన్నుకుంటే ఎవరికి కోపం వస్తుందో? ఒడీసియస్ ఇచ్చిన సలహా ప్రకారం హెలెన్ ని వరించడానికి వచ్చిన యువరాజులందరి దగ్గర స్పార్టా రాజైన మెనలయస్ (Menelaus) ఒక హామీ తీసుకున్నాడు. భవిష్యత్తులో ఈ కాబోయే కొత్త దంపతులకి ఏ ఆపద వచ్చినా స్వయంవరానికి హాజరయిన అందరూ  సైన్యసమేతంగా వచ్చి హెలెన్ ని రక్షించాలి. అందరూ ఆ నిబంధనకి ఒప్పుకున్నారు. అప్పుడు  హెలెన్ పెంపుడు తండ్రి తిందారియస్ (Tyndareus) మెనలయస్ ని హెలెన్ భర్తగా ఎంపిక చేసేడు. (తిందారియస్ భార్య లేడాకి జూస్ ద్వారా పుట్టిన కూతురు హెలెన్!) అదే వివాహవేదిక మీద హెలెన్ చెల్లెలు క్లైటెమ్^నెస్త్ర (Clytemnestra) అగమెంనాన్ ని భర్తగా స్వీకరిస్తుంది.

ఇలా పెళ్ళి  అయిపోయి, హెలెన్ కాపురం చేస్తున్న సమయంలో పేరిస్ ఒక దౌత్య వర్గంతో ట్రోయ్ లో ప్రవేశించి హెలెన్ ని చూస్తాడు. ఏఫ్రొడీటి వెనకనుండి ఎరోస్ పువ్వుల బాణం సహాయంతో హెలెన్ లో ప్రేమ జ్వాల పుట్టించిందో, లేక పేరిస్ ఆమెని అపహరించేడో! ఈ సంఘటన  ఒక మహాసంగ్రామానికి

దారి తీసింది. గ్రీకులకి, ట్రోయ్ నగరానికి మధ్య జరిగిన ఈ భీకర పోరాటాన్ని హోమర్ అనే రచయిత తన ఇలియాడ్, ఆడెస్సీ అనే ఉద్గ్రంథాలలో పొందుపరచేడు. ఈ కథలో కొన్ని పాత్రలు భువి నుండి దివికి, దివి నుండి భువికి సునాయాసంగా తిరుగుతూ ఉంటారు. దేవతలు వారిలోవారు పోటీ పడి, పందెం కట్టి, దాని పర్యవసానంగా భూమి మీద లక్షలాది ప్రజలు నాశనం అవడానికి కారణభూతులు అవుతారు. పాపుల భారంతో  కృంగి పోతున్న భూమిని రక్షించడానికి జూస్ పన్నిన పన్నాగపు పర్యవసానమే ఈ  యుద్ధం అని వ్యాఖ్యానించినవారు లేకపోలేదు!

# 7. ట్రోయ్ మహా సంగ్రామం



బొమ్మ. ట్రోయ్ యుద్ధం (Courtesy, BBC Culture)

గ్రీకు పురాణ గాథలలో ప్రసిద్ధికెక్కిన ఈ మహా సంగ్రామానికి, తద్వారా జరిగిన మారణ హోమానికి మూల కారణం అరిస్ (Eris) అనే ఒలింపియన్ దేవత అని మనం తీర్మానం చెయ్యవచ్చు. (ఏఫ్రొడీటి కొడుకు ఎరోస్ (Eros) మన మన్మధుడికి పోలిక! అరిస్ (Eris) బంగారు ఏపిల్ పండుని  పెళ్లి పందిరిలోకి  విసిరిన వ్యక్తి.)

ఒక వివాహ సందర్భంలో  ఒలింపియన్  దేవతల అధినేత అయిన జూస్ ఒక బ్రహ్మాండమైన విందు చేస్తాడు.  కోరుకుని కొరివితో తలగోక్కోవడం ఎందుకని పేచీకోరు ఆరీస్  ని ఆ విందుకి పిలవడు. జరిగిన పరాభవానికి ఆత్మాభిమానం దెబ్బతిన్న అరిస్  పిలవని పేరంటంలా విందుకి రానే వచ్చింది. జూస్ ఆజ్ఞానుసారం హెర్మీస్ ఆమెని లోపలికి రాకుండా అటకాయిస్తాడు. అరిస్ తక్కువ తిన్నదా? బయట నుండే బంతి భోజనాల మధ్యకి ఒక బంగారు ఏపిల్ పండుని విసరి వెళ్లిపోతుంది. ఆ పండు మీద “మీలో అందమైన అతివకి ఈ బహుమానం” అని రాసి ఉంటుంది.

విందులో ఉన్న ముగ్గురు దేవతలు – హేరా, ఎథీనా, ఏఫ్రొడీటి – “ఆ పండు నా కోసమే” అంటూ ఎగబడి తగువులాడుకుంటారు. తీర్పు చెప్పమని ముగ్గురూ జూస్ ని అడుగుతారు. ఎటు తీర్పు చెప్పినా ఇబ్బందే అని జూస్ ఈ ముగ్గురికీ హెర్మీస్ ని తోడు ఇచ్చి భూలోకంలో ఉన్న పేరిస్ దగ్గరకి పంపుతాడు. ముగ్గురిలోనూ ఏఫ్రొడీటి అందమైనదని పేరిస్ తీర్పు చెబుతాడు. దానికి బహుమానంగా పేరిస్ ని భూలోక సుందరి హెలెన్ – మెనలయస్ భార్య – వరించేలా వరం ఇస్తుంది.

హెలెన్ కన్నతల్లి స్పార్టాకి రాణి అయిన లేడా (Leda). హంస రూపంలో జూస్ వచ్చి లేడాని అనుభవించగా హెలెన్ పుట్టిందని ఒక కథనం ఉంది. కనుక హెలెన్ దైవాంశ సంభూతురాలు. స్పార్టాకి రాజైన తిందారియస్ (Tyndareus) హెలెన్ ని తన సొంత కూతురిలాగే చూసుకున్నాడు. హెలెన్ అందాన్ని చూసి ఎంతోమంది రాజులు, ధీరులు ఆమెని చేపట్టటానికి ముందుకి వచ్చేరు. ఒకరి వైపు మొగ్గు చూపితే మరొకరికి కోపం వస్తుందని తిందారియస్ భయపడ్డాడు. చివరికి ఇతకా రాజైన ఒడీసియస్ (Odysseus) తనకి పెనెలొపి (Penelope)ని ఇచ్చి పెళ్లి చేస్తానని వాగ్దానం చేస్తే ఒక పరిష్కార మార్గం సూచిస్తానన్నాడు. ఆ మార్గం ఏమిటంటే హెలెన్ ఎవ్వరిని పెళ్లి చేసుకున్నా సరే మిగిలిన రాజులంతా ఆ వివాహాన్ని సమర్ధించాలి. అంతా ఒప్పుకున్నారు. అప్పుడు తిందారియస్ తన కోరిక మేరకు హెలెన్ ని మెనలయస్ (Menelaus) కి ఇచ్చి పెళ్లి చేసేడు.

మెనలయస్ కి హెలెన్ ని ఇవ్వడంలో రాజకీయం లేకపోలేదు. మెనలయస్ ధనవంతుడు. అతనికి పెద్ద సైన్యం ఉంది. పెద్దల యెడల ఎలా ప్రవర్తించాలో ఎరిగిన వ్యక్తి. పెళ్లి విషయంలో కూడా తనంత తానుగా ఎగబడలేదు; తన అన్నగారైన అగమెంనాన్ (Agamemnon) ద్వారా వర్తమానం పంపేడు. ఎందుకైనా మంచిదని ఈ పెళ్లి జరిగితే ప్రేమదేవత ఏఫ్రొడీటికి వంద గిత్తలు బలి ఇస్తానని మెనలయస్ మొక్కుకున్నాడు కూడా. ఆ మొక్కు సంగతి మరచిపోయి ఏఫ్రొడీటి ఆగ్రహానికి గురి అవుతాడు; అది వేరే సంగతి!

ట్రోయ్ నగరపు రాయబారి వర్గంలో ఒక వ్యక్తిగా పేరిస్ చొరబాటుతో స్పార్టాలో ప్రవేశిస్తాడు. పేరిస్ రాజప్రాసాదం లోకి ప్రవేశించే లోగా ఏఫ్రొడీటి అందాల పోటీలో తాను పేరిస్ కి ఇచ్చిన వరం

నెరవేర్చడానికిగాను ఈరోస్ (Eros) సహాయం కోరుతుంది. ఈరోస్ తన పువ్వుల బాణంతో హెలెన్ లో కామాతురతని రెచ్చగొడతాడు. ఏఫ్రొడీటి ఇచ్చిన వరం ప్రకారం పేరిస్ ని చూడగానే హెలెన్ ప్రేమలో పడుతుంది. హెలెన్ ని వెంటపెట్టుకుని పేరిస్ ట్రోయ్ వెళ్ళిపోతాడు.

హెలెన్ అపహరణ అనే పని ఆ రోజుల్లో కొత్తేమీ కాదు. ఇటువంటి "స్త్రీ గ్రహణాలు" ఆ రోజుల్లో తరచుగా జరిగేవి. మైసినే (Mycenae) నుండి లో (Lo) అపహరణ, ఫినీషియా (Phoenicia) నుండి యూరోపా (Europa) అపహరణ కేవలం రెండు ఉదాహరణలు. కొల్చిస్ (Colchis) నుండి మీద్యా (Medea) ని జేసన్ (Jason) అపహరిస్తాడు. ట్రోయ్ నగరం నుండి హెరాక్లిస్ (హెర్క్యులిస్) రాకుమారి హీషన్ (Hesione)ని అపహరించి ఆమెని టెలామన్ (Telamon) కి కానుకగా ఇస్తాడు. ఈ అపహరణలు జరిగినప్పుడు పర్యవసానంగా అనుకోని విపత్తులు ఏవీ రాకపోవడంతో హెలెన్ ని దొంగిలించడానికి పేరిస్ కి ధైర్యం వచ్చిందని చరిత్రకారుడు హెరొడోటస్ వ్యాఖ్యానిస్తాడు.

హోమర్ చెప్పిన కథనం ప్రకారం మెనలయస్ తన స్నేహితుడైన ఒడీసియస్ ని వెంటబెట్టుకుని ట్రోయ్ నగరంతో సంప్రదింపులు జరిపి హెలెన్ ని వెనక్కి తెచ్చుకుందామని ప్రయత్నిస్తాడు. ఆ రాయబారం విఫలం అవుతుంది. ఇది సంగ్రామానికి నాంది అవుతుంది.

రాయబారం విఫలం అవడంతో హెలెన్ వివాహాన్ని రక్షిస్తానని మాట ఇచ్చిన అగమెంనాన్ ని మాట నిలుపుకోమని మెనలయస్ అడుగుతాడు. అప్పుడు మెసినాయి కి రాజు అయిన అగమెంనాన్ గ్రీకు యోధులని సమకూర్చుకుని, వెయ్యి పడవల బలగంతో ట్రోయ్ మీదకి దండయాత్ర చేసి, నగరాన్ని ముట్టడించి, నగరాన్ని పదేళ్ళపాటు దిగ్బంధం చేస్తాడు. ఈ ఘోరమైన యుద్ధంలో అఖిల్లీస్ (Achilles), ఏజాక్స్ (Ajax) వంటి గ్రీకు యోధులు, హెక్టర్ (Hector), పేరిస్ (Paris) వంటి ట్రోయ్ యోధులు వీరస్వర్గం పొందుతారు.

యుద్ధంలో పేరిస్  మరణించిన తరువాత హెలెన్ అతని అన్నదమ్ముడైన డియఫోబస్ ని పెళ్లి చేసుకుంటుంది. ట్రోయ్ నగరం పతనమైపోయిన తరువాత  డియఫోబస్ ని వదిలేసి తిరిగి మెనలయస్ తో కలిసి  స్పార్టా వచ్చేసి శేష జీవితం గడుపుతుంది.

యుద్ధం ముగిసిన తరువాత ఒడీసియస్ (యులిసిస్) తిరుగు ప్రయాణం చేసి ఇతకా చేరుకుందికి పదేళ్లు పడుతుంది. ఈ తిరుగు ప్రయాణంలో ఒడీసియస్ ఎదుర్కున్న సవాళ్ళని హోమర్ తన రెండవ గ్రంథం "ఆడెస్సి" లో వర్ణిస్తాడు. "ఆడెస్సి" రూఢ్యర్థం మహా ప్రస్థానం. "ఇలియాడ్" రూఢ్యర్థం కష్టకాలం.

సా. శ. పూ.1 వ శతాబ్దంలో రోమ్ కి చెందిన కవి వర్జిల్ "ఎనియాడ్" (Aeneid) అనే గ్రంథంలో యుద్ధం ముగిసిన తరువాత కొందరు గ్రీకు యోధులు, ఎనియస్ (Aeneas) నేతృత్వంలో సముద్రం దాటుకుని ప్రస్తుతం టునీషియాలో ఉన్న కార్తేజ్ (Carthage) వచ్చి, అక్కడ నుండి ఇటలీ వచ్చి, రోమ్ నగరం స్థాపనకి కారణభూతులు అవుతారని చెబుతాడు. హోమర్  రెండవ గ్రంథం "ఆడెస్సి", వర్జిల్ రాసిన "ఎనియాడ్" సమాంతర గ్రంథాలు;  ఆడెస్సి లో ఒడీసియస్ (యులిసిస్) కథానాయకుడు అయితే ఎనియాడ్ లో ఎనియస్ కథానాయకుడు అయినప్పటికీ రెండింటిలో కథలు మాత్రం ఒకటి కాదు.

పాశ్చాత్యులు హోమర్  రాసిన "ఇలియాడ్" (Illiad),  "ఆడెస్సి" (Odyssey) లతో వ్యాసుడు రాసిన భారతాన్ని పోలుస్తారు.  కేవలం ఉపరితలం మీద కొన్ని పోలికలు కనిపించవచ్చేమో కానీ లోతుగా పరిశీలిస్తే రెండిటి మధ్య చాల తేడాలు ఉన్నాయి.  భారతం మీద, హిందూ పురాణాల మీద వ్యాఖ్యానాలు చేసిన అనేక పాశ్చాత్యులు (ముఖ్యంగా, మేక్స్ ముల్లర్ ప్రభృతులు)  గ్రీకు పురాణగాథల వల్ల ప్రభావితులై, గ్రీకు పురాణ కాలపు పట్టకం ద్వారా చూస్తూ చేసేరు తప్ప స్వతంత్రమైన దృక్పథంతో చేసినవారు కారెమో అని  నా అభిప్రాయం.

భారత యుద్ధానికి మూల కారణం  దుర్యోధనుడికి ఉన్న అసహనం, ఈర్ష్య, అసూయ కారణాలు అనుకోవచ్చు. ట్రోయ్ యుద్ధం దేవతల చెలగాటాల వల్ల జరుగుతుంది. ట్రోయ్ యుద్ధంలో మానవులు దేవతల చేతిలో కేవలం పావులు. రెండు యుద్ధాలూ రాయభారాలు విఫలం అయిన తరువాతే జరుగుతాయి. యుద్ధం వద్దని పదేపదే చెప్పిన పెద్దలు రెండు కథలలోను ఉన్నారు. ట్రోయ్ యుద్ధంలో సైనికులు వాడిన ఆయుధాలు మన ఊహకి అందుతాయి. భారతంలో కనబడే అస్త్రాల వెనక ఉన్న సాంకేతిక నైపుణ్యం మనకి ఇప్పటికీ  లేదు. రెండు కథలలోను దేవతల అదృశ్య హస్తం కనిపిస్తూనే ఉంటుంది; ట్రోయ్ యుద్ధంలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది, భారత యుద్ధంలో పరోక్షంగా ఉంటుంది.

# 8. ట్రోయ్ సంగ్రామం నిజమా? కల్పనా?

భారత యుద్ధం గురించి  చదువుతున్నప్పుడు వచ్చే రకం సందేహాలే ట్రోయ్ సంగ్రామం గురించి కూడా వస్తాయి. ఈ కథ పురాణమా? ఇతిహాసమా? ఈ యుద్ధం నిజంగా జరిగిందా? జరిగితే ఎప్పుడు జరిగింది? యుద్ధంలో కనిపించే సంఘటనలు, పాత్రలు (మనుష్యులు, దేవతలు) నిజమా? కల్పనా? ఈ యుద్ధం గురించి ఎవ్వరు రాసేరు? ఎప్పుడు రాసేరు? వగైరా, వగైరా!

ట్రోయ్ లో జరిగిన యుద్ధం నిజామా కల్పనా అన్న ప్రశ్నని పక్కకి పెడితే ఈ కథ యొక్క ప్రాముఖ్యత అర్థం అవుతుంది. ఎంతమంది చరిత్రకారులు, కవులు, కళాకారులు, పరిశోధకులు, ఎన్ని తరాలబట్టి ప్రభావితులు అవుతున్నారో చూస్తే ఈ  కథ యొక్క గొప్పదనం అర్థం అవుతుంది. యుద్ధంలో ప్రతి చిన్న సంఘటనని హోమర్ వర్ణించి చెబుతూ ఉంటే, “ఇంత విపులమైన వర్ణన నిజం కాక కల్పన ఎలా అవుతుంది” అనిపిస్తుంది. మహాభారత యుద్ధం తిక్కన వర్ణించిన తీరు చూసినప్పుడు కూడా ఇదే రకం భావం కలుగుతుంది.

శాస్త్రవేత్తలు పురాతన కథా సాహిత్యాన్ని మూడు వర్గాలుగా విడగొడతారు: పురాణాలు (myths), వీరగాథలు (legends), జానపద కథలు (folktales). పురాణకథలలో సర్వసాధారణంగా మానవులు, దేవతలు, భీకరాకారాలు, అరివీరభయంకరులు, ఆధిదైవిక సంఘటనలు (మానవులు, దేవతలు కలవగా పిల్లలు పుట్టడం, వదలిన అస్త్రాన్ని వెనక్కి తీసుకోవడం, వగైరాలు) కనబడుతూ ఉంటాయి. ఆధిదైవిక సంఘటనలని మినహాయిస్తే మిగిలిన అంశాలు వీరగాథలలో  కనబడుతూ ఉంటాయి. జానపదాలు మన అనుభవాలకు మరి కొంచెం దగ్గరగా ఉంటాయనుకోవచ్చు. ఒక జాతి చెప్పుకునే పురాణకథలని బట్టి ఆ నాటి ప్రజల నమ్మకాలేమిటి? ఎలా బ్రతికేవారు? వగైరా ప్రశ్నలకి సమాధానాలు చెప్పొచ్చు. పురాణాలు  చెప్పే కథలన్నీ నిజమే అనిన్ని, పురాణాలలో దర్శనమయే వ్యక్తులు, రాజులూ, చారిత్రక సత్యాలనిన్నీ  మనస్ఫూర్తిగా నమ్మిన ప్రజలు 1000 సంవత్సరాల క్రితం వరకు గ్రీసులో ఉండేవారు. ఇప్పటికీ  అటువంటి వ్యక్తులు మనకి మన సమాజాలలో తరచుగా తారసపడుతూనే ఉంటారు.

ఈ యుద్ధం గురించి మనకి ఉన్న ముఖ్యమైన ఆధారాలు గ్రీకు సాహిత్యంలో కనిపిస్తాయి; కానీ ఏ ఒక్క చోట మనకి సాధికారంగా ఆధారాలు కనబడవు. ఈ యుద్ధం నిజంగా జరిగి ఉంటే అది సా. శ పూ. 1194–1184 మధ్య కాలంలో జరిగి ఉండవచ్చని గ్రీకు శాస్త్రవేత్త ఎరతోస్తనీస్ (Eratosthenes, సా. శ. పూ. 276–194) వేసిన అంచనా నమ్మదగ్గదే అనడానికి అధారాలు కనిపిస్తున్నాయని పురావస్తు పరిశోధకులు అభిప్రాయపడ్డారు. అనగా, కంచు యుగపు చివరి దశలో అని మనం చెప్పుకోవచ్చు.

సా. శ. 1870 లో జెర్మని దేశపు వాణిజ్యవేత్త, ఔత్సాహిక పురావస్తు పరిశోధకుడు, హైన్రిక్ షులైమన్ (Heinrich Schliemann) పశ్చిమ టర్కీలో (ట్రోయ్ నగరపు సమీపంలో) జరిపిన తవ్వకాలలో ఒక శిధిలమైన కోటదిబ్బ, దాని చుట్టూ 25 మీటర్ల లోతు వరకు శిధిలమైన భవనాల అవశేషాలు కనిపించేయి. వాటి చుట్టూ 46 ఇతర వాటికలు కనిపించేయి. ఇటీవల జరిపిన మరికొన్ని తవ్వకాలలో కనబడ్డ ఒక పురాతన నగరం హైన్రిక్ షులైమన్ కనుక్కున్న నగరం కంటే పదింతలు పెద్దది అని తెలిసింది. ఈ నగరం ఉన్న ప్రాంతాలలో సా. శ. పూ. 3000 నుండి సా. శ. పూ. 1350 వరకు అవిరామంగా జనావాసాలు ఉండేవని తీర్మానించేరు. అంతేకాదు. సా. శ. పూ. 1180 కి సంబంధించిన స్తరాలలో వేడికి మాడిపోయిన అవశేషాలు, మానవ అస్థి పంజరాలు కనిపించడంతో అవి ఏదో యుద్ధానికి సంబంధించినవే అయుంటాయని నమ్ముతున్నారు.

ఈ నగరం గురించి, అక్కడ జరిగిన యుద్ధం గురించి, ఆనోటా, ఈనోటా, జానపదుల నోటా 400 సంవత్సరాల తరువాత విన్న కథలని హోమర్ ఇలియాడ్, ఆడెస్సి అనే రెండు ఉద్గ్రంథాలలో పొందుపరచి ఉంటాడు. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం ఇలియాడ్ సంకలనం సా. శ పూ. 750 లోను, ఆడెస్సి సంకలనం సా. శ పూ. 725 లోను పూర్తి అయి ఉంటాయి. ఇలా సంకలించబడ్డ కథల సమాహారం లిఖిత రూపం దాల్చేసరికి మరికొన్ని దశాబ్దాలో, శతాబ్దాలో పట్టి ఉండవచ్చు.

అసలు హోమర్ అనే వ్యక్తి ఉన్నడా అని ప్రశ్నించేవాళ్ళు కూడా ఉన్నారు. కొన్ని గ్రీకు మాండలికాలలో “హోమర్” అంటే గుడ్డివాడు అని అర్థం వస్తుంది కనుక “హోమర్” గుడ్డివాడయి ఉంటాడని కొందరి

తీర్మానం. ఎందుకంటే ఆడేస్సి లో ఒక చోట ఒక అంధుడు పాత్ర వచ్చి యుద్ధంలోవిశేషాలని కథల రూపంలో చెబుతాడు. హోమర్ ఈ విధంగా తాను చెబుతున్న కథలో తానే ఒక పాత్రలా వచ్చేడని వీరి అభిప్రాయం. వ్యాసుడు కూడా భారత కథలో అక్కడక్కడ "అతిథి నటుడు" గా వస్తూ ఉండడం గమనార్హం.

ఈ కథని చారిత్రక పరిశోధన కోణం నుండి విశ్లేషించడం కష్టం. ఈ కథలో తారసపడే చాల పాత్రలు దైవాంశ సంభూతులు (demigods) – అనగా దేవతలు, మానవులు కలవగా పుట్టినవారు. ఉదాహరణకి హెలెన్ ఒలింపియను దేవత అయిన జూస్ ఒక హంస రూపంలో వచ్చి మానవ వనిత లేడాని అనుభవించగా పుట్టిన సంతానం. అదే విధంగా హెలెన్ ని పేరిస్ వశపరచుకోడానికి టైటన్ దేవత ఏఫ్రోడీటీ ఇచ్చిన వరం కారణభూతం అవుతుంది. ఈ రకం సంఘటనలు నిజ జీవితాలలో జరగడం అనేది మన అనుభవాలకి అతీతం. అలాగే యుద్ధం పది సంవత్సరాలు జరుగుతుంది. కంచు యుగంలో ట్రోయ్ నగరాన్ని పది రోజులు దిగ్బంధం చేసేరంటే నమ్మవచ్చేమోకాని పదేళ్లు – అది కూడా నావికా దిగ్బంధం – కొంచెం అతిశయోక్తి అనిపిస్తుంది.

ఈ సమాచారం అంతటిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే ట్రోయ్ అనే నగరం ఉండి ఉండవచ్చు. ఆ నగరం వద్ద పెద్ద యుద్ధం జరిగి ఉండవచ్చు. ఆ యుద్ధం జరగడానికి (హెలెన్ అనే) ఒక అందమైన యువతిని (పేరిస్ అనే) ఒక యువకుడు అపహరించడం కారణం అయి ఉండవచ్చు. ఆ యుద్ధంలో గ్రీకు సైనికులు ఒక కొయ్య గుర్రంలో దాగుని దొంగచాటుగా ట్రోయ్ నగరంలో ప్రవేశించి ఆ నగరాన్ని నాశనం చేసి ఉండవచ్చు. ఇవన్నీ నిజంగా జరిగిన సంఘటనలే కావచ్చు. అదే విధంగా అక్షిలిస్ వంటి వీరులు నిజంగా ఉండేవారనడానికి స్వతంత్రమైన సాక్ష్యాధారాలు కనబడవు. కానీ వీరందరూ నిజమైన వీరుల చరిత్రలు ఆధారంగా కవి సృష్టించిన పాత్రలు కావచ్చు. అలాగే ఈ కథలో కనిపించే దేవతలు, వారికీ మానవులకి మధ్యనున్న సంబంధ బాంధవ్యాలు మన అనుభవ పరిధిలో నమ్మడానికి వీలు లేనివి. వీటిని కవి కల్పించిన ఉత్ప్రేక్షలు అనే అనుకోవాలి.

ఉపయుక్త మూలాలు


1. Barry Strauss, Achilles: Bronze Age Warrior, *Military History Quarterly.* Autumn 2007, https://www.historynet.com/achilles-bronze-age-warrior.htm
2. Did the Trojan War really happen?, http://cerhas.uc.edu/troy/q404.html

# 9. ఇలియాడ్: సంగ్రహంగా

భారతీయ వాఙ్మయంలో భారతం ఎటువంటిదో పాశ్చాత్య వాఙ్మయాలకి ఇలియాడ్ అలాంటిది. గ్రీకు భాషలో “ఇలియాస్” అంటే ట్రోయ్ అనే అర్థం ఉండడం గమనార్హం!

హోమర్ రాసిన ఇలియాడ్ లో కథనం గ్రీసు సేనలకి, ట్రోయ్ సేనలకి మధ్య యుద్ధం తొమ్మిదో సంవత్సరంలో ఉండగా మొదలవుతుంది. అనగా యుద్ధం చివరి దశలోఉండగా కథ మొదలవుతుంది; భారత కథ జనమేజయుని సర్పయాగంతో మొదలయినట్లు!

కవి సాహిత్యాలకి అధిదేవత అయిన “మూజ్” ని ప్రార్థించి గ్రీకు యోధులలో అగ్రేసరుడైన అక్ఖిలీస్ (Achilles) కోపోద్రేకాలకి కారణమేమిటో చెప్పడంతో గ్రంథ రచన ప్రారంభం అవుతుంది. ప్రారంభ వాక్యంలో మొదటి మాట గ్రీకు భాష లో "Μηνιν" ("mēnin", మేనిన్ అనగా "wrath" లేదా తీవ్రమైన ఆగ్రహము). రెండవ మాట "aeide", అనగా గేయం, పాట. మూడవ మాట "thea", అనగా దేవత. ఎవరీ దేవత? సాహిత్యాలకి అధిదేవత అయిన “మూజ్”. అనగా, “ఓ దేవతా! అక్ఖిలీస్ ఆగ్రహం యొక్క పాట!” అని హోమర్ గ్రంథ రచన మొదలు పెడతాడు.

ఈ అక్ఖిలీస్ తండ్రి పెలియస్ (Peleus, ఒక కులీన రాజ వంశీయుడైన మానవుడు), తల్లి తీటస్ (దైవగణాలకి చెందిన ఒక జలకన్య). ఇలియాడ్ లో వచ్చే పాత్రలలో అత్యధికులు గ్రీసు దక్షిణ పరగణాల నుండి వచ్చిన వారైతే ఒక్క అక్ఖిలీస్ మాత్రం ఉత్తరాదివాడు. అనగా ఒక విధంగా ”పరాయి” వాడు. యవ్వనం, పరాక్రమం అతని భూషణాలు అయితే కూటనీతి, మంత్రాంగం తెలియని ఉడుకు రక్తం అతని శత్రువులు. అక్ఖిలీస్ కీ గ్రీకు మహారథుడు, గ్రీకు సేనానాయకుడు అయిన అగమెంనాన్ (Agamemnon) కి మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా యుద్ధం చెయ్యనని ప్రతిన పూని అక్ఖిలీస్ తన గుడారంలో కూర్చుంటాడు. దరిదాపు కథాంతం వరకు అక్ఖిలీస్ అలక లోనే ఉంటాడు. చిట్ట చివరికి తన ఆప్త మిత్రుడు పాట్రోక్లస్ (Patroclus) హెక్టర్ చేతులలో మరణించేసరికి కోపోద్రేకాలు

పెల్లుబకగా దుమారంలా యుద్ధరంగం లోకి దూకి పాట్రోక్లస్ మరణానికి  కారణభూతుడైన హెక్టర్ (Hector) ని హతమార్చి అతని మృత దేహాన్ని ఛిన్నాభిన్నం చేస్తాడు.

కొడుకు మృతదేహాన్ని తెచ్చుకుందుకని హెక్టర్ తండ్రి ప్రియం (Priam) అర్ధరాత్రి వేళ అక్కిలీస్ ఆవాసానికి వెళ్లడంతో కథ పూర్తి  అవుతుంది.  ఆశ్చర్యకరమైన  విషయం ఏమిటంటే బహుళ ప్రచారం పొందిన కొయ్యగుర్రం ప్రస్తావన ఇలియాడ్ లో కనిపించదు.

ఇదీ  టూకీగా ఇలియాడ్ లో  కథ. ఇదంతా ఒలింపియను దేవుళ్ళ కనుసన్నలలో జరుగుతుంది. అనగా ఈ దేవుళ్ళు కేవలం ప్రేక్షకులు కాదు వీరు కూడా ఇరు పక్షాలకు వెనక ఉండి  పురి కొల్పడం, మద్దత్తు ఇవ్వడం వంటి పనులు చేస్తూ ఉంటారు. కనుక ట్రోయ్ యుద్ధం కేవలం రెండు మానవ సైన్యాలకి పరిమితమైన యుద్ధం కాదు; దేవుళ్ళ మధ్య జరిగిన యుద్ధం కూడా!  జూస్ పట్టమహిషి అయిన హేరా; బుద్ధులకీ, యుద్ధాలకి అధినేత్రి అయిన ఎతీనా; సముద్రాలకి అధిపతి అయిన పొసయిడన్  గ్రీకుల పక్షం అయితే ట్రోయ్ పక్షం కాసిన వారిలో అపాలో ముఖ్యుడు.

హృదయ విదారకమైన అంశం ఏమిటంటే యుద్ధంలో మరణం తథ్యం. యుద్ధంలో పాల్గొనే వారు, తద్వారా మరణించే వారిలో యువత ఎక్కువ. అక్కిలీస్ వయస్సులో పిన్నవాడు. ఉడుకు రక్తం వాడు. తల్లి ద్వారా సంక్రమించిన దైవాంశ దన్నుగా ఉన్నా యుద్ధంలో మరణాన్ని జయించలేక పోయాడు. శౌర్య పరాక్రమాలతో అల్ప కాలం బతికిన తరువాత వీరస్వర్గం కావాలా లేక సాధారణమైన జీవితంతో పూర్ణాయుర్దాయం కావాలా అని అడిగితే  యుద్ధంలో మరణాన్ని ఎదుర్కొని వీరస్వర్గాన్నే కోరుకున్నాడు. అక్కిలీస్ చేతులలో వీరస్వర్గం పొందిన హెక్టర్ కూడా యువకుడే!

మరి దేవుళ్ళ సంగతి? వారు అమరులు. వారికీ మరణం లేదు. వారు వారి ఇష్టం వచ్చిన ఆటలు ఆడవచ్చు. మరణం లేకపోయినా దేవతలు కూడా కొన్ని కష్టాలని ఎదుర్కోక తప్పలేదు. అక్కిలీస్ మరణంతో అమరత్వం పొందినా  అతని తల్లి థేటిస్ గర్భశోకంతో బాధపడుతూనే ఉంది – నేటికీ!

ఇంతకీ అక్షిలీస్ కోపోద్రేకాలకి కారణం? యుద్ధం మొదలయి తొమ్మిదేళ్లు గడచిన తరువాత గ్రీకు సైన్యం ట్రోయ్ మిత్రరాజ్యం అయిన క్రిసి ని ముట్టడించి లొంగదీసుకుంటుంది. ఈ సందర్భంలో ఓడిపోయిన రాజ్యానికి చెందిన క్రిసెస్ (Chryses) అనే పేరు గల పురోహితుని కుమార్తెలు ఇద్దరు – క్రిసేయిస్ (Chryseis), బ్రెసేయిస్ (Briseis) – గ్రీకుల వశం అవుతారు. (జనకుడి కూతురు జానకి అయినట్లే క్రిసెస్ కూతురు క్రిసేయిస్ అవుతుంది. ఈమె అసలు పేరు మరొకటి ఉంది!) గ్రీకుల సేనాధిపతి అగమెంనాన్ క్రిసేయిస్ ని తనకి దక్కిన బహుమానంగా తీసుకుంటాడు. గ్రీకు సైన్యం అంతటికి ఆణిముత్యం అనదగ్గ అక్షిలీస్ బ్రెసేయిస్ ని తీసుకుంటాడు.

క్రిసేయిస్ తండ్రి క్రిసెస్ – సాక్షాత్తు ఒలింపియన్ దేవుడైన అపాలోకి హితుడు – కూతురు బంధ విమోచనకి అగమెంనాన్ కి ఎంతో విలువైన నగలు, ఆభరణాలు పణంగా పెడతాడు కానీ అగమెంనాన్ లొంగడు. తన హితునికి ఎదురవుతున్న పరాజయం చూడగానే అపాలోకి కోపం వచ్చి అగమెంనాన్ సేనల మీద ప్లేగు మహమ్మారి పడాలని శపిస్తాడు.

తమ సేనలు ఎండలలో పిట్టలలా రాలిపోతూ ఉంటే చూసి, కంగారుపడి, అక్షిలీస్ దైవజ్ఞులని సంప్రదించగా, కాల్చస్ (Calchas) అనే దైవజ్ఞుడు లేచి, “ఇదంతా అపాలో శాపం వల్ల జరుగుతోంది” అని చెబుతాడు. అప్పుడు అగమెంనాన్ – అయిష్టంగానే – క్రిసేయిస్ ని వదలుకుందుకి ఆమోదిస్తాడు; కానీ ఒక మెలిక పెడతాడు. ఏమిటా మెలిక? తాను క్రిసేయిస్ ని వదులుకుంటే ఆ స్థానంలో అఖిలీస్ తనకి బ్రెసేయిస్ ని ఇచ్చెయ్యాలి! ఈ వంకాయల బేరం విని అక్షిలీస్ కోపోద్రేకుడయి, కత్తి దూసి, అగమెంనాన్ తో ద్వంద్వ యుద్ధానికి తయారవుతాడు. ఒక పక్క ట్రోయ్ సేనలు భీకర పోరాటంలో ఉండగా ఈ గిల్లికజ్జాలు ఏమిటని కాబోలు ఒలింపియన్ దేవత హేరా ఈ యోధుల మధ్య సంధి కుదర్చమని ఎథీనాని పంపుతుంది. నెస్టర్ (Nestor) సహాయంతో ఎథీనా చేసిన హితోపదేశం అక్షిలీస్ కోపాన్ని కొంతవరకు చల్లార్చుతుంది. కానీ, తనకి జరిగిన పరాభవానికి ప్రతీకారంగా తాను ఇటుపైన యుద్ధం చెయ్యనని ప్రతిన పూని తన గుడారానికి చేరుకుంటాడు. అక్షిలీస్ తన కోపం చల్లారక ముందే తన తల్లి అయిన ఎలనాగ (సముద్రపు

"జలకన్య") తీటస్, (Thetis) ని పిలచి తనకి జరిగిన పరాభవానికి ప్రతీకారం చెయ్యడానికి దేవతల రాజైన జూస్ నుండి సహాయం అర్థించమని అడుగుతాడు.

ఇది ఇలా ఉండగా అగమెంనాన్ క్రిసేయిస్ ని ఆమె తండ్రి దగ్గరకు పంపేసి, బ్రెసేయిస్ ని తన దగ్గరకి రప్పించుకుంటాడు. ఒడీసియస్ తన పడవలో క్రిసేయిస్ ని తీసుకువెళ్ళి ఆమె తండ్రికి అప్పగించగా, అతను సంతృప్తి చెందిన వాడై గ్రీకు సైనికులని శాపం నుండి విముక్తి చెయ్యమని అపాలోని కోరుకుంటాడు. గ్రీసు కీ ట్రోయ్ కి మధ్య తాత్కాలికంగా యుద్ధ విరమణకి ఒప్పందం జరుగుతుంది.

గ్రీకు సేనలకి, ట్రోయ్ సేనలకి మధ్య యుద్ధం ఆగింది కానీ అఖిలీస్ కి అగమెంనాన్ కీ మధ్య విరోధ జ్వాలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. దేవతల రాజైన జూస్ ని కలుసుకోడానికి తీటస్ కి పన్నెండు రోజులు పట్టింది. జూస్ ట్రోయ్ పక్షం కాస్తే భార్య హేరాకి కోపం వస్తుంది; ఆమె గ్రీకుల పక్షం! కాని తీటస్ కోరికని కాదనలేకపోయాడు, జూస్. హేరాకి కోపం రానే వచ్చింది. మానవుల మధ్య జరుగుతూన్న ఈ పోరాటంలో దేవతలు తల దూర్చడం శ్రేయస్కరం కాదని ఆమె కొడుకు హెఫయెస్టస్ హేరాకి హితోపదేశం చేస్తాడు.

ఈలోగా ట్రోయ్ పక్షం వారు యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారు. అప్పుడు జూస్ ట్రోయ్ పక్షం వహించి వారికీ సహాయం చెయ్యడానికి వస్తాడు. జూస్ ట్రోయ్ పక్షం కాయడం, అఖిలీస్ అస్త్ర సన్యాసం చేసి ఇహ పోరాడనని భీష్మించుకుని కుర్చోవడం వల్ల గ్రీకు సేనలు బాగా నష్టపోతారు. చాల రోజులు జరిగిన ఆ భీకర పోరాటంలో పేరిస్–మెనలయస్ ల మధ్య, హెక్టర్–ఏజాక్స్ ల మధ్య జరిగిన ద్వంద్వ యుద్ధాలు చిరస్మరణీయమైనవి. అయినా సరే ట్రోయ్ సైన్యాలు గ్రీకు సేనా వాహినిని తరిమి కొట్టాయి.

భారత యుద్ధంలో వ్యాసుడు పద్దెనిమిది రోజుల యుద్ధాన్ని, దినాలవారీగా, వ్యూహాలవారీగా, అస్త్రాలవారీగా ఎలా వర్ణిస్తాడో హోమర్ కూడా అలా ఆ యుద్ధాన్ని వర్ణించుకుంటూ వస్తాడు. చిట్టచివరికి ట్రోయ్ నగరాన్ని పడగొట్టలేక గ్రీసు సేనలు పడవలలో ఎక్కి పారిపోతారు. ఆ హడావిడిలో ఒక కొయ్య గుర్రాన్ని సముద్రపుటొడ్డున వదిలేసి మరీ పోతారు. ట్రోయ్ సేనలు వారి విజయానికి ఆ

గుర్రం ఒక అభిజ్ఞానం అనుకుంటూ దానిని ఈడుచుకుని పట్టణపు లోపలికి తీసుకుపోతారు. లోపలికి వెళ్లిన తరువాత ఆ కొయ్యగుర్రం తలుపులు తెరుచుకుని గ్రీకు సేనా వాహిని, యులిసిస్ నాయకత్వంలో, బయటకి వచ్చి ట్రోయ్ నగరాన్ని పరిపూర్ణంగా కొల్లగొట్టి పోతారు.

భారత యుద్ధం ధర్మయుద్ధానికి ప్రతీక అయితే ట్రోయ్ యుద్ధం దేవతల అగ్రహానికి, స్వల్పబుద్ధికి ప్రతీక అనుకోవచ్చు.

గ్రీకు తత్త్వవేత్త ప్లేటో (సా. శ. పూ. 428 – 348) తనకు సుమారు నాలుగువందల ఏళ్ల పూర్వుడైన హోమర్ రాసిన 'ఇలియాడ్' గురించి చెపుతూ ఇలా పేర్కొన్నాడు: "దాదాపు ప్రతిరోజూ ఏథెన్స్ నగరంలోని మార్కెట్ స్థలంలోనో, నాటక మందిరంలోనో, లేక కొండ పక్కనున్న విశాలమైన ఆరుబయలు మైదానంలోనో ఇరవైవేలకు పైగానే జనం పోగై, ఎవరో ఒక ప్రముఖ గాయకుడు 'ఇలియాడ్' లోని 'హెక్టర్ మృతి', 'ప్రియాం రాజు – అక్కిల్లీస్ ల భేటీ' మొదలగు రసవద్ఘట్టాలను శ్రావ్యంగా గానం చేస్తుంటే శ్రద్ధగా ఆలకిస్తూ ఉంటారు."

విశ్వ విజేత అలెగ్జాండర్ (సా. శ. పూ. 356 – 322) ' ఇలియాడ్' గ్రంథాన్ని తన తలగడ కింద ఉంచుకుని, చదవాలని బుద్ధిపుట్టినప్పుడల్లా తీసి చదువుకునేవాడనీ, కుదిరినప్పుడల్లా 'ఇలియాడ్' లోని ఘట్టాలు కథాంశాలుగా జరిగే నాటక ప్రదర్శనలు తిలకించేవాడనీ చరిత్రకారులు పేర్కొన్నారు.

# 10. కస్సాండ్రా కథ



బొమ్మ. కస్సాండ్రా (వికీపీడియా సౌజన్యంతో)

కస్సాండ్రా గ్రీసు దేశపు పురాణగాథలలో వచ్చే శాపగ్రస్తురాలైన ఒక వ్యక్తి. భవిష్యత్తులో ఏమి జరగబోతోందో చెప్పగలిగే శక్తి ఉన్న వ్యక్తి ఈమె. ఈ శక్తిని ఈమె అపాలో దగ్గర నేర్చుకుంది. కానీ అపాలో ఇచ్చిన శాపం వల్ల ఈమె మాటని ఎవ్వరూ నమ్మరు. అదెంత ప్రమాదానికి దారి తీసిందో ఈ కథలో చూద్దాం.

కస్సాండ్రా (Cassandra) ట్రోయ్ నగరపు రాకుమారి. ఈ ఉదంతం ట్రోయ్ సంగ్రామం జరగడానికి ముందు జరిగిన కథ. కస్సాండ్రా ట్రోయ్ నగరాన్ని పాలిస్తున్న రాజు ప్రియం కీ రాణి హెకూబాకీ పుట్టిన కవల పిల్లలలో ఆడ పిల్ల; (ఈమె కవల అన్నదమ్ముడు హెలినస్.) నల్లటి కురులు,

కలువ రేకుల లాంటి కళ్ళతో ఎంతో అందంగా ఉండేదని పేరు! అందమైన అమ్మాయిల కోసం అదే పనిగా వేటలో ఉన్న (దరిదాపు ఒలింపియా కొండ మీద ఉన్న దేవతలంతా చేసే పని ఈ రకం వేటే!) అపాలో  దృష్టి కస్సాండ్రా మీద పడింది. ప్రేమలో పడ్డాడు. వెంట పడ్డాడు. ప్రేమలో పడ్డ దేవతలని నిరాకరించే మనుష్యులు ఉంటారా? కానీ అదేమి విడ్డూరమో అపాలో అవస్థని చూసి కస్సాండ్రా నవ్వుకుంది; అతని ప్రేమని నిరాకరించింది.

కస్సాండ్రా మనస్సుని ఎలాగో ఒక లాగ గెలవాలనే తపనతో ఆమెకి అపూర్వమైన కానుకని ఇవ్వడానికి ప్రయత్నించేడు అపాలో.  అన్నీ ఉన్న రాకుమారికి తను కొత్తగా ఏమి ఇవ్వగలడు? ఆమెకి అందం ఉంది. ఐశ్వర్యం ఉంది. కాని ఆమెకి లేనిది, తన దగ్గర ఉన్నది ఒకటి ఉంది. అది దివ్యదృష్టి – అనగా, భవిష్యత్తులోకి చూడగలిగే శక్తి. ఇంత ఆసక్తికరమైన ప్రేమ బహుమానం ఎదురైనప్పుడు కస్సాండ్రా కాదనలేకపోయింది. ప్రతిఫలం మీద ఆశతో అపాలో  తో  "వీపు గోకుడు బేరానికి" కస్సాండ్రా ఒప్పుకుంది. తన వంతుగా అపాలో  దివ్యదృష్టి ఇచ్చే మంత్రాన్ని కస్సాండ్రాకి ఉపదేశించేడు. మంత్రం నేర్చుకున్న తరువాత అపాలోకి ముట్టవలసిన "పారితోషికం" ఇవ్వకుండా ఎగ్గొట్టింది; అపాలో ఎగబడుతూ చేస్తూన్న పురోగమనాలని కస్సాండ్రా నిరాకరించింది.

ఆత్మాభిమానం దెబ్బ తిన్న అపాలో  ఉగ్రుడయాడు. తను కస్సాండ్రాకి నేర్పిన మంత్రాన్ని తిరిగి వెనక్కి తీసుకోలేడు! తను చెయ్యగలిగిందల్లా ఆ మంత్రం వల్ల కస్సాండ్రాకి లాభం లేకుండా చెయ్యడం. అందుకని "నువ్వు దివ్యదృష్టితో చూసి చెప్పగలిగే జోశ్యాన్ని ఎవ్వరూ నమ్మరు" అని శపించేడు. చెయ్యగలిగేది ఏమీ లేక కస్సాండ్రా తను నేర్చుకున్న దివ్యదృష్టి మంత్రాన్ని తన కవల అన్నదమ్ముడు హెలినస్ కి ఉపదేశించింది. (కచ–దేవయాని కథ ఇలాగే నడుస్తుంది!)

కస్సాండ్రా చాలా సందర్భాలలో జోశ్యం చెప్పింది; కాని ఎవ్వరూ నమ్మలేదు. అదే విషయాన్ని హెలినస్ చెబితే నమ్మేవారు! ఒక సారి కస్సాండ్రా తన దివ్యదృష్టితో చూసి పేరిస్ "తప్పిపోయిన" తన అన్నదమ్ముడే అని గుర్తించింది. పేరిస్ స్పార్టా రాణీ హెలెన్ ని దొంగిలించి వివాహం చేసుకుని ట్రోయ్ తీసుకు వస్తాడనిన్నీ, ఆ సంఘటన ట్రోయ్ నగరపు విధ్వంసానికి కారణభూతం అవుతుందనిన్నీ, కనుక

పేరిస్ ని స్పార్టా వెళ్ళవద్దని బ్రతిమాలుతుంది. ఎవ్వరూ వినిపించుకోరు. ట్రోయ్ నగరం మీదకి దండెత్తి వచ్చే గ్రీసు దేశపు సేనాధిపతి అగమేంనాన్ యుద్ధంలో చనిపోతాడని జోశ్యం చెబుతుంది. ఎవ్వరూ పట్టించుకోరు. తను కూడా ఆ యుద్ధంలో చచ్చిపోతానని చెబుతుంది. అంతా "పిచ్చి వాగుడు" అని పెడచెవిని పెడతారు. చిట్టచివరికి గ్రీకులు రణరంగంలో వదలిపెట్టి వెళ్లిన కర్రగుర్రం ప్రమాదానికి దారి తీస్తుంది, దానిని లోపలికి తీసుకురావద్దని కస్సాండ్రా హెచ్చరిస్తే ఎవ్వరూ వినరు.

ఈ రోజుల్లో అయితే కస్సాండ్రా లాంటి వ్యక్తిని "శకున పక్షి" అని గేలి చేసి ఉండేవారు. మనకి అవగాహనలో లేని ఏదైనా శక్తివంతమైన ప్రభావం వల్ల మనకి ఏదో కీడు కలగబోతోందని జోశ్యం చెప్పేమనుకొండి. ఉదాహరణకి "పర్యావరణం వెచ్చబడడం వల్ల పల్లపు ప్రాంతాలు ముంపుకి గురవుతాయి" అని ఒక శాస్త్రవేత్త జోశ్యం చెప్పేడనుకొండి.

మనకి వెంటనే నమ్మబుద్ధి కాదు. రాబోయే ప్రమాదం నుండి తప్పించుకుందికి కానీ, ఆ ప్రమాదం వల్ల కలిగే హానిని తగ్గించడానికి కానీ వ్యయ ప్రయాసలు, కాలయాపన కావచ్చు. మన రాజకీయ నాయకులకి రాబోయే ఎన్నికల మీద ఉన్న దృష్టి ఎప్పుడో పాతిక సంవత్సరాల తరువాత రాబోయే ముంపు మీద ఉండదు. ఇటువంటి సందర్భాలలో శాస్త్రవేత్తలు చెప్పే జోశ్యానికి కస్సాండ్రా చెప్పిన జోశ్యానికి పట్టిన గతే పడుతుంది.

సంప్రదించిన మూలాలు:

Carl Sagan, Croesus and Cassandra, Chapter 9 in *Billions & Billions*, Random House, New York, NY 1997.

# 11. క్రీసస్ ఉదంతం



బొమ్మ. లిడియా రాజ్యపు పాలకుడు (595 BC – ??) (వికీపీడియా సౌజన్యంతో)

ద్వాదశ ఒలింపియను దేవతలలో అపాలో ఒకడు. అతనికి వచ్చిన అనేక విద్యలలో దివ్యదృష్టి ఒకటి; అతను భవిష్యత్తులోకి చూసి ఏమి జరగబోతోందో చెప్పగల సమర్ధుడు. ఒలింపియను దేవతలలో చాలమందికి ఈ రకం "దివ్యదృష్టి" ఉంది కానీ ఒక్క అపాలో మాత్రమే ఈ విద్యని మానవులతో పంచుకోడానికి సుముఖత చూపేవాడు. ఇందుకని అపాలో అనేక "మఠాలు" స్థాపించి, ప్రతి మఠం లోనూ "ఓరకిల్" (Oracle) అనే ఒక "దివ్యవాణి"ని ప్రతిష్ఠ చేసేడు. ఓరకిల్ అంటే సర్వజ్ఞుడు, ద్రష్ట, ప్రవక్త అనే అర్థాలు చెప్పుకోవచ్చు. ఈ "ఓరకిల్" అనేది ఒకరి ఒంటి మీదికి ఆవహించి వారి నోట పలికే భవిష్యవాణి. మన దేశంలోనూ గణాచారుల ఒంటి మీదికి పూనకం రావడం, అప్పుడు వాళ్ళు ఏదైనా చెప్పడం ఉన్నాయి. ఇప్పటికీ సమ్మక్క జాతరలో ఇలా అమ్మవారు ఒంటి మీదకు వచ్చి ప్రజలకు సందేశం ఇవ్వడం జరుగుతూనే ఉంది. అపాలో  స్థాపించిన ఇటువంటి "మఠాలు" లో డెల్ఫై (Delphi) లో ఉన్న మఠం ప్రసిద్ధి చెందినది. ఈ డెల్ఫై మఠంలో ఉన్న గణాచారిణి పేరు పిథియా

(Pithea). పెద్దలు, పిన్నలు, రాజులు, పేదలు, ఇలా అనేక మంది డెల్ఫై కి వచ్చి వాళ్ళకి భవిష్యత్తులో ఏమి "రాసి పెట్టి ఉందో" చెప్పమని దివ్యవాణిని అర్థించడం, దివ్యవాణి వారి కోరికని పిథియా వాక్కు ద్వారా మన్నించడం జరుగుతూనే ఉంటుంది.

ఇలా డెల్ఫై లో ఉన్న "ఒరకిల్" ని సంప్రదించడానికి వచ్చిన వారిలో సాక్షాత్తూ లిడియా దేశపు రాజు క్రీసస్ (Croesus) ఒకడు. హెరడోటస్ (సుమారు సా. శ. పూ. 484 – 425) రాసిన చరిత్ర ప్రకారం లిడియా రాజ్యాన్ని క్రీసస్ 14 సంవత్సరాలు పరిపాలించేడు (సుమారు సా. శ. పూ. 595 నుండి 546 వరకు). అనగా క్రీసస్ కథ కోసం కల్పన చేసిన శాల్తీ కాదు; నిజంగా చరిత్రలో ఒక మానవుడు. క్రీసస్ అత్యంత ధనవంతుడు. అతను ఎంత ధనవంతుడంటే ఇప్పటికీ "వాడు క్రీసస్ అంత ధనవంతుడు" అనే నుడికారం పాశ్చాత్య భాషలలో ఉంది.

క్రీసస్ అంత ధనవంతుడు అవడానికి రెండు కారణాలు ఉండే సావకాశం ఉంది. లిడియా రాజ్యానికి ముఖ్యపట్టణం అయిన సార్డిస్ (Sardis) గుండా పేక్టోలస్ (Pactolus) అనే నది ప్రవహిస్తోంది. ఆ నదీ గర్భంలో ఉన్న ఒండుమట్టిలో వెండి, బంగారం కలిసిన మిశ్రమ లోహం దొరుకుతుంది. మైదస్ రాజు ఈ పేక్టోలస్ లో స్నానం చేసి తాను పట్టిందల్లా బంగారంగా మారుతున్న "వరం" నుండి విముక్తి పొందేడు అనే ఒక కథ ఉంది కదా! ఆ కథే ఈ పేక్టోలస్ నదిలో దొరికే ఈ బంగారానికి కారణం అంటారు. నిజానికి క్రీసస్ అంత ధనవంతుడు అవడానికి అతని సామంతులు కట్టే కప్పాలు కూడా కారణం కావచ్చు.

క్రీసస్ తనకున్న ఐశ్వర్యంతో తృప్తి పొందలేదు. ఎందుకు పుట్టిందో, ఎలా పుట్టిందో కానీ పశ్చిమ ఆసియాలో ఏకచ్ఛత్రాధిపత్యంతో అలరారుతున్న పారశీక సామ్రాజ్యం పై దండెత్తి ఆ రాజ్యాన్ని తన వశం చేసుకోవాలనే బుద్ధి అతని పుర్రెలో పుట్టింది. ఈ రోజుల్లో అమెరికా ఎలాంటిదో ఆ రోజుల్లో సైరస్ చక్రవర్తి (Cyrus, the Great) పరిపాలనలో ఉన్న పారశీక సామ్రాజ్యం అంత శక్తిమంతమైన దేశం!

బుద్ధి పుట్టడం పుట్టింది కానీ క్రీసస్ మనస్సు పీకుతోంది. యుద్ధం ముగిసే వరకు పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు కదా. అందుకని డెల్ఫై లో ఉన్న “ఓరకిల్” ని అడిగి తెలుసుకురమ్మని కానుకలు ఇచ్చి ప్రత్యేక ప్రతినిధిని పంపేడు. క్రీసస్ డెల్ఫై లో ఉన్న “ఓరకిల్” కి ఇచ్చిన కానుకలు ఆ ఆలయంలో హెరడోటస్ కాలం వరకు ఉన్నాయిట! క్రీసస్ తరఫున రాయబారులు డెల్ఫై లో ఉన్న “ఓరకిల్” ని అడిగిన ప్రశ్న: పారశీక దేశం మీదకి క్రీసస్ దండయాత్ర జరిపితే పర్యవసానం ఎలా ఉంటుంది?”

ఈ ప్రశ్నకి సమాధానంగా పిథియా ద్వారా ఓరకిల్ ఇచ్చిన సమాధానం: “క్రీసస్ ఒక అద్భుతమైన సామ్రాజ్యాన్ని సర్వనాశనం చేస్తాడు.”

“దేవుడు మన పక్షం. దండయాత్రకు సంసిద్ధం అవండి!” అని క్రీసస్ ఆజ్ఞ జారీ చేసేడు. క్రీసస్ సేనా వాహిని గట్లు తెంచుకుని పెల్లుబికి ప్రవహించిన నదిలా ఒక్కుమ్మడి పారశీక సామ్రాజ్యం మీద విరుచుకు పడింది. పారశీక చక్రవర్తి సైరస్ సైన్యం క్రీసస్ ని చిత్తు చిత్తుగా ఓడించి క్రీసస్ ని బందీగా తీసుకుపోయింది. చిట్టచివరికి చావు తప్పి కన్ను లొట్టపోయిన చందాన సైరస్ కొలువులో క్రీసస్ చిన్న గుమస్తా ఉద్యోగం చేస్తూ శేష జీవితం గడిపేడు.

తనని ఈ విధంగా ఓరకిల్ పచ్చి మోసం చేస్తుందని క్రీసస్ కలలో కూడా అనుకోలేదు. ఓరకిల్ ని ఊరకనే సలహా ఇమ్మని అడగలేదు. బిళ్లకుడుములులా పారితోషికం (లంచం) సమర్పించుకున్నాడు కదా! పట్టపగలు బహిరంగంగా ఇంత పచ్చి మోసమా? మునుపటిలా ఇప్పుడు ఆస్తులు, అంతస్తులు లేవు. అయినా ఉన్న దాంట్లో కాసింత గోకి, గోకి చిన్న పారితోషికంతో తోటి గుమస్తాని పంపేడు – జరిగిన అన్యాయానికి కారణం ఏమిటో తెలుసుకు రమ్మని.

తాను రాసిన “హిస్టరీ” అనే గ్రంథంలో హెరడోటస్ జరిగిన అన్యాయానికి కారణం ఈ విధంగా చెబుతాడు: “డెల్ఫై లోఉన్న ఓరకిల్ చెప్పిన జోస్యం ప్రకారం క్రీసస్ పారశీక దేశం మీద దండయాత్ర చేస్తే ఒక మహా సామ్రాజ్యం సర్వనాశనం అయిపోవాలి. “ఆ నాశనం అయిపోబోయే సామ్రాజ్యం ఎవరిది? తనదా? శత్రువుదా?” అని అడగవలసిన కనీసపు బాధ్యత క్రీసస్ ది. అధికారంలో ఉన్న

పాలకులకి సలహాదారులు సలహాలు ఇచ్చినప్పుడు "ఆ సలహా అమలు పరచితే పర్యవసానం ఎలా ఉంటుంది?" అని అడగకుండా "లేడికి లేచిందే పయనం" అన్న రీతిలో రాజ్యం ఏలితే ఇలానే ఉంటుంది. ఇది స్వయంకృతాపరాధం."

క్రీసస్ పరాజయం గ్రీసు దేశపు చరిత్రలో విస్మరించడానికి వీలులేని మైలురాయి.


ప్రచ్ఛన్న అర్థ సందిగ్ధతలతో మాట్లాడడం ఈ నాటి జ్యోతిష్కుల ఆయుధం ఎలాగయిందో అలాగే అలనాటి ఓరకిల్ లకి కూడా ఆయుధం అయి ఉండాలి. ఎంత సర్వజ్ఞుడిని అయినా సరే మనం అడిగే ప్రశ్నలు అర్థవంతంగా ఉండాలి, నిర్ద్వందంగా ఉండాలి. సరి అయిన గురి పెట్టి అడగాలి. అదే విధంగా నిష్ణాతులు ఇచ్చే సలహాలని విధివిధానాలుగా మార్చి అవలంబించే ముందు ఆ సలహాల పర్యవసానాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం పాలకులు నేర్చుకోవాలి.

ఈనాటి ప్రభుత్వాలకి ఓరకిల్ లు ఎవరు? శాస్త్రవేత్తలు, స్మరణ తటాకాలు (think tanks), విశ్వవిద్యాలయాల్లో ఉన్నత ఆసనాలు అధిష్టించిన ఆచార్యులు, వగైరాలు. ఈ పిదప కాలపు ఓరకిల్ లను ప్రభుత్వాలు అప్పుడప్పుడు, అయిష్టంగానే, సంప్రదిస్తాయి. కొండకచో కొన్ని ఓరకిల్ లు అడిగినా, అడగక పోయినా వారి విలువైన అభిప్రాయాలని ఉచితంగా జారీ చేస్తూ ఉంటారు: "ఆకాశంలో ఓజోన్ పొరలో చిల్లు పడడం వల్ల పర్యావరణం దెబ్బ తింటోంది." "పర్యావరణం వేడెక్కిపోవడం వల్ల ధ్రువ ప్రాంతాలలో మంచు కరిగిపోయి దాని వల్ల తీర ప్రాంతాలు ముంపుకి గురి అవుతాయి," వగైరా. ఈ అభిప్రాయాలైనా సరళమైన, నలుగురికీ అర్థం అయే భాషలో ఉంటాయా? ఉండవు. శాస్త్రీయ పరిభాషలో, సంభావ్యతలు, శాతాలు, గంట ఆకారంలో ఉన్న చిత్రపటాల రూపంలో ఉంటాయి. రాజనీతి తంత్రజ్ఞులు విధివిధానాలని జారీ చేసే ముందు ఈ పరిభాషని అర్థం చేసుకుని అప్రమత్తతతో మెలగాలి. ఆ అప్రమత్తతకి కనీస శాస్త్రీయ పరిజ్ఞానం, అవగాహన అత్యవసరం. మనం ఎన్నుకున్న ప్రతినిధులలో ఎంతమందికి ఈ రకం శాస్త్రీయ అవగాహన ఉంటోంది?

సంప్రదించిన మూలాలు:

Carl Sagan, Croesus and Cassandra, Chapter 9 in *Billions & Billions*, Random House, New York, NY 1997.

# 12. ఆర్టెమీస్, ఒరాయన్ల ప్రేమ గాథ



బొమ్మ. ఆర్టెమిస్ (డయానా) (వికీపీడియా సౌజన్యంతో)

గ్రీకు పురాణాలలో ఆర్టెమీస్ (Artemis), ఒరాయన్ (Orion) ల ప్రేమ గాథ రకరకాల మూలాలలో రకరకాలుగా – చిన్నచిన్న తేడాలతో – కనిపిస్తుంది. అపాలో యొక్క కవల సహోదరి ఆర్టెమీస్. ఈమె మృగయావినోదాలకి అధిపత్ని. పసితనం నుండి ఈమెకి వేటాడం మీద అభిమానం మెండుగా ఉండేది. అందుకని ఆర్కేడియాలో ఉన్న కొండలలోను, కోనలలోను వేటాడుతూ, క్రొంగొత్త అనుభవాలని అన్వేషిస్తూ తిరుగాడడానికి ఇష్టపడుతూ ఉండేది. తండ్రి జూస్ అమె అభిలాషలని ప్రోత్సహించేవాడు. ఆమె రక్షణ కోసం ఆమెకి ఏడుగురు వనదేవతల (nymphs)ని చెలికత్తెలుగా నియమించేడు. ఈమెకి పేన్ (Pan) రెండు వేట కుక్కలని కానుకగా ఇచ్చేడు. (ఈ పేన్ నడుం దిగువ భాగం గొర్రె ఆకారంలోనూ, ఎగువ భాగం మనిషి ఆకారంలోనూ ఉండే ఒక వనదేవుడు; అడవులలోను గడ్డి మైదానాలలోను గొర్రెలని కాసుకుంటూ, పిల్లనగ్రోవి ఊదుకుంటూ తిరుగాడుతూ ఉంటాడు. ఇతను మధ్యాహ్నం వేళ కునుకు తీస్తున్న సమయంలో ఎవరైనా అకస్మాత్తుగా లేపితే తుళ్ళిపడి లేచి పెడ బొబ్బ పెడతాడు. ఆ శబ్దానికి భయపడి అతని గొర్రెలు చిందరవందరగా చెల్లాచెదరు అయిపోతాయి. ఈ సంఘటనని పురస్కరించుకుని అకస్మాత్తుగా భయపడే సందర్భాన్ని వర్ణించడానికి ఇంగ్లీషులో "పేనిక్" (panic) అన్న మాట పుట్టింది.) ఒంటి కన్ను సైక్లాప్స్ ఈమెకి వెండితో చేసిన విల్లమ్ములని బహూకరించేడు. వీటితో నిత్య సాధన చేసిన ఆర్టెమిస్ ప్రతిభ అతి త్వరలోనే అపాలోతో సరితూగడం మొదలయింది.

ఆర్టెమీస్ అహోరాత్రాలు వేటలో మెళుకువలు నేర్చుకుంటూ, నేర్చిన వాటికి పదును పడుతూ, ఏకాంతంగా రోజులతరబడి గడిపేసేది. ఆమె ఏకాంతానికి భంగం కలిగితే ఆమెకి ఎక్కడ కోపం వస్తుందో అని మానవులు ఆమెకి దూరంగా ఉండేవారు. అడవులలో ఏకాంతంగా ఆమె వేటాడుతూ ఉంటే వనదేవతలైన ఆమె చెలికత్తెలు కేరింతలు కొడుతూ ఆడుకునేవారు!

ఒకనాడు ఆర్టెమీస్ ఒక జలాశయంలో జలకాలాడుతూ ఉన్న సమయంలో ఆక్టెయోన్ అనే మానవుడు అటువైపు వెళ్ళడం తటస్థించింది. అతను ఇదివరలో ఆర్టెమిస్ అందచందాల గురించి విని ఉన్నాడు కానీ, ఆమె ఇంత అందంగా ఉంటుందని కలలోనైనా ఊహించలేదు. ఆమెని చూస్తూ, నిర్విణ్ణుడై స్థాణువులా ఉండిపోయేడు.

కొలనులో జలకాలాడుతూన్న ఆర్టెమీస్  తన వైపే రెప్ప వాల్చకుండా చూస్తూన్న ఆక్టెయోన్ ని చూసి ఉగ్రురాలు అయింది. చేతితో నీళ్లు తీసుకుని అతని వైపు వెదజల్లింది. ఆ నీటి బిందువులు అతని శరీరాన్ని తాకే సరికి అతను ఒక దుప్పిగా మారిపోయేడు. అప్పుడు ఆర్టెమీస్  బిగ్గరగా ఒక ఊళ వేసేసరికి ఆమె వేట కుక్కలు రెండూ పరుగు పరుగున వచ్చి, ఆ దుప్పిని చీల్చి చెండాడి చంపేసేయి.

దయనీయ పరిస్థితులలో ఆక్టెయోన్ ఎదుర్కున్న దారుణ మరణ వార్త ఆ అడవిలో దావానలంలా వ్యాపించింది. అందరూ  ఆర్టెమీస్ ని కన్నెత్తి చూడడానికే భయపడేవారు; ఒక్క ఒరాయన్ తప్ప. ఒరాయన్ తండ్రి పోసైడన్, తల్లి యురియెల్ (Euryale) అనే మానవ స్త్రీ. ఒరాయన్ భూలోక సుందరుడు అని పేరు పొందేడు; ఒకరికి భయపడే రకం కాదు. ఒరాయన్ కి ఆ అడవిలో వేటాడుతూ తిరగడం అంటే బహు ప్రీతి. అంతే కాదు; ఒరాయన్ వనకన్య మెరోపీ (Merope) ని ప్రేమించేడు. ఆమె ఎక్కడ ఉంటే అతను అక్కడే తిరుగాడేవాడు. అయినా భయం వల్లో, భక్తి వల్లో, మర్యాద కొరకో ఎల్లప్పుడూ ఆర్టెమీస్  కి దూరంగానే ఉండేవాడు.

ఒక నాడు బృహత్ లుబ్ధకం (Canis Major), లఘు లుబ్ధకం (Canis Minor) అనే పేర్లు గల తన కుక్కలని వెంటేసుకుని ఒరాయన్ వేటాడుతున్నాడు. అకస్మాత్తుగా ఎదురుగా ఉన్న తుప్పలలో తెల్లగా ఉన్నది ఏదో కదిలింది. అది ఏదో అపురూపమైన పక్షి మూక అయి ఉంటుందని ఊహించి చాటుమాటున పొంచి మెదలడం మొదలు పెట్టేడు, ఒరాయన్. అతను సమీపించేసరికి ఆ తెల్లగా ఉన్నది మెరుపులా పరుగు తీసింది. సావధానంగా చూసేసరికి అవి పక్షులు కావు, ఆ కదిలేవి తెల్లటి ఉడుపులతో ఉన్న ఏడుగురు వనకన్యలు అని తేలింది.

ఒరాయన్ వారిని వెంబడించేడు.  వనకన్యల గుంపు వాయువేగంతో ముందుకు పోతోంది.  ఒరాయన్ వేగంలో వారిని ఏమాత్రం తీసిపోలేదు. పైగా ఒరాయన్ బలశాలి. పరుగున వచ్చి ఒరాయన్ మెరోపీ కొంగు పట్టుకున్నాడో లేదో ఆమె కెవ్వున కేక వేసింది. ఆ కేక ఆర్టెమీస్  విన్నది. విన్న వెంటనే ఆర్టెమీస్ ఆ ఏడుగురు వనకన్యలని ఏడు తెల్లటి పావురాలుగా మార్చేసింది.  అవి రివ్వున ఆకాశపు లోతుల్లోకి ఎగిరిపోయాయి. అలా ఆ పావురాలు వినువీధి లోకి ఎగిరిపోతూ ఉంటే ఆర్టెమీస్  తన తండ్రి జూస్ ని

పిలచి ఆ వనకన్యలకి ఏ హాని జరగకుండా చూడమని ప్రార్థించింది. అప్పుడు జూస్ ఆ ఏడుగురు వనకన్యలని ఏడు నక్షత్రాలుగా మార్చేసి ఆకాశంలో శాశ్వతంగా ఉండిపొమ్మని చెప్పేడు. ఆ ఏడు నక్షత్రాలనే ప్లయేడ్స్ (Pleiades) లేదా Seven Sisters అని అంటారు. (ఇవే వృషభరాసిలో కృత్తికలు అన్న పేరుతో కనిపించే నక్షత్రాలు. ఇప్పట్లో ఆరే కనిపిస్తున్నాయి!)

ఈ అలజడికి కారణం ఏమిటా అని ఆర్టెమీస్ ఇటూ, అటూ చూసేసరికి ఎదురుగా ఒరాయన్ కనిపించేడు. అతని అందం, అతని వర్చస్సు, అతని వేగం ఆర్టెమీస్ ని అపరిమితంగా ఆకర్షించేయి. అప్రయత్నంగానే ఇద్దరూ కలసి వేటాడడం మొదలు పెట్టేరు. ఒకరితో మరొకరు పోటీలు పడుతూ వేటాడేవారు. చీకటి పడ్డ తరువాత నెగడి దగ్గర చలి కాగుతూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసేవారు. వారి నవ్వుల సవ్వడితో ఆ అడవి ప్రతిధ్వనించేది.

శుక్ల పక్ష చంద్రుడిలా పెరుగుతూన్న వీరి స్నేహం అపాలోకి నచ్చలేదు. “కేవలం... ఒక మానవమాత్రుడిని ఎలా ప్రేమించగలుగుతున్నావ్?” అని నిలదీశాడు.


“మానవుడైతేనేం? ఒరాయన్ బలశాలి, ధైర్యవంతుడు,” అని ఆర్టెమీస్ ఎదురు తిరిగి సమాధానం ఇచ్చేసరికి అపాలో అహం దెబ్బ తింది. తన సోదరి సమీకరణం నుండి ఒరాయన్ ని ఎలాగైనా తప్పించాలని అపాలో ఒక కృత నిశ్చయానికి వచ్చేడు.

ఒక రాత్రి! ఒక మండ్రగబ్బ – నల్లని పెద్ద తేలు – ఒరాయన్ మీదకి వస్తోంది. ఒరాయన్ దానిని ఎదుర్కొని చంపడానికి శతధా ప్రయత్నం చేస్తున్నాడు. అయినా అతని కృషి సఫలం కావటం లేదు. ఒరాయన్ అంతటి ధీరుడు కేవలం ఒక నల్ల తేలుని ఎదుర్కొని చంపలేకపోతున్నాడు. ఒరాయన్ కి ముచ్చెమటలు పోస్తున్నాయి. తేలు మీదమీదకి వచ్చి అతని వక్షస్థలం మీద కాటు వెయ్యడానికి కొండిని పైకి ఎత్తింది. ఒరాయన్ ఒక్క పెడ బొబ్బ పెట్టేడు. అతని ఒళ్ళంతా శ్వేదావృతం అయిపోయింది. మెలకువ వచ్చింది. అదంతా నిద్రలో వచ్చిన ఒక పీడ కల అని గ్రహించి స్థిమిత పడ్డాడు. నిద్ర లోంచి తేరుకుందామని, బయటికి, చల్ల గాలిలోకి వచ్చాడు. ఎదురుగా నల్లటి మండ్రగబ్బ! కలలో

కనిపించినదే! ఒరాయన్ ఆ తేలుతో హోరాహోరీ పోరాడేడు. చిట్టచివరికి ఆ తేలు వేసిన కాటుకి ఒరాయన్ మరణించేడు.

ఒరాయన్ మరణం ఆర్టెమీస్ ని కృంగదీసింది. ఒరాయన్ ప్రాణాలు తీసిన తేలు ఇంకా అక్కడే ఉంది. ఆర్టెమీస్ కోపంతో ఆ తేలుని పట్టుకుని రివ్వున ఆకాశంలోకి విసిరేసింది. అదే ఇప్పుడు మనకి ఆకాశంలో కనిపించే వృశ్చిక రాసి. ఈ తేలు గుండెకి సమీపంలో కనిపించే నక్షత్రమే జ్యేష్ఠ (Antares). అటు తరువాత రాసి చక్రంలో, వృశ్చిక రాసికి బహుదూరంలో ఉండేలా, అతిశయించిన ప్రేమతో ఒరాయన్ పార్థివ దేహాన్ని, అతని వేట కుక్కలని, ఆర్టెమీస్ నక్షత్రాల రూపంలో అమర్చింది. అందుకనే ఒరాయన్ నక్షత్ర కూటమి తూర్పున ఉదయించే వేళకి వృశ్చిక రాసి పడమట అస్తమిస్తుంది.

ఇప్పటికీ తలెత్తి చూస్తే ఆకాశంలో తేలికగా పోల్చుకోగలిగే నక్షత్ర రాసి ఒరాయన్! దీనినే మనం మృగవ్యాధుడు అని భారతీయ భాషలలో అంటాం. చీకటి రాత్రి పశ్చిమ ఆకాశం వైపు చూస్తే కొట్టొచ్చినట్లు దగ్గరదగ్గరగా మూడు చుక్కలు వరసగా కనిపిస్తాయి. వీటిని వేటగాడి నడుం చుట్టూ ఉన్న పటకాలా ఊహించుకుంటే ఆ పటకా నుండి కిందకి కాని, కుడి పక్కకి కాని మరి రెండు చుక్కలు కనిపిస్తాయి; అవి మృగవ్యాధుడి కాళ్లు. ఎడమ మోకాలి దగ్గర ఉన్న నక్షత్రం పేరు రైజెల్ (Rigel, వృత్రపాద నక్షత్రం). పటకా నుండి పైకి చూస్తే రెండు బాహుమూలాలు, వాటి మీద తలకాయ ఉండవలసిన చోట మరొక తార కనబడతాయి. కుడి చంక దగ్గర ఎర్రగా కనిపించే నక్షత్రం పేరు బీటిల్^జూస్ (Betelgeuse, ఆర్ద్రా నక్షత్రం). బాగా ముందుకి చాపిన ఎడం చేతిలో విల్లు, పైకి ఎత్తిన కుడి చేతిలో రెండు బాణాలు (లేదా, ఒక దుడ్డు కర్ర) కూడ చూడవచ్చు.




బొమ్మ. వినువీధిలో ఒరాయన్ (వికీపీడియా సౌజన్యంతో)

మృగవ్యాధుడు పాదాల దిగువన, కాసింత వెనకగా Canis Major (పెద్ద కుక్క) లేదా బృహత్ లుబ్ధకం ఉంటుంది. ఇది ఉత్తరాకాశంలో మరొక నక్షత్ర రాశి; మృగవ్యాధుడుకి ఆగ్నేయంగా ఉన్న ఈ రాశిలోనే మన ఆకాశంలో కనిపించే అత్యంత ప్రకాశమానమైన సిరియస్ (Sirius, మృగశిర) నక్షత్రం ఉంది.

అమెరికా 1960 దశకంలో చంద్రుడి మీద కాలు మోపడానికి చేసిన ప్రయత్నానికి "అపాలో" అని పేరు పెట్టేరన్న సంగతి అందరికీ తెలిసినదే. ఇప్పుడు మళ్లా రాబోయే దశకంలో చంద్రుడి మీద రెండోసారి కాలు మోపడానికి చేస్తూన్న ప్రయత్నానికి ఆర్టెమీస్ అన్న పేరు, ఈ ప్రయత్నంలో

వాడబోయే నభోనౌక పేరు ఒరాయన్ అని గమనిస్తే గ్రీకు సంస్కృతి సైన్సు ని ఎంతగా ప్రభావితం చేస్తూందో అవగతం అవుతుంది!

# 13. ఎడిపస్ విషాద గాథ



బొమ్మ. స్ఫింక్స్ అడిగిన ప్రశ్నకి ఎడిపస్ సమాధానం చెప్పడం (వికీపీడియా)

గ్రీసు పురాణగాథలలో ఎడిపస్ (Oedipus) కథ పేరెన్నికగన్న కథ. సంస్కృతంలో కాళిదాసు "శాకుంతలం" ఎంత పేరు పొందిందో గ్రీకు భాషలో సోఫోక్లిస్ (Sophocles, సా. శ. పూ. 496 – 405) రచించిన "ఎడిపస్ రెక్స్" (Oedipus Rex or King Oedipus) అనే నాటకం అంత చెప్పుకోదగ్గది. చిఱుతప్రాయంలో పిల్లలు ఎదుర్కొనే ఒక విచిత్రమైన మనోస్థితిని వర్ణించడానికి ఆధునిక మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ "ఎడిపస్ కాంప్లెక్స్" అనే పదబంధాన్ని ప్రవేశపెట్టి ఎడిపస్ కథకి ఒక రకం ప్రాచుర్యం తీసుకొచ్చేడు; అంతే కానీ ఎడిపస్ ఈ రకం మనోస్థితిని ఎదుర్కొనలేదు.

## 13.1 థీబిస్ రాజ్యంలో ఎడిపస్ పుట్టుక

ఎడిపస్ కథ ఎడిపస్ పుట్టక మునుపే మొదలయింది. థీబిస్ (Thebes) రాజ్యానికి రాజైన లెయుస్ (Laius) కి పుత్ర సంతతి లేకపోతే  డెల్ఫైలో ఉన్న ఓరకిల్ ని  సంప్రదించడానికి భార్యా సమేతంగా వెళతాడు. "మీ ఇద్దరికి పుట్టబోయే సంతానమే నీ  చావుకి కారకుడవుతాడు. కనుక ఆ కోరిక విరమించుకో," అని ఓరకిల్ లెయుస్ కి సలహా చెబుతాడు. ఓరకిల్ సలహా తు. చ. తప్పకుండా పాటించడానికి లెయుస్ నిశ్చయించుకొని భార్య పట్ల అతి జాగరూకతతో ఉండేవాడు. కానీ వసంత ఋతువు విజృంభించిన ఒక  వెన్నెల రాత్రి, మధుపానపు మత్తులో, నిగ్రహాన్ని కోల్పోతాడు. రాణి యొకాస్టా గర్భవతి అవుతుంది. నెలలు నిండగానే పండంటి మగ  శిశువుని కంటుంది.  ఓరకిల్ చెప్పిన జోశ్యపు బారినుండి తప్పించుకోడానికి  శిశువు చీలమండలు రెండింటికి సూదులు గుచ్చెయ్యమని భటులకి ఆదేశాలు ఇచ్చేడు, రాజు. అలా చేస్తే శిశువు పాకడం, నడవడం వంటి పనులు చెయ్యలేడు కనుక తన చావుకి కారకుడు కాలేడని రాజు ఊహ. రాజాజ్ఞ శిరసావహించేరు సేవకులు. "ఎందుకైనా మంచిది, శిశువుని  హతమార్చడమే శ్రేయస్కరం" అని మంత్రుల సలహా ఇవ్వగా శిశువుని కొండలలోకి తీసికెళ్ళి చంపెయ్యమని రాజ్యంలోఉన్న ఒక గొర్రెల కాపరికి ఆదేశాలిచ్చాడు, రాజు. పసివాడి ప్రాణాలు తియ్యడానికి మనసు ఒప్పక ఆ గొర్రెల కాపరి ఆ బాలుడిని  పొరుగున ఉన్న కోరింత్ రాజ్యపు మరొక గొర్రెల కాపరికిస్తే,  అతను పసివాడిని పెంచుకున్నాడు.

## 13.2  కోరింత్ రాజ్యంలో ఎడిపస్ పెరుగుట

కోరింత్ (Corinth) రాజ్యపు రాజు పోలిబస్ (Polybus), రాణి మెరోపి (Merope) లకి పిల్లలు లేరు.  అందుకని ఈ రెండవ గొర్రెల కాపరి పసివాడిని రాజుకి కానుకగా ఇచ్చేడు. సూదిపోట్ల వల్ల పసివాడి చీలమండలు రెండూ  వాచి ఉండడం చూసి పోలిబస్  పసివాడికి ఎడిపస్ అని పేరు పెట్టేడు – ఎడిపస్ అంటే "వాచిన పాదం" అని అర్థం. (వైద్య పరిభాషలో ఎడీమా (edema) అంటే వాపు అని అర్థం ఉంది కదా!)

ఎడిపస్ పెద్దవాడైన తరువాత ఒక తాగుబోతు మైకంలో ఉన్నప్పుడు, "రాజు పోలిబస్, రాణి మెరోపి నీ జనక తల్లిదండ్రులు కారు తెలుసా?" అని అన్నాడు. ఈ వదరుబోతు మాటలలో నిజం ఎంతో, పేలాపన ఎంతో తేల్చుకుందామని ఎడిపస్ డెల్ఫీ వెళ్లి అక్కడ ఓరకిల్ ని సంప్రదించేడు. అడిగిన ప్రశ్న ఏమిటో కానీ ఓరకిల్ ఇచ్చిన సమాధానం ఎడిపస్ ని కలవరపరచింది: "నువ్వు నీ తండ్రిని చంపేసి నీ తల్లిని వివాహం చేసుకుంటావు." ఈ జోశ్యం విన్న ఉత్తర క్షణంలో ఎడిపస్ కోరింత్ రాజ్యపు పొలిమేరలు దాటి ఎంత దూరం వీలయితే అంత దూరదేశాలకి వెళ్ళిపోడానికి నిశ్చయించుకుని, ఉత్తర దిశగా ప్రయాణంచేసి, చిట్టచివరికి, విధి వెంట తరమగా, థీబిస్ రాజ్యం పొలిమేరలకి చేరుకుంటాడు!

## 13.3 మూడు బాటల మొగలో పోరు

థీబిస్ రాజ్యపు పొలిమేరలలో, ఒక మూడు బాటల మొగలో, ఎడిపస్ దారికి ఒక రథం అడ్డుపడుతుంది. ఆ రథ సారథి "పక్కకి తప్పుకో, దారి విడు" అని అరుస్తాడు.

"నేను ముందొచ్చాను. నేనెందుకు తప్పుకోవాలి. నువ్వే తప్పుకో" అని ఎడిపస్ అంటాడు. మాట మీద మాట పెరిగి, పోరాటంలోకి దిగగా రథ సారథినీ, రథారూఢుడైన రాజుని ఎడిపస్ చంపేస్తాడు. ఒక భటుడు మాత్రం తప్పించుకుని పారిపోతాడు. ఆ రథంలో ఉన్న వ్యక్తి థీబిస్ రాజ్యపు రాజన్న విషయం కానీ, ఆతను తన కన్న తండ్రే అన్న విషయం కానీ, ఎడిపస్ కి తెలియదు. ఈ విధంగా ఓరకిల్ చెప్పిన జోశ్యంలో మొదటి భాగం నిజం అయింది!

## 13.4 స్ఫింక్స్ అడిగిన ప్రశ్న

థీబిస్ రాజ్యపు పొలిమేరలు దాటుకుని లోపలికి వెళ్లడానికి ప్రయత్నించే సరికి ఎడిపస్ కి స్ఫింక్స్ రూపంలో మరొక సమశ్య ఎదురవుతుంది. ఈ స్ఫింక్స్ (Sphinx) అనే శాల్తీ ఒక రకం కంచర "నరసింహ" రూపం! ఈ శాల్తీ తల మానవాకారంలోను, సింహపు శరీరంతోనూ ఉండడమే కాకుండా దీనికి డేగ రెక్కలు కూడా ఉంటాయి! ఏకచక్రపురాన్ని బకాసురుడు వేధించుకు తిన్నట్లు థీబిస్ రాజ్యాన్ని కొంత కాలం బట్టి ఈ స్ఫింక్స్ వేధించుకు తింటోంది. ఈ స్ఫింక్స్ ఊరి పొలిమేరలో ఉన్న ఒక రాతి

తీనె మీద తిష్ఠ వేసి ఊళ్లోకి వెళ్ళే వాళ్లందరినీ పొడుపుకథ లాంటి ఒక కఠిన ప్రశ్న అడుగుతుంది. ఆ ప్రహేళికకి సరి అయిన సమాధానం చెప్పలేని వారిని చంపుకు తింటుంది. ఊరి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించే ఎడిపస్ ని స్ఫింక్స్ అడ్డుకుని అందరినీ అడిగే ప్రశ్ననే అడిగింది: “ఉదయం నాలుగు కాళ్ళ తోటీ, మధ్యాహ్నం రెండు కాళ్ళ తోటీ, సాయంత్రం మూడు కాళ్ళ తోటీ నడచేది ఏది?” అప్పటి వరకు ఈ ప్రహేళికకి సరి అయిన సమాధానం చెప్పిన వారు లేరు. ఎడిపస్ ఆలోచించి, తర్జనభర్జన పడి, చిట్టచివరికి, “మనిషి: బాల్యంలో నాలుగు కాళ్ళ మీద పాకుతాడు, నడివయస్సులో రెండు కాళ్ళ మీద నడుస్తాడు, ముసలితనంలో చేతికర్ర పట్టుకుని మూడు కాళ్ళతో నడుస్తాడు.” ఇలా గర్వభంగం చెందిన స్ఫింక్స్ జరిగిన పరాభవాన్ని తట్టుకోలేక తను కూర్చున్న ఎత్తుగా ఉన్న రాయి మీంచి కిందకి దూకి ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతుంది.

## 13.5 ఎడిపస్ థీబిస్ రాజ్యానికి రాజు అవడం

థీబిస్ రాజ్యానికి పీడ విరగడ అవడంతో, ప్రజల సంతోషానికి అవధులు లేవు. వారు ఎడిపస్ కి బ్రహ్మరథం పట్టేరు. వారి రాజు లెయుస్ బందిపోట్ల బల్లేలకి ఆహుతి అయిపోయాడని నమ్మి, ఇప్పుడు ఆ రాజు లేని లోటు తీరిందని సంతోషంతో ప్రజలు ఎడిపస్ కి పట్టం కట్టేరు. అప్పటి ఆచారం ప్రకారం భర్తని కోల్పోయిన లెయుస్ భార్య యొకాస్టా ఎడిపస్ కి పట్టమహిషి అయింది!! తను చంపినది తన తండ్రినే అనిన్నీ, తను వివాహం చేసుకున్నది తన తల్లినే అనిన్నీ ఎడిపస్ కి కాని అనుచరులకి కానీ ఊహామాత్రంగానైనా తెలియలేదు. విధి వైపరీత్యం!! ఎడిపస్-యొకాస్టా ల దాంపత్యానికి ఫలితంగా నలుగురు పిల్లలని కంటారు: ఎటేయోక్లిస్, పోలినీసిస్, ఏంటిగోనీ, ఇస్మేనీ (Eteocles, Polynices, Antigone, Ismene)

## 13.6 థీబిస్ నగరానికి మహామ్మారి ప్లేగు

కొన్ని ఏళ్ళు గడచిన తరువాత థీబిస్ నగరానికి మహామ్మారి ప్లేగు పట్టుకుంటుంది. ప్రజలని పీడిస్తున్న ఈ వ్యాధి పట్టు నుండి విముక్తి కలిగించడానికి తరుణోపాయం ఏదైనా ఉందేమో కనుక్కుని రమ్మని బావమరిది క్రియోన్ ని డెల్ఫి లో ఉన్న ఓరకిల్ దగ్గరకి సంప్రదింపులకి పంపుతాడు, ఎడిపస్. “థీబిస్

రాజైన లెయుస్ ని అన్యాయంగా చంపిన వ్యక్తి తాను చేసిన దుష్కృత్యానికి ప్రాయశ్చిత్తం పొందలేదు కనుక ప్రజలకి ఈ ఇక్కట్లు వస్తున్నాయి" అని ఓరకిల్ చెబుతాడు. ఈ వార్త విన్న తరువాత లెయుస్ ని అన్యాయంగా చంపిన వ్యక్తిని దండించి తీరుతానని ప్రతిన పడతాడు – ఆ వ్యక్తి తానేనన్న ఊహ లేశమాత్రమైనా లేని ఎడిపస్! లెయుస్ ని చంపిన వ్యక్తి ఎవ్వరో తెలుసుకోవడం ఎలా? ఎడిపస్ తన ఆస్థాన జ్యోతిష్కుడు టైరిసియాస్ ని సంప్రదిస్తాడు. పుట్టుగుడ్డి అయిన టైరిసియాస్ నేరస్తుడు ఎవ్వరో ఎడిపస్ వైపు వేలు పెట్టి చూపిస్తాడు. ఇదేదో బావమరిది క్రియోన్, జ్యోతిష్కుడు టైరిసియాస్ తో కలసి తనని పదవీభ్రష్టుడిని చెయ్యడానికి చేసిన కుట్ర అని వారిరువురి మీద నింద మోపుతాడు, ఎడిపస్.

## 13.6 పోలిబస్ మరణ వార్త

తొండ ముదిరి ఊసరవిల్లి అయినట్లు కథనం ఇలా మలుపు తిరిగే సరికి రాణి యొకాస్టా కి అసలు ఏమి జరిగిందో తేల్చుకోవాలనే దుగ్ధ పెరిగి ఎడిపస్ ని జరిగిన పాత సంఘటనలు అన్నిటిని కాలక్రమానుగతంగా చెప్పమని అడిగింది. ఎడిపస్ చెప్పిన ఉదంతంతో తనకి తెలిసిన వాటితో పోల్చి చూసుకునే సరికి ఆమె అనుమానాలు పెనుభూతాలై కూర్చున్నాయి. నిజం తేలాలంటే థీబిస్ రాజ్యపు సరిహద్దులలో, మూడు వీధుల మొగలో, ఎడిపస్ రథాన్ని ఎదుర్కొని యుద్ధం చేసిన వ్యక్తులు ఎవ్వరో నిర్ధారించాలి. ఆ యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసి, యుద్ధ రంగం నుండి ప్రాణాలతో పారిపోయిన వ్యక్తి ఒక భటుడు. ఆ భటుడి కోసం వేట మొదలయింది. ఈ వేట ముగిసే లోగా కోరింత్ రాజు, పోలిబస్, చనిపోయాడని ఒక వార్తావహుడు ఎడిపస్ కొలువు లోకి వార్త తీసుకువచ్చాడు. తన తండ్రి చనిపోయాడన్న విచారం ఒక పక్క, తన తండ్రి మరణానికి తను కారణం కాలేదన్న ఉపశమనం మరొక పక్క పోటీ పడుతున్నాయ్ ఎడిపస్ మనోఫలకంలో. తండ్రి అంత్య క్రియలు చెయ్యడానికి వెళితే తన తల్లిని చూడవలసి వస్తుంది. అప్పుడు ఓరకిల్ చెప్పిన జోశ్యంలో రెండవ భాగం నిజం ఆయే ప్రమాదం ఉంది. ఇలా ఆలోచించి ఎడిపస్ తన తండ్రి పార్థివ దేహాన్ని కడసారి చూడ్డానికి కూడా వెళ్ళనంటాడు. "మీకా భయం అక్కర లేదు. కోరింత్ రాజ్యపు రాజు పోలిబస్, రాణి మెరోపి కి పిల్లలు లేరు. నేనే అడవిలో దొరికిన ఒక పసిబాలుడిని వారికి కానుకగా ఇచ్చేను." అని వార్తావహుడు అశనిపాతం లాంటి వార్త చెబుతాడు.

## 13.7 వెల్లడి అయిన వాస్తవం

రాణి యొకాస్టా కి కావలసిన ఋజువు దొరికింది. తన కొడుకునే భర్తగా స్వీకరించిన అఘాయిత్యానికి నిష్కృతి కనిపించలేదు. ఆమె వెంటనే రాజప్రాసాదపు అంతర్భాగంలోకి వెళ్లిపోతుంది.

మూడు వీధుల మొగలో, ఎడిపస్ తో జరిగిన యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసి, యుద్ధ రంగం నుండి ప్రాణాలతో పారిపోయిన భటుడు చిట్టచివరికి దొరుకుతాడు. అతని సాక్ష్యంతో ఎడిపస్ కి జరిగిపోయిన కార్యక్రమం అంతా అర్థం అవుతుంది. పరుగుపరుగున యొకాస్టా కోసం అంతిపురంలోకి వెళతాడు. అక్కడ ఉరి పోసుకుని ప్రాణాలు విడిచిన రాణిని చూసి నిర్విణ్ణుడవుతాడు. నోట మాట రాదు. రాణి వస్త్రాలకి సూదితో గుచ్చి ఉన్న ఆభరణాన్ని తీసుకుని తన కళ్ళు రెండూ పొడిచేసుకుని గుడ్డివాడయిపోతాడు.

థీబిస్ సింహాసనాన్ని క్రియోన్ అధిష్టించి ఎడిపస్ ని రాజ్యం నుండి బహిష్కరిస్తాడు.

## 13.8 సిగ్మన్డ్ ఫ్రాయిడ్ వ్యాఖ్యానం

తెలుగు సినిమా కథలా ఉన్న ఈ కథని ఆధారంగా చేసుకుని ప్రాచీన కాలంలోనే గ్రీకు భాషలో సోఫోక్లిస్ "ఎడిపస్ రెక్స్" (Oedipus Rex or King Oedipus) అనే నాటకం రచించేడు. జెర్మనీ, ఫ్రాన్స్ దేశాలలో ఎంతో ప్రజాదరణ పొందిన ఈ నాటకాన్ని సా. శ. 1880 లలో మానసిక శాస్త్రవేత్త సిగ్మన్డ్ ఫ్రాయిడ్ (Sigmund Freud) చూసి ప్రభావితుడయ్యాడు. "మూడు నుండి ఏడు సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న పిల్లల మానసిక వికాసపు సమయంలో అడ పిల్లలు తండ్రిని, మగ పిల్లలు తల్లిని లైంగిక దృష్టితో చూసి వారిని తమ జీవిత భాగస్వాములుగా చేసుకోవాలని కోరుకుంటారు" అనే విప్లవాత్మకమైన వాదాన్ని ప్రవేశపెట్టేడు. "అమ్మే అందరిలోకీ అందమైనది, మంచిది, ఉన్నతమైనది అనే భావం కొడుకుకి ఉండడం సహజం. కాని పిన్న వయస్సులో ఆ భావం ప్రేమగా మారినప్పుడు కొడుకుకీ, తండ్రికి మధ్య ఒక రకం వైరభావం ఏర్పడుతుంది" అంటారు ఫ్రాయిడ్. అప్పుడు ఆ తండ్రి "ఈమె నాది, నువ్వు నీ ఈడుకి సరిపోయే జోడీని మరొకరిని చూసుకో" అనే పరిష్కార మార్గం చూపిస్తాడు. ఈ రకం మానసిక సంక్షోభానికే ఫ్రాయిడ్ "ఎడిపస్ కాంప్లెక్స్" అని పేరు పెట్టేడు. ఈ

రకం మానసిక సంక్షోభం మగ పిల్లలు తమ ఆడ “టీచర్ల” యెడల ప్రదర్శించడం మనం చూస్తూనే ఉంటాం. అమెరికాలో ఈ విషయాన్ని కథాంశంగా తీసుకుని Andy Griffith Show అనే TV కార్యక్రమంలో ఒక మనోహరమైన సన్నివేశం చూపేరు: (https://www.youtube.com/watch?v=r_lilQSdJDY)

ఇదే రకం మానసిక సంక్షోభం ఆడపిల్లలు తమ తండ్రి యెడల, మగ గురువుల యెడల కూడ చూపిస్తూ ఉంటారు అంటారు ఫ్రాయిడ్. అప్పుడు దానిని “ఎలక్ట్రా కాంప్లెక్స్” (Electra Complex) అంటారు.

(**Oedipus complex**, is a term used by Sigmund Freud in his theory of psychosexual stages of development to describe a child's feelings of desire for his or her opposite-sex parent and jealousy and anger toward his or her same-sex parent. The **Electra complex** is a psychoanalytic term used to describe a girl's sense of competition with her mother for the affections of her father. It is comparable to the male Oedipus **complex**.)

# 14. ప్రోమీథియస్ – మానవుల శ్రేయోభిలాషి



బొమ్మ. ప్రోమీథియస్ అగ్నిని మానవులకి బహుమానంగా ఇవ్వడం (వికీపీడియా)

ప్రోమీథియస్ (Prometheus) కథ ఈ ఆధునిక సాంకేతిక యుగానికి చాల పొంతన కల కథ. ఎందుకంటే మానవుల హితవు కోరి ప్రోమీథియస్ దేవలోకం నుండి అగ్నిని దొంగిలించి మానవులకి బహుమానంగా ఇచ్చేడు. నిప్పు లేకుండా ఉండి ఉంటే మనం ఇంకా అడవుల్లో చెట్ల మీద మన ముత్తాతలతో మనుగడ సాగిస్తూ ఉండేవాళ్ళం కదా! సాంకేతిక ప్రగతికి నిప్పుని మచ్చిక చేసుకోవడం మొదటి మెట్టు అని మన అందరికి తెలిసిన విషయమే!

ప్రొమీథియస్ (అనగా "ముందుచూపు" అని అర్థం) టైటనుల ప్రవరలో పుట్టిన వ్యక్తి. టైటను అయినప్పటికీ టైటనులకి ఒలింపియనులకి మధ్య జరిగిన మొదటి మహా సంగ్రామంలో ప్రొమీథియస్ ఒలింపియనుల పక్షం కాసి దేవతల రాజైన జూస్ గెలుపుకి సహాయపడ్డాడు. ఈ యుద్ధం లోనే జూస్ తన తండ్రి క్రోనస్ ని చంపి ఒలింపియనులకి అధిపతి అయేడు. అంతే కాదు. ఎథీనా జూస్ శిరస్సు చీల్చుకుని బయటకి వచ్చినప్పుడు ప్రొమిథీమియస్ దగ్గర ఉండి ఆ కార్యక్రమం సజావుగా జరగడానికి తోడ్పడ్డాడు. కనుక ప్రొమీథియస్ అంటే జూస్ కి అభిమానం ఉండాలి. మొదట్లో వీరిరువురి మధ్య సత్సంబంధాలే ఉండేవి. కానీ క్రమేపి మానవ సంతతి భూమి మీద పెరిగి వర్ధిల్లడం మొదలయే వేళకి ప్రొమీథియస్ మానవ పక్షపాతం చూపించి వారికీ సాంకేతిక విద్యలు నేర్పడం, వారికి అగ్నిని ఇవ్వడం వంటి ప్రాపక చర్యలు జూస్ కి నచ్చ లేదు. స్వతహాగా జూస్ కి మనుష్యులు బలవంతులు అవడం అంటే ఇష్టం ఉండేది కాదు. ఈ కారణాల వల్ల ప్రొమీథియస్ కి తరచు జూస్ తో భేదాభిప్రాయాలు వచ్చి ఘర్షణ పడుతూ ఉండేవాడు.

ఇలా అంతర్గతంగా రగులుతూన్న కోపం ఒక్క సారి పెల్లుబికి పైకి రావడానికి కారణం ప్రొమీథియస్ చేసిన ఒక కొంటె పని. దేవతలు చేసిన ఒక యజ్ఞంలో ఒక మహిషాన్ని బలి ఇస్తారు. ఆ యజ్ఞఫలంగా ఆ ఎనుబోతు దుమ్ములని ఒక పెద్ద పళ్ళెంలో అమర్చి, వాటి మీద ఒక పొర కొవ్వుని పరచి, వాటి మీద పువ్వుల వంటి అలంకారాలు జతపరచేడు, ప్రొమీథియస్. వేరొక చిన్న పళ్ళెంలో ఆ ఎనుబోతు మాంసాన్ని వెగటు పుట్టించే పేగులతో కప్పి, రెండు పళ్ళేలని జూస్ ముందు ఉంచి ప్రథమ ప్రసాద బక్షకుడిగా ఒక పళ్ళెం ఎంచుకోమంటాడు, ప్రొమీథియస్. పైకి అందంగా కనిపిస్తూన్న పెద్ద పళ్ళేన్ని జూస్ ఎంచుకుంటాడు. ప్రొమీథియస్ రెండవ పళ్ళేన్ని పట్టుకెళ్లి ఆకలితో అలమటిస్తున్న మానవులకి ఇచ్చేస్తాడు. తనని మోసం చేసి తనకి బొమికలు ఉన్న పళ్లెం అంటగట్టడం మొదటి తప్పు. తనకి ఇష్టం లేని మానవులకి మంచి మాంసం ఉన్న పళ్లెం ఇవ్వడం రెండవ తప్పు. ఇలా రెండు విధాలుగా జూస్ అహం దెబ్బతింది కాబట్టి జూస్ ప్రొమీథియస్ మీద కక్ష కట్టేడు.

ఒకనాడు, ఒక సందర్భంలో జూస్ దేవతలందరికీ బహుమానాలు పంచిపెట్టేడు కానీ మానవులని పూర్తిగా విస్మరించేడు. అది ప్రొమీథియస్ కి నచ్చ లేదు. అందుకని రహస్యంగా ఒలింపస్ పర్వతం

ఎక్కి, అక్కడ హెఫయెస్టస్ కర్మాగారంలో ఉన్న కొలిమిలో ఉన్న నిప్పుని దొంగిలించి, పట్టుకొచ్చి మానవులకి బహుమానంగా ఇచ్చేడు. ఈ విషయం అసలే కోపంగా ఉన్న జూస్ కి తెలిసింది. రాజుగారు తలుచుకుంటే కోరడా దెబ్బలకి కొదువా? కాకసస్ పర్వతాలలో ఒక రాతికి ప్రొమీథియస్ ని గొలుసులతో కట్టి అతనిని కాలం అంతరించే వరకు చిత్రవధ చెయ్యమని ఆజ్ఞాపించేడు, జూస్. ఎలా? ప్రొమీథియస్ కి చావు ఒకే సారి రాకుండా, పగటి పూట ఒక డేగ వచ్చి, అతని కాలేయాన్ని నెమ్మది నెమ్మదిగా పొడుచుకుని తింటూ ఉండాలి. ఆ కాలేయం రాత్రి పూట తిరిగి పుంజుకుని పెరుగుతూ ఉంటుంది. ఇలా ప్రతి రోజు సూర్య, చంద్ర, నక్షత్రాదులు ఉన్నంత కాలం బాధ అనుభవిస్తూ ఉండమని ఆజ్ఞాపించేడు (శపించాడు), జూస్.

మానవకోటి మనుగడకి, పురోభివృద్ధికి ముఖ్యంగా కావలసిన నిప్పుని దేవతల దగ్గర నుండి దొంగిలించి మానవులకి ఇచ్చినందుకు ప్రొమీథియస్ ఇలా యమయాతన అనుభవించేడు. తన శరీరాన్ని డేగ పొడుచుకుని తింటూ ఉంటే ఆ బాధకి అతను పెట్టే పెను బొబ్బలు గ్రీసులో ఉన్న ఒలింపస్ పర్వతం వరకు వినిపించేవిట. ఆ బొబ్బలు విని జూస్ ఆనందపడేవాడట. మరెవరైనా తనని ధిక్కరించి ప్రవర్తిస్తే వాళ్ళ గతి కూడా ఇలాగే ఉంటుందని హెచ్చరించేవాడుట.

మహా బలశాలి హెర్క్యులిస్ ఆ డేగని చంపి, ప్రొమీథియస్ కి విముక్తి కలిగించి ఉండకపోతే ఇప్పటికీ ఆ కాకసస్ పర్వతాలలో ప్రొమీథియస్ పెట్టే పెడ బొబ్బలు మనకి వినిపిస్తూ ఉండేవి!

ఎస్కిలస్ (Aeschylus, సా. శ. పూ. 523 – 456) అనే విషాదాంత నాటకకర్త రాసిన విషాదాంత నాటకం “బందీ అయిన ప్రొమీథియస్” (Prometheus Bound), ప్రొమీథియస్ కథని చెబుతుంది.

# 15. ప్రథమ స్త్రీ పెండోరా కథ



బొమ్మ. పెండోరా (John William Waterhouse) పెట్టె తెరచి చూడడం (వికీపీడియా)

క్రైస్తవ పురాణగాథల ప్రకారం "ఈవ్" (Eve) మొట్టమొదటి స్త్రీ అయితే గ్రీసు సంప్రదాయంలో "పెండోరా" (Pandora) కి ఆ గౌరవం దక్కింది. హేసియాడ్ రాసిన థియోగొనీ అనే గ్రంథంలో

మొట్టమొదట ఈ  పెండోరా దర్శనం ఇస్తుంది. ఈ కావ్యం ప్రకారం పెండోరా ప్రస్తావన టైటనులకి ఒలింపియనులకి మధ్య జరిగిన మొదటి మహా సంగ్రామం తరువాత కనిపిస్తుంది. తమాషా ఏమిటంటే మనందరికీ చిరపరిచితమైన “పెండోరా పేటిక” (Pandora’s Box) అనే పదబంధం 16 వ శతాబ్దంలో థియోగొనీ ని అనువదించిన ఇరేస్మస్ (Erasmus) ప్రవేశపెట్టే వరకు వాడుకలోకి రానేలేదు.

గ్రీసు దేవుళ్ళంతా సమావేశం అయిన ఒక సందర్భంలో ఈ కథ మొదలవుతుంది. ఆ సమావేశానికి టైటనులు, ఒలింపియనులు హాజరవుతారు. ధర్మరాజులవారు రాజసూయ యాగం చేసినప్పుడు ప్రథమ తాంబూలం అందుకోడానికి ఎవ్వరు అర్హులు అని తర్జనభర్జనలు పడ్డట్లే ఈ  దేవుళ్ళంతా  వారు చేస్తున్న ”యాగం” లో ఒక ఎనుబోతుని బలి ఇచ్చిన తరువాత ప్రథమ ప్రసాద భక్షణకి ఎవ్వరు అర్హులు అని తర్జనభర్జనలు పడతారు. అప్పుడు ప్రొమీథియస్ (Prometheus) – ఇతనే దేవగణాల నుండి అగ్నిని దొంగిలించి మానవులకి ఇచ్చినవాడు  – యుక్తియుక్తంగా ప్రసాదాన్ని రెండు అసమాన భాగాలుగా చేసి, ఏదో ఒక భాగం ఎంచుకుని ప్రప్రథమంగా స్వీకరించమని దేవతల రాజైన జూస్ ముందు ఉంచేడు. జూస్ స్వర్గలోకానికి అధిపతి, దేవతల రాజే కాకుండా మోతాదుకి మించిన “అహం” కలవాడు కనుక సహజంగా సింహ భాగం తీసుకున్నాడు. నిజానికి ఆ పెద్ద భాగం పైపైకి  చూడ్డానికి పెద్దగా, అందంగా అలంకరించబడి ఉన్నా అడుగున అంతా బొమికలవంటి “శాకాంబరీదేవీ ప్రసాదాలే!! “అసలు వంటకాలు” అన్నీ చిన్న భాగం లోనే  ఉన్నాయి.

జూస్ కి ఒళ్ళు మండిందంటే మండదూ మరి? రాజుగారు తలుచుకుంటే కొరడా దెబ్బలకి కొదువా? దేవతల కళలకి కంసాలి అయిన హెఫియేస్టస్ ని పిలిపించి ఒక అత్యద్భుతమైన అందగత్తెని సృష్టించమని జూస్ ఆదేశించాడు. దేవతలైనా  సరే, మానవులైనా సరే ఆమె అందానికి దాసులు అయి పోవాలని కోరేడు, జూస్. ఈ పని చెయ్యడానికి ఏఫ్రోడీటీ నమూనాగా నిలబడడానికి  ఒప్పుకుంది.

హెఫయెస్టస్ మట్టిని, నీటిని కలిపి జీవకళ ఉట్టిపడేలా ఒక ప్రతిమని తయారు చేసి, నాలుగు దిక్కుల నుండి వాయువులని సమీకరించి ఆ ప్రతిమకి  ప్రాణం పోస్తాడు. అప్పుడు ఒలింపియను దేవతలంతా

అప్పుడే ప్రాణం పోసుకున్న ఆ బొమ్మకి తలొక బహుమానం ఇస్తారు. ఏఫ్రోడీటీ ఆమెకి అసమానమైన అందాన్ని, ఆకర్షణని ఇస్తుంది. కలహభోజనుడు, వార్తావాహకుడు అయిన హెర్మీస్ కపటత్వం, టక్కులు, తంత్రజ్ఞానం, జిత్తులు, ఆమెకి ఆభరణాలుగా ఇస్తాడు. ఎథీనా ఆమెకి అందమైన దుస్తులు ఇచ్చి హస్తలాఘవత్వం నేర్పుతుంది. నీళ్ళల్లో మునిగిపోకుండా రక్షణకని పొసైడన్ ఒక ముత్యాల హారాన్ని ఇస్తాడు. తంబురా మీటుతూ పాట పాడడం అపాలో నేర్పుతాడు. జూస్ ఆమెకి తుంటరితనం, పెంకితనం, అల్లరి చేసే స్వభావం వరాలుగా ఇస్తాడు. చిట్టచివరికి హేరా కుతూహలం అనే లక్షణాన్ని వరంగా ఇస్తుంది.

ఈ విధంగా మొట్టమొదటి మానవ స్త్రీ స్వర్గంలోని హెఫయెస్టస్ కార్ఖానాలో మలచబడుతుంది. ఆమె దివి నుండి భువికి దిగి రాగానే ఆమెకి పెండోరా – అనగా ప్రసాదం అని అర్థం – అని పేరు పెట్టి ఆమె చేతికి నగిషీలు చెక్కిన అందమైన పెట్టెని బహుకరిస్తాడు, హెర్మీస్: "ఈ పేటికని జూస్ నీకు ప్రత్యేక బహుమానంగా పంపేడు. ఎటువంటి పరిస్థితులలోను ఈ పెట్టె మూతని మాత్రం తెరవకూడదు సుమా!" అని మరీమరీ హెచ్చరించి ప్రొమీథియస్ సవతి అన్నదమ్ముడైన ఎపిథీమియస్ కి పెండోరాని బహుమానంగా ఇచ్చి హెర్మీస్ వెళ్ళిపోతాడు.

జూస్ టక్కరి బుద్ధులు బాగా ఎరిగిన ప్రొమీథియస్ జూస్ ఎటువంటి బహుమానం పంపినా అంగీకరించకుండా తిప్పికొట్టమని ముందుగానే తన సవతి అన్నదమ్ముడైన ఎపిథీమియస్ ని హెచ్చరించేడు. కానీ ఏమి లాభం? పెండోరా అందచందాలు, ఆకర్షణ చూసి, ముగ్ధుడై మరొక భావం మనస్సులో చోటు చేసుకునే లోపున ఎపిథీమియస్ ఆమెని పెండ్లి చేసేసుకున్నాడు.

ఎపిథీమియస్–పెండోరా ల వైవాహిక జీవితం సజావుగా సాగిపోతూ రోజులు నిమిషాలలా దొర్లిపోతున్నాయి కానీ పెండోరా అంతరాంతరాలలో ఒక కుతూహలం కుమ్మరి పురుగులా దొలిచేస్తోంది. జూస్ బహుమానంగా పంపిన పెట్టెలో ఏముంది? బంగారు నగలా? నాణేలా? పట్టు బట్టలా? చూడడానికి పెట్టె ఎంతో విలువైనదిగా కనిపిస్తోంది. లోపల ఇంకా విలువైనది ఏదో ఉండి ఉంటుంది. ఎన్ని సార్లో ఆ పెట్టె తెరవడానికి వెళ్ళడం, మూత చేత్తో పట్టుకోవడం, వెనకాడడం. పెట్టె

ఎన్నడూ తెరవద్దని హెర్మీస్ పదేపదే హెచ్చరించేడు. తెరవకూడని పెట్టెని బహుమానంగా ఇవ్వడంలో అంతరార్థం? కానీ హేరా ఇచ్చిన కుతూహలం అనే వరం హెర్మీస్ హెచ్చరిక కంటే బలవత్తరమైనది. లోపల ఏముందో  తెలుసుకోవాలన్న కుతూహలం చివరికి నెగ్గింది. చుట్టుపక్కల ఎవ్వరూ లేని సమయంలో పెండోరా పెట్టెని సమీపించింది. ఇటు, అటు ఎవ్వరూ చూడడం లేదని రూఢి పరచుకుని, పెట్టె మూతని లేశమాత్రం, ఒక్క క్షణం పాటు,  తెరచింది. అంతే! పెట్టేలోంచి బుస్సుమని శబ్దం వచ్చింది. ఆ శబ్దంతోపాటు ముక్కుపుటాలు అదిరిపోయేటంత దుర్వాసనతో ఆ గది అంతా నిండిపోయింది. పెండోరా పెట్టె మూతని గభీమని మూసేసింది. కానీ అప్పటికే జరగవలసిన హాని జరిగిపోయింది. ఇహ ఏమి చేసినా అది గతజలసేతుబంధనమే!


జూస్  ఆ పెట్టెలో దాచిపెట్టినవి ఏమిటిట? మానవలోకానికి కీడు కలుగజేసేవి:  అరిషడ్వర్గాలు అయిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలతోపాటు కొంటెతనం, కుత్సితపు నడవడి,  దుర్మార్గం, ద్రోహభావం, ద్వేషం, ఘర్షణ, జుగుప్స, ఈర్ష్య, కరువు, కాటకం, అనారోగ్యం, వగైరాలు  ఆ పెట్టెలో ఉన్నవి. కానీ అంతా చెడు కాదు; ఉద్దేశపూర్వకంగానో, కాకతాళీయంగానో ఆశావహం అయిన నమ్మకాన్ని కూడా జూస్ ఆ పెట్టెలో పెట్టేడు. జూస్ భార్య హేరా కుతూహలం అనే వరాన్ని అప్పటికే ఇచ్చి ఉంది కదా. ఆశావహం అయిన నమ్మకాన్ని కుతూహలంతో జోడించేసరికి అది మానవజాతికి ఎనలేని విలువ గల వరంగా పరిణమించింది. రేపు నేటి కంటే మెరుగ్గా ఉంటుందన్న నమ్మకమే మానవుడి ప్రగతికి ప్రథమ సోపానం. దానికి కుతూహలం జోడించేసరికి అది సత్యాన్వేషణకి మూలస్తంభం అయింది.

ఈ కథలో ప్రముఖంగా  కనిపించే  అంశం ఏమిటంటే గ్రీసు దేవతలు  మానవుల వలెనే  కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకి అతీతులు కాకపోవడమే కాకుండా కుత్సిత బుద్ధితో  మానవుల జీవితాలలో కలుగజేసుకుని వాటితో చెలగాటాలు ఆడడం. ప్రొమీథియస్ మీద పగతో జూస్ చేసిన పని ఇది. ఈ కథ చదివిన తరువాత పెండోరా ద్వారా ఆ పగ ఎలా తీరిందో అర్థం కాదు. తర్కబద్ధంగా లేని ఈ పెండోరా కథ అంతా కల్పితం!

ఈ కథని ఆధారంగా చేసుకుని రకరకాల వ్యక్తులు అనేక వ్యాఖ్యానాలు చేసేరు. పెండోరా ఆ పెట్టె తెరవకపోతే ఈ ప్రపంచం అంతా, సుభిక్షంగా, శాంతియుతంగా, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగుతూ ఉండేదేమో అన్న భావం ఈ కథలో అంతర్లీనంగా కనిపించింది కొందరికి. కానీ పెండోరా పెట్టె తెరచింది. కనుక ఈ నాడు మనం ఈ ప్రపంచంలో ఎదుర్కుంటున్న ఈతి బాధలన్నిటికి పెండోరాయే కారణం అని వీరి వాదం. ఈ కోణంలో ఆలోచించి మన పూర్వులది పురుషాధిక్య భావంతో స్త్రీలని ద్వేషించే సమాజం అని తీర్మానించడం తొందరపాటే అవుతుంది.

ఈ కథలో పనికొచ్చే నీతి ఏదైనా ఉందా అంటే ఉంది. పెట్టెలో ఏముందో చూద్దామనే కుతూహలం, ఆ ఉన్నదేదో మనకి ఏదో ఒక విధంగా పనికొస్తుందేమో అనే ఆశాజనక దృక్పథం లేకపోతే ఆధునిక విజ్ఞానశాస్త్రం ఇంతగా పురోభివృద్ధి చెందేది కాదు. ప్రయోగం చేసి చూడాలి. చేసిన ప్రయోగం విజయవంతం అవాలని లేదు. పెట్టె తెరచి చూడాలి. పర్యవసానాన్ని ఎదుర్కోవాలి. ఈ కోణంలో చూస్తే పెండోరా మన మొట్టమొదటి “సైంటిస్టు!”

# 16. కేసియోపియా  కథ




బొమ్మ. ఇంగ్లీషు అక్షరం W ఆకారంలో ఉన్న కేసియోపియా నక్షత్ర మండలం (వికీపీడియా)

పూర్వం ఎథియోపియా (నేటి ఇథియోపియా) ని సెఫియస్ (Cepheus) అనే రాజు పాలించేవాడు. అతని రాణి కేసియోపియా (Cassiopeia) తనంత అందగత్తె ఈ భూలోకంలోనే కాదు, స్వర్గలోకంలో కూడా లేదని విర్రవీగుతూ ఉండేది. ఒకనాడు సముద్రపుటొడ్డున కెరటాలతో జలకాలాడుతున్న ఒక జలకన్య (nymph) ని చూసి , “అందంలో ఈమె నా కాలి గోటికి కూడా సరిరాదు” అంటూ ఈసడించుకుంది. ఈ  మాటలు సముద్రాలకి అధిదేవత అయిన పొసైడన్ చెవిని పడ్డాయి.  అయన ఉగ్రుడై సీటస్ (Cetus) అనే ఒక జలరక్కసిని సృష్టించి ఇథియోపియా మీదకి వదిలేడు. తిమింగిలాన్ని పోలిన ఆ రాక్షసి ఆ రాజ్యాన్ని అల్లకల్లోలం చేసింది. ప్రజలు భయంతో తమ రాజు దగ్గర మొర పెట్టుకున్నారు.

కర్తవ్యం బోధపడక రాజు ఓరకిల్ ని సంప్రదించేడు. పొసైడన్ కోపం చల్లారాలంటే రాజు తన అందాల కూతురైన ఆంద్రోమెడా (Andromeda)ని ఆ జలరక్కసికి బలి ఇవ్వాలసిందే అని ఓరకిల్ చెబుతుంది. తన కూతురుని ఇలా బలి ఇవ్వడం రాజుకి ఇష్టం లేకపోయినా మరొక మార్గం కనిపించక రాజు తన కూతురుని సీటస్ కి ఆహారంగా ఒక బండరాతికి గొలుసులతో కట్టేసి సముద్రపు ఒడ్డున వదిలేసేడు.

ఇది ఇలా ఉండగా మెడ్యూసా (Medusa) ని చంపి ఆమె తలకాయని ఎథీనా (Athena)కి అప్పగించే పని మీద పెర్సియస్ (Perseus) అనే వీరుడు బయలుదేరేడు. (ఈ పెర్సియస్ తండ్రి జూస్, తల్లి ఒక మానవ వనిత.) మెడ్యూసా కూడా కేసియోపియా చేసిన తప్పులాంటి తప్పే చేసి శాపగ్రస్తురాలయింది. “నా బంగారు జుత్తు కూడా ఎథీనా జుత్తులా అందంగా మెరుస్తూ ఉంటుంది” అని మెడ్యూసా అన్నదని ఎథీనాకి కోపం వచ్చి మెడ్యూసాని ఒక అసహ్యాకరమైన శాల్తీగా మార్చేసింది. ఈ శాల్తీ జుత్తులో వెంట్రుకలకి బదులు పాములు ఉంటాయి. ఈ శాల్తీని ఎవరు చూస్తే వారు రాయిగా మారిపోతారు. మెడ్యూసా ఉంటున్న గుహ చుట్టూ శిలలుగా మారిపోయిన వీరుల విగ్రహాలెన్నో పడి ఉన్నాయి!

మెడ్యూసా తల నరకడానికి బయలుదేరిన పెర్సియస్ కి కూడా అదే గతి పట్టి ఉండేదే కానీ అతనికి దైవ సహాయం లభించింది: రెక్కలు ఉన్న పాదరక్షలని హెర్మీస్ ఇచ్చేడు. ఎవరి తల మీద పెట్టుకుంటే వారు అదృశ్యం అయిపోయే మహిమ కల కిరీటాన్ని హేడీస్ ఇచ్చేడు. ఎథీనా అద్దం లాంటి కవచాన్ని ఇచ్చింది. ఆ అద్దం లాంటి కవచంలో ప్రతిబింబాన్ని చూస్తూ, హెఫయెస్టస్ ఇచ్చిన కత్తితో ఒకే ఒక వేటులో నిద్రపోతున్న మెడ్యూసా తల నరికేడు పెర్సియస్. వెంటనే ఆ శరీరం నుండి పెగసస్ (Pegasus) అనే రెక్కల గుర్రం బయటకి వచ్చింది. అలా తెగటార్చిన మెడ్యూసా తల పట్టుకుని పెర్సియస్ సముద్రం మీదుగా వెళుతూ దారిలో ఇథియోపియా సముద్రతీరంలో గొలుసులతో రాయికి కట్టేసి పడి ఉన్న ఆంద్రోమెడాని చూసేడు. ఆమె ఉదంతం ఆమె చెప్పగా విన్నాడు. ఇంతలోనే సీటస్ రాక్షసి ఆకలితో ఈదుకుంటూ వచ్చింది. పెర్సియస్ తన ఖడ్గంతో ఆ జలరాక్షసిని చంపేసి ఆంద్రోమెడాని విడుదల చేసేడు. తెలుగు సినిమా కథలోలా కథ ఇక్కడ చిన్న మళుపు తిరుగుతుంది.

ఆంఢ్రోమెడా తండ్రి తన కూతురుని ఫినియస్ కి ఇచ్చి పెళ్లి చేస్తానని గతంలో వాగ్దానం చేస్తాడు. అప్పుడు పెర్సియస్ మెడ్యూసా తలని ఉపయోగించి ఫినియస్ ని శిలగా మార్చి వేస్తాడు. తరువాత ఆంఢ్రోమెడాని పెళ్లి చేసుకుని, మెడ్యూసా తలని ఎథీనాకి ఇచ్చేసేడు.

ఈ కథలోని ప్రధాన పాత్రలన్నీ నక్షత్రాలుగా మారి ఆకాశంలో ప్రకాశిస్తున్నాయి. కేసియోపియాని ఆకాశంలో గుర్తించడం చాల సులభం. ఉత్తరకాశంలో, సప్తర్షి మండలానికి ఎదురుగా, ధ్రువ నక్షత్రం నుండి సమాన దూరంలో, కాసింత సొట్టగా ఉన్న ఇంగ్లీషు అక్షరం W ఆకారంలో ప్రకాశవంతమైన అయిదు చుక్కలతో ఏర్పడ్డ రాశియే కేసియోపియా.

కేసియోపియా అని గ్రీసు దేశస్తులు పిలిచిన నక్షత్ర మండలాన్ని వివిధ సంస్కృతులలో ప్రజలు వివిధమైన పేర్లతో పిలిచేరు. ఈ గుంపులో ఉన్న నక్షత్రాల గురించి అరబ్బులకి తెలుసు, చైనీయులకి తెలుసు, వేదకాలపు భారతీయులకి తెలుసు. వారివారి పురాణ గాధలలో ఇటువంటి కథలు వారికీ ఉన్నాయి. కనుక గ్రీసు పురాణాలలో ఉన్న కథలు అన్నీ గ్రీసు కథకుల స్వకపోలకల్పితాలు కాకపోవచ్చు.


వేదకాలపు భారతీయులు కేసియోపియా నక్షత్ర మండలాన్ని "అప్సరసలు" అనిన్నీ, "కాశ్యపీయులు" అనిన్ని అన్నారు. దీనికి ఆధారం ఏమిటి? కశ్యప ప్రజాపతికి ప్రధాదేవి వలన అప్సరసలు పుట్టేరని సంస్కృత భారతం, ఆదిపర్వం (35, 50, 51) చెబుతోంది. కశ్యప ప్రజాపతికి సురభి వల్ల మేనకాది ఆప్సరసలు పుట్టేరని కూడా చెబుతోంది. కనుక కేసియోపియా అనే మాట కశ్యప పదోద్భవమేమో అని మహీధర నళినీమోహన్ అభిప్రాయపడ్డారు. కేసియోపియా నక్షత్ర మండలాన్ని రాక్షస రాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ పేరుతో పిలుస్తారనిన్నీ, ఆంఢ్రోమెడాని రాక్షస గురువు శుక్రాచార్యుల కూతురు అయిన దేవయాని పేరుతో పిలుస్తారనిన్నీ మరొక అభిప్రాయం ఉంది.

ఇంతటితో అవలేదు. ఆకాశంలో కేసియోపియా నక్షత్ర మండలానికి పశ్చిమముగాను ఉత్తరంగాను సెఫియస్ (Cepheus) మండలము; దక్షిణంగాను, పశ్చిమముగాను ఆంఢ్రోమెడా (Andromeda)

మండలము, నైరుతి దిశలో పెర్సియస్ (Perseus) మండలము కనిపిస్తాయి. ఇవన్నీ పాశ్చాత్యులు ఈ నక్షత్ర మండలాలకు పెట్టిన పేర్లు. అరబ్బులు పెట్టుకున్న పేర్లు వేరు, భారతీయులు పెట్టుకున్న పేర్లు వేరు. వారి వారి కథలు వేర్వేరు. జోసెఫ్ కేంప్^బెల్ అభిప్రాయం పడ్డట్లు పురాణకథలన్నిటికి మూలం ఒక్కటేనేమో!

పెర్సియస్ మండలములో పెర్సియస్ వీపు మీద నక్షత్రాల వరస వంపు తిరిగినట్లు ఉంటుంది. అందుకని వాటిని "పెర్సియస్ చాపం" అంటారు. అతడి నడుము పటకా నుండి వేళ్ళాడుతూ మెడ్యూసా శిరస్సు కనిపిస్తుంది. ఆ శిరస్సు నుదిటి మీద ఒక విచిత్రమైన నక్షత్రం కనిపిస్తుంది. దాని కాంతి పెరుగుతూ, తరుగుతూ కనిపిస్తుంది. అందుకని దానిని అరబ్బులు "ఆల్గాల్" (Algol) అని పిలిచేవారు. అరబ్బీలో "ఆల్ గాల్" అంటే దయ్యపు నక్షత్రం. దరిమిలా ఈ వింత ప్రవర్తనకి కారణం తెలిసింది. ఇది ఒక జంట నక్షత్రం అవడం, అందులో ఒకటి నల్లటి నక్షత్రం అవడం. ఈ రెండూ అమ్మాయిలు ఒప్పులగుప్ప ఆడినట్లు ఒకదాని చుట్టూ మరొకటి తిరుగుతూ ఉంటాయనిన్నీ, మన దృక్పథంలో నల్లటి తార అడ్డు వచ్చినప్పుడల్లా వాటి కాంతి తగ్గుతుందనిన్నీ 1782 లో హాలండ్ దేశపు (చెవిటి, మూగ అయిన) 18 ఏళ్ల గుడ్రిక్ అనే కుర్రాడు కనిపెట్టేడు!

ఇప్పుడు హిందూ పురాణగాథలలో ఆంద్రోమెడా కథ ఎలా ఉందో చూద్దాం. "ఆల్గాల్" నక్షత్రాన్ని హిందువులు "పులోమ" రాక్షసుడు అన్నారు. భృగు మహర్షి (Perseus) భార్య పేరు పులోమ. ఆమె నిండు చూలాలు. భృగుడు స్నానం చెయ్యడానికి నదికి వెళ్లిన తరుణంలో పులోముడు అనే వింత రాక్షసుడు ఇంట ప్రవేశించి, "నేను పులోముడను. నువ్వు పులోమవు. నువ్వు నా భార్యవి" అని పులోమని అపహరించేడు. ఆమె గర్భస్థ శిశువు తల్లి కన్నీరు చూడలేక గర్భచ్యుతుడు అవుతాడు. అతడే చ్యవనుడు (Triangulum).




బొమ్మ. పెర్సియస్ నక్షత్ర మండలం (వికీపీడియా)

చ్యవనుడు బహుకాలం తపస్సు చేయగా అతని శరీరం పుట్టలు పట్టిపోయింది. కళ్ళు మాత్రం మిణుగురు పురుగుల్లా మెరవసాగేయి. అప్పుడు శర్యాతి అనే రాజు కూతురు సుకన్య ఆ ప్రాంతంలో ఆటలాడుతూ, మిణుగురు పురుగులని భ్రమ పడి పుల్లతో చ్యవనుని కళ్ళు పొడిచింది. ఆ కళ్ళ నుండి వచ్చిన రక్తాన్ని చూసి సుకన్య భయపడింది. తెలియక చేసిన తప్పు కనుక క్షమించమని శర్యాతి వేడుకున్నాడు. సుకన్యని తనకిచ్చి పెళ్లి చేస్తే క్షమిస్తానని చ్యవనుడు అన్నాడు. సుకన్య ఒప్పుకుంది. అశ్వినులు చ్యవనునికి కళ్ళని వరంగా ప్రసాదించేరు. అంతవరకు హవిర్భాగాలకి (యజ్ఞఫలాలకి) నోచుకోని అశ్వినులకి చ్యవనుడు హవిర్భాగాలని ప్రసాదించేడు. అందుకు కోపించి చ్యవనుని మీదకి ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించేడు. చ్యవనుడు అగ్నిహోత్రుడు నుండి మద అనే రాక్షసుడిని పుట్టించి ఇంద్రుడి మీదకి వదిలేడు. ఇంద్రుడి మదం అణిగింది. అశ్వినులకి హవిర్భాగం ఇవ్వడానికి అంగీకరించేడు. ఇంద్రుని మదము అణచి వేయడానికి కారణభూతురాలైన చ్యవనుని తల్లిని (అనగా భృగుపత్నిని) ఇంద్రమద అన్నారు. అదే పాశ్చాత్యుల ఆంద్రోమెడా అని మహీధర నళినీమోహన్ వ్యాఖ్యానించేరు.

పులోమ రాక్షసుడు చావు తప్పి కన్ను లొట్టపోయి చ్యవన నక్షత్ర రాశికి ఎదురుగా పులుకు పులుకూ గుడ్లు మిటకరిస్తూ భృగుపరశు గుంపులో రెండవ చుక్కగా (Beta Perseus) మనకి కనబడుతున్నాడు. దీనినే Algol, the blinking demon అంటారు.

ఆధారం:

మహీధర నళినీమోహన్, నక్షత్ర వీధులలో భారతీయుల పాత్ర, 2-2-185/56/10 సోమసుందర్ నగర్, హైద్రాబాదు - 500 013

# 17. రాజుగారివి గాడిద చెవులు




బొమ్మ. మైదస్  కూతురిని తాకడం (వికీపీడియా)

నేను చిన్నప్పుడు పత్రికలలో (చందమామ, బాల, బాలమిత్ర) చదివిన కథలన్నిటిలోను నాకు స్పష్టంగా జ్ఞాపకం ఉన్న కథలలో "రాజుగారివి గాడిద చెవులు" కథ  అంటే అది అతిశయోక్తి  అవదు. ఇది గ్రీకు పురాణకథలలో ఒకటన్న విషయం నాకు ఈనాడే తెలిసింది!

## 17.1 పట్టినదల్లా బంగారం

గ్రీకు పురాణకథలలో పేరెన్నికగన్న కథ ఫ్రిగియా (Phrygia) అనే రాజ్యానికి రాజు అయిన మైదస్ (Midas) కథ. గ్రీకు పురాణకథా చక్రాలలో మైదస్ గురించి రెండు విభిన్నమైన కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఓవిడ్ (Ovid) రాసిన మెటమార్ఫసిస్ (Metamorphosis) లో మైదస్ గురించిన కథలు మనకి కనిపిస్తాయి. ఆ రెండు కథలు ఇక్కడ చెబుతాను.

గ్రీకు పురాణకథలలో కనిపించే సేటర్ (satyr) అనేది ఒక నరాశ్వం – అనగా కొంత భాగం మనిషి రూపం, కొంత భాగం గుర్రం రూపం. ఇలాంటి స్వరూపాలనే మన పురాణాలలో కిన్నరులు (అశ్వ ముఖము, నర శరీరము కలవారు), కింపురుషులు (నర ముఖము, అశ్వ శరీరము కలవారు) అని వర్ణించేరు. సిలెనస్ (Silenus) అనే పేరు గల ఒక నరాశ్వం గ్రీకు దేవుడు డయొనీసస్ (Dionysus) సహచర్యంలో కనబడుతూ ఉంటాడు. ఒక రోజు సిలెనస్ తప్ప తాగేసి రాజుగారి తోటలో పడిపోతాడు. రాజభటులు అతనిని రాజు దగ్గరకి తీసుకెళతారు. మైదస్ సిలెనస్ ని గుర్తుపట్టి పది రోజులపాటు సపర్యలు చేస్తాడు. మైదస్ చేసిన సహాయానికి ముగ్ధుడైన డయొనీసస్ ప్రతిఫలంగా మైదస్ ని ఒక వరం కోరుకోమని చెబుతాడు. దూరాలోచన లేకుండా తాను పట్టిందల్లా బంగారం అయిపోవాలి అని కోరుకుంటాడు మైదస్.

ఇక్కడ నుండి కథని ఎవరికి నచ్చిన విధంగా వారు నడిపించవచ్చు. నథేనియల్ హాతోరన్ (Nathaniel Hawthorne) చెప్పిన కథలో, మైదస్ స్పర్శ వల్ల ఉద్యానవనంలో గులాబీలు పరిమళం లేని పసిడి పువ్వులుగా మారిపోయాయని, అందువల్ల మైదస్ కూతురు ఏడిచిందని, ఏడుస్తున్న కూతురుని సముదాయించడానికి మైదస్ ఆమెని చేరదీసే సరికి ఆ అమ్మాయి బంగారు విగ్రహంగా మారిపోయిందని ఉంది. మరొక కథనంలో పళ్లెంలోఉన్న భోజన పదార్థాలు ముట్టుకునేసరికల్లా భోజనం బంగారం అయిపోతుంది . మైదస్ ఆకలితో అలమటించి పోతాడు. కారణం ఏదయినా చేసిన తప్పు తెలుసుకుని మైదస్ పశ్చాత్తాపం పడతాడు. డయొనీసస్ కనికరించి పాక్టోలస్ నదిలో గ్రుంకులిడితే వరం యొక్క ప్రభావం సడలి పోతుందని ఉపశమన మార్గం

చెబుతాడు. (ఈ నది టర్కీలోని సార్డిస్ దగ్గర ఉంది.) మైదస్ ఆ నదిలో మునిగేసరికల్లా ఆ వరం యొక్క ప్రభావం మైదస్ నుండి నదిలోని నీళ్ళల్లోకి వెళ్ళిపోతుంది. ఇప్పటికీ ఆ నదిలోని ఒండ్రుమట్టిలో బంగారం నలుసులు కనబడుతూ ఉండడానికి కారణం ఆనాటి మైదస్ స్పర్శే అని ప్రజలలో ఒక నమ్మకం ఉంది.

## 17.2 రాజుగారివి గాడిద చెవులు

మైదస్ కి సంబంధించిన కథ మరొకటి ఉంది. సువర్ణ స్పర్శ వల్ల జరిగిన పరాభవానికి ఒకింత చింతించి మైదస్ కోటగోడలు దాటి బయట ఉన్న పచ్చిక బయళ్లలో తిరుగుతూ ఉంటాడు. అడవులకి, కొండలకి, పచ్చిక బయళ్ళకి, అధినేత అయిన పేన్ (Pan) అనే ఒక నరమేషం వాయిస్తున్న పిల్లనగ్రోవి సంగీతానికి మైదస్ ముగ్ధుడు అవుతాడు.

ఒకసారి అపాలో కి పేన్ కి మధ్య సంగీత పోటీ జరుగుతుంది. ఈ పోటీలో గెలుపెవరిదో నిశ్చయించడానికి నియమించబడ్డ నిర్ణేతగణంలో మైదస్ ఒక నిర్ణేత. మిగిలిన నిర్ణేతలంతా అపాలో సంగితమే గొప్పగా ఉందంటే మైదస్ మాత్రం వ్యతిరేకంగా పేన్ ని సమర్ధించడంతో అపాలోకి కోపం వచ్చింది. "సంగీత జ్ఞానం లేని మైదస్ చెవులు గాడిద చెవులులా మారిపోవాలి" అని శపిస్తాడు. ఇంకేముంది. మైదస్ కి మాములు చెవుల స్థానంలో గాడిద చెవులు వస్తాయి. ఎంత అప్రతిష్ట! ప్రజలకి తెలిస్తే పరువు గంగలో కలసిపోతుంది కదా! మైదస్ తలపాగా ధరించడం మొదలు పెట్టేడు. ఎంత రాజైనా తలకాయని మంగలి చేతులలో పడకుండా దాచలేడు కదా. రాజుగారివి గాడిద చెవులు అని మంగలికి తెలిసిపోయింది. మూడో కంటివాడికి ఈ రహశ్యం తెలిసిందంటే తల తీయించేస్తానని మైదస్ మంగలిని బెదిరించేడు. రాచ రహశ్యం! రచ్చకెక్కితే కొంపలంటుకుపోవూ? కడుపులో దాచుకోలేక మంగలి కడుపు ఉబ్బి పోతోంది. ఏమిటి చేస్తాడు? ఏమిటి చెయ్యగలడు? ఎవ్వరికో ఒకరికి చెప్పాలి. తనకి తెలిసిన రహశ్యాన్ని ఒక పుట్టలో ఊదేశాడు!

కొన్నాళ్ళకి ఆ పుట్ట మీద వెదురు బొంగులు పెరగడం మొదలెట్టేయి. అవి గాలికి ఇటు అటూ ఊగినప్పుడల్లా, పిల్లనగ్రోవిలో గాలి ఆడినట్లు అయి, అవి "రాజు గారివి గాడిద చెవులు" అని పాట ప్రసారం చెయ్యడం మొదలెట్టేయి!

ఇంతకీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మైదస్ అనే రాజు నిజంగా 3000 సంవత్సరాల క్రితం (అనగా, సు సా. శ. పూ. 800 లో) ఫ్రిగియా (Phrygia) అనే రాజ్యాన్ని పరిపాలించేడనడానికి ఆధారాలు ఉన్నాయి. ఈ ఫ్రిగియా రాజ్యం ప్రస్తుతం టర్కీ ఉన్న ప్రదేశంలోఉండేది. ఇటీవల, అనగా సా. శ. 1957 లో, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం వారు గోర్డియన్ (Gordion) లో జరిపిన తవ్వకాలలో మైదస్ తండ్రి గోర్డియోస్ (Gordios) యొక్క శ్మశానవాటిక కనబడింది. అక్కడ శవపేటికలో కనిపించిన అస్థిపంజరం, దానిచుట్టూ ఉత్తరక్రియలకి సంబంధించిన విందుభోజన సామాగ్రి కనిపించేయిట.

మరయితే మైదస్ పట్టినవన్నీ నిజంగా బంగారం అయిపోయేవా? ఆనాటి దుస్తుల్ని విశ్లేషించి చూస్తే వాటన్నిటికీ ఎరుపు డౌలు ఉండడాన్ని బట్టి అవి మూడొంతులు అయోభస్మం (తుప్పు లేదా oxide of iron) రంగు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ రంగుని చూసి బంగారం అనుకుని ఆ కథ సృష్టించి ఉండవచ్చు. మరి గాడిద చెవుల మాట? ఈ సంశయాన్ని తీర్చటానికి ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానం సరిపోదు.

## 17.3 అలెగ్జాండర్  గోర్డియన్ బ్రహ్మముడిని ఛేదించడం



బొమ్మ. Jean-François Godefroy చిత్రించిన "అలెగ్జాండర్  గోర్డియన్ బ్రహ్మముడిని ఛేదించడం" (వికీపీడియా)

ఈ కథ ముగించేలోగా మైదస్ తండ్రి గోర్డియన్ గురించి చిన్న పిట్టకథ ఒకటి అప్రస్తుతం కాదు. ఫ్రిగియా రాజ్యానికి ఒకప్పుడు రాజు లేకుండా అయిపోయింది. అప్పుడు టెల్మిసస్ (Telmissus) లో ఉన్న ఓరకిల్, "రాజ్యంలోకి ఎవరైతే మొట్టమొదట ఎడ్లబండిని తోలుకుంటూ వస్తారో వారే ఫ్రిగియా రాజ్యానికి రాజు" అని జోస్యం చెప్పింది. గోర్డియన్ అనే పేరు గల ఒక రైతు ఎడ్లబండిని తోలుకుంటూ

ఊళ్లోకి రాగానే అతనికి పట్టాభిషేకం చేసేసేరు. అనుకోకుండా జరిగిన ఈ  సంఘటనకి కృతజ్ఞతగా మైదస్ ఆ బండిని ఆ ఓరకిల్ ఆలయంలో ఒక స్తంభానికి పెద్ద మోకుతో గట్టిగా ముడివేసి కట్టేసేడు. ముడి మీద ముడివేసి ఎంత గట్టిగా  కట్టేడంటే దానిని విప్పడానికి ఎవ్వరి తరము కాలేదు. నాలుగు వందల సంవత్సరాల తరువాత, సుమారు సా. శ. పూ. 400 లో,  అలెగ్జాండర్ ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు ఆ బ్రహ్మముడి ఇంకా అలానే ఉందిట. ఆ ముడి ఎవ్వరు విప్పుతారో ఆ వ్యక్తి ఆసియా అంతటికి సార్వభౌముడు అవుతాడని అక్కడ ఓరకిల్  జోశ్యం చెప్పిందిట. ఈ మాట విని అలెగ్జాండర్ ఆ ముడిని విప్పడానికి ప్రయత్నించి మొదట విఫలం అవుతాడుట. అప్పుడు “ముడి విప్పడం ముఖ్యం కానీ ఎలా విప్పేమన్నది  ప్రధానం కాదు” అంటూ తన కరవాలం తీసుకుని ఒక్క వేటులో ఆ ముడిని రెండు ముక్కలు చేసి విప్పేడుట. ఎప్పటికీ  పరిష్కారం దొరకకుండా ఏళ్ల  తరబడి వేధిస్తున్న సమశ్యని ఎవరైనా ఒక్క వేటులో పరిష్కరిస్తే “గోర్డియన్ ముడిని విప్పినట్లు” (untying the Gordian knot) అనే నుడికారాన్ని వాడతారు.

# 18. హెరాక్లీస్ కథ



బొమ్మ. రోమ్ నగరంలోని పాలరాతి శిల్పం: .హెరాక్లిస్ పసితనంలో పాముని చంపడం (వికీపీడియా, Capitoline Museums of Rome, Italy)

గ్రీసు పురాణగాథలలోని హెరాక్లీస్ అనే మహా యోధుడే రోమనుల హెర్క్యులిస్ గా రూపాంతరం చెందేడు. హెర్క్యులిస్ (Hercules) అనే పేరు ప్రపంచ వ్యాప్తంగా పరిచితం అయిన పేరు. ఆ మాటకి వస్తే గ్రీసు యోధులలో ఒక్క హెరాక్లీస్ శిల్పమే – శిధిలావస్థలో – భారత దేశంలో, మధుర దగ్గర దొరికింది. అది ఇప్పుడు కోల్కతా లోని పురావస్తు ప్రదర్శనశాలలో ఉందిట!

హిందూ  పురాణాలలో భీముడితో తులతూగగల బలశాలులు మరో నలుగురు ఉన్నారు అంటారు: హిడింబాసురుడు, జరాసంధుడు, కీచకుడు, దుర్యోధనుడు. కానీ గ్రీకు పురాణాలలోను, రోమను పురాణాలలోను హెరాక్లీస్  (లేదా హెర్క్యులిస్) తో ఉజ్జీ అయిన  అరివీరభయంకరుడైన బలశాలి మరొకడు లేడు.

హెరాక్లీస్ దైవాంశ సంభూతుడు; సాక్షాత్తు జూస్ కీ  ఒక మానవ వనిత ఆల్^క్మిని (Alcmene) కి పుట్టిన కొడుకు అవడం వల్ల తండ్రి నుండి కొన్ని దేవ లక్షణాలు, తల్లి నుండి కొన్ని మానవ లక్షణాలు అబ్బేయి.

ఈ ఆల్^క్మిని ఎవరు? ఈమె ఎలక్ట్రియాన్ (Electryon) కూతురు. ఈ ఎలక్ట్రియాన్ ఎవరు? ఇతను పెర్సియస్  కీ ఆంద్రోమెడా కి పుట్టిన కొడుకు. పెర్సియస్ ఎవరు? జూస్ కీ  దనయే (Danaë) కి పుట్టిన కొడుకు. అనగా, జూస్ కొడుకు పెర్సియస్, అతని కొడుకు ఎలక్ట్రియాన్ కాబట్టి వరసకి జూస్ కి ఆల్^క్మిని  మునిమనవరాలు అవుతుంది.

హేసియోడ్ చెప్పిన కథనం ప్రకారం ఆల్^క్మిని అంతటి అందమైన మానవ వనిత మరొకతె లేదు. సన్నటి నడుము, సంపెంగ ముక్కు, నల్లటి కళ్ళుతో ఆమె అందం ఏఫ్రొడీటీ అందాన్ని తలదన్నేలా ఉండేదని హేసియోడ్ వర్ణిస్తాడు.

ఒక నాడు ఆల్^క్మిని తన స్నేహితుడు, ప్రియుడు, అయిన ఏంఫిట్రియాన్ (Amphitryon) తో కలసి యుద్ధ రంగంలోని  విడిదికి వెళుతుంది. ఏంఫిట్రియాన్ రణరంగంలోఉన్న సమయంలో ఏంఫిట్రియాన్ వేషంలో జూస్ ఆల్^క్మిని మందిరంలోకి ప్రవేశించి, తన మునిమనవరాలితో రమిస్తూ మూడు రాత్రులు గడపడం వల్ల హెరాక్లీస్ తో ఆమె గర్భవతి అవుతుంది! నాలుగవ రోజు రణరంగం నుండి ఏంఫిట్రియాన్ రాకతో జరిగిన మోసం ఆల్^క్మిని కి అవగతం అవుతుంది. రణరంగం నుండి తిరిగి వచ్చిన ఏంఫిట్రియాన్ భార్యతో రమించడం వల్ల  ఆల్^క్మిని గర్భంలో ఇఫిక్లీజ్  (Iphicles) పిండం పెరగడం మొదలవుతుంది. ఇలా ఇద్దరు పురుషులకి చెందిన బిడ్డలు ఒకే సారి తల్లి కడుపులో పెరగడం

సాధారణంగా జరగదు కానీ అసంభవం కాదు. (దీనినే ఇంగ్లీషులో heteropaternal superfecundation అంటారు.) కనుక ఏంఫిట్రియాన్ కి ఇఫిక్లీజ్ సొంత కొడుకు, హెరాక్లీజ్ సవతి కొడుకు అవుతారు.

జూస్ పట్టమహిషి హేరా కి జూస్ ఒక మానవ వనితతో నడుపుతున్న వ్యవహారం నచ్చలేదు. ఆల్^క్మీని గర్భంలో పెరుగుతున్న హెరాక్లీజ్ మీద ఒక రకం ద్వేషం పెంచుకుంది. ఇలా రగులుతున్న ద్వేషం తన కడుపులోనే దాచుకుని అవకాశం కోసం ఎదురు చూడసాగింది. హోమర్ ఇలియాడ్ లో చెప్పిన కథనం ప్రకారం ఆల్^క్మీని మరునాడు ప్రసవిస్తుందనగా జూస్ – హేరా ప్రోద్బలంతో – ఒక సంచలనాత్మకమైన ప్రకటన చేసేడు. ఏమని? మరునాడు పుట్టబోయే బాలుడే దేవలోకానికి అధిపతి అవుతాడని! హేరా హుటాహుటి ఒలింపస్ పర్వతం నుండి దిగి వచ్చి పెర్సియస్ పెద్ద కోడలు నెలలు నిండకుండానే ప్రసవించేటట్లు చేసింది. అదే ఊపులో నెలలు నిండిన ఆల్^క్మీని మరునాడు ప్రసవించకుండా మంత్ర శక్తితో ఆపు చేసింది. ఈ కుతంత్రం వల్ల హెరాక్లీజ్ కి చెందవలసిన రాజ్యం పెర్సియస్ పెద్ద మనుమడు, నెల తక్కువ వాడు అయిన, యురీస్తియస్ కి దక్కింది.

హేరా వేసిన ఎత్తుకి పైయెత్తు అన్నట్లు ఒక నాడు ఎథీనా ఆకలితో ఉన్న చిరుత ప్రాయపు హెరాక్లీస్ ని తీసుకెళ్లి అనాథ బాలుడని చెప్పి హేరా అక్కున చేర్చింది. హేరా తన చన్నులని చీకడానికి అందించింది. పాలు తాగుతున్న హెరాక్లీజ్ చనుమొనలని కొరికేడు. హేరా రొమ్ముల నుండి ప్రవహించిన పాలే ఆకాశంలో మనకి కనిపిస్తున్న పాలపుంత! అంతే కాదు. దైవాంశ ఉన్న హేరా పాలు తాగడం వల్ల హెరాక్లీజ్ బలం ఇనుమడించింది, రవంత దైవాంశ కూడా ప్రాప్తించింది.

ఈ సంఘటనతో హేరాకి హెరాక్లీజ్ మీద ద్వేషం కూడా ఇనుమడించింది. ఒకనాడు చంటి బిడ్డ ఉయ్యాలలో పడుక్కుని ఉండగా వాడిని చంపడానికి రెండు పాములని పంపించింది. ఆ పాముల్ని చంటివాడు చేతులతో నలిపి చంపేశాడు.

ఇంతటితో హెరాక్లీజ్ ఇడుములు అంతం కాలేదు. హేరా పగకి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. హేరా పెడుతున్న బాధలు భరించలేక హెరాక్లీజ్ తన భార్యని పిల్లలని చంపేస్తాడు. తరువాత పశ్చాతాపంతో కుంగి పోతాడు. చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా యురీస్తియస్ కొలువులో ఉండి అతను ఆదేశించిన పనులు చెయ్యడానికి ఒప్పుకుంటాడు. వీటినే హెరాక్లీజ్ చేసిన పన్నెండు సాహస కృత్యాలు అంటారు. నిజానికి ఈ పన్నెండింటిని మించి మరెన్నో సాహసాలు చేసేడు. ఈ పన్నెండింటిలో కొన్ని మాత్రమే ఈ దిగువ చెబుతాను.

1. కత్తులకూ, బరిసెలకూ, బాణాలకూ లొంగని ఒక భయంకరమైన సింహం ఆ ప్రాంతాలని బాధిస్తుతోంది. దానిని చంపాలి. హెరాక్లీజ్ దాని పీకని చేతులతో నలిపి చంపేసి, దాని చర్మాన్ని ఒలిచి అంగవస్త్రంగా ధరించి, దాని శరీరాన్ని గిరగిరా తిప్పి ఆకాశంలోకి విసిరేసేడు. అదే ఇప్పుడు మనకి ఆకాశంలో కనిపించే సింహ (Leo) రాశి. హెరాక్లీజ్ విగ్రహాలలో ఈ సింహపు తోలు తరచు కనిపిస్తూ ఉంటుంది.
2. ఆ ప్రాంతాలలో తొమ్మిది తలకాయల మహా సర్పం ఒకటి ఉండేది. ఈ పాముని సాక్షాత్తూ హేరా పెంచి పెద్దచేసింది; హెరాక్లీజ్ మీద కసి తీర్చుకునే నిమిత్తం! ఆ పాము తల ఒకటి నరికితే మరొకటి పుట్టుకొస్తూ ఉండేది. దానిని చంపాలి. హెరాక్లీజ్ దాని తొమ్మిది తలలూ ఒకే వేటులో నరికేసి, తిరిగి తల మొలవకుండా కాలుతున్న శలాకతో వాతలు పెట్టి, చంపేసేడు. అదే ఇప్పుడు ఆకాశంలో అజగరం (Hydra) అనే నక్షత్ర రాశిగా మనకి కనిపిస్తుంది.
3. హెరాక్లీజ్ సాధించిన ఘన విజయాలు చూసి యురీస్తియస్, హేరా లు సహించలేక పోయారు. ఈ మారు ఒక మృగాన్ని చంపడానికి బదులు ప్రాణాలతో పట్టి తెమ్మని ఆదేశించారు. అది డయానా దేవతకి చెందిన లేడి. అతి వేగంగా పరిగెత్తగల, బంగారు కొమ్ములు ఉన్న లేడి. ఆ లేడిని గాయపరచకుండా పట్టుకుని, తెచ్చి, రాజుకి ఇవ్వాలి. హెరాక్లీజ్ ఒక ఏడాది పాటు ఆ లేడిని వెంటాడి చిట్టచివరికి పట్టుకున్నాడు. యురీస్తియస్ ఏమనుకున్నాడంటే అడవిలోతిరుగాడే లేడిని బంధిస్తే వనదేవత ఆర్టెమీస్ కి కోపం వస్తుంది. అప్పుడు "కాగల కార్యాన్ని ఆర్టెమీస్ తీరుస్తుంది" అనుకున్నాడు. కానీ లేడిని పట్టుకుని వస్తూవుంటే ఆర్టెమీస్, ఆమె కవల సోదరుడు

ఆపాలో ఎదురయ్యారు. వారికి తన కథ చెప్పి లేడిని పట్టుకున్నందుకు క్షమాభిక్ష వేడుకున్నాడు. ఏ కళనుందో ఆర్టెమీస్ 'సరే' అంది. హెరాక్లీజ్ బతికిపోయాడు!

4. ఆర్కేడియాలో పంట భూములని నాశనం చేస్తున్న అడవి పందిని ప్రాణాలతో పట్టుకోవాలి. ఖైరాన్ సహాయంతో హెరాక్లీజ్ ఆ అడవి పందిని పట్టుకుంటాడు.
5. వెయ్యి పశువులు ఆక్రమించి, ముప్పయ్ ఏళ్లుగా సంరక్షణ లేకుండా పడి ఉన్న లెజియన్ రాజు గారి పశువుల సాలని శుభ్రం చెయ్యాలి. రెండు నదీప్రవాహాలని మళ్లించి, పశువుల సాల గుండా ప్రవహింపజేసి, ఒక్క రోజులో ఆ సాలను శుభ్రపరచాడు.
6. కంచు ముక్కులు, లోహపు రెక్కలతో బాటసారులను వేధించి తింటున్న రాక్షసి పక్షులని చంపాలి. ఎథీనా సహాయంతో వీటిని ఎదుర్కొని పారదోలుతాడు. అవి చెల్లాచెదరు అయిన తరువాత వాటిలో కొన్నింటిని చంపి కొన్నింటిని తరిమి కొడతాడు. అలా పారిపోయిన పక్షులే మరల అర్గోనాటులని ఎదుర్కోడానికి జేసన్–అర్గోనాట్ ల కథలో వస్తాయి.
7. ముక్కు లోంచి మంటలు చిమ్ముతూ, బుసలు కొడుతూ, క్రీట్ ద్వీపాన్ని ధ్వంసం చేస్తున్న పొసైడన్^ దేవుడి ఆంబోతులని అదుపులో పెట్టాలి.

ఇలా మొత్తం పన్నెండు సాహస కృత్యాలు చేసేడు. అంటారు కానీ నిజానికి మరెన్నో సాహసాలు చేసేడు.


సోఫోక్లిస్ చెప్పిన కథనం ప్రకారం రకరకాల జంతువుల రూపాలలోకి, పక్షుల రూపాలలోకి మారిపోగలిగే అఖేలస్ (Achelous) అనే జలదేవుడుతో యుద్ధం చేసి డియనీరా (Deianira) అనే అందగత్తెని పెళ్లి చేసుకున్నాడు. చివరికి పరోక్షంగా ఆమె వల్లనే అతనికి చావు మూడింది. అదెలా అంటే వీరిరువురు ఒక పడవలో ఒక నదిని దాటుతూ ఉండగా నెస్సస్ (Nessus) అనే పేరు గల ఒక నరతురంగం (centaur) డియనీరా ని ఎత్తుకుపోయింది. హెరాక్లీజ్ దానిని వెంబడించి చంపుతాడు. అది ప్రాణాలు విడచిపెడుతూ డియనీరా కి తన రక్తాన్ని కొద్దిగా బహుమానంగా ఇస్తాడు. ఇచ్చి, "నీ భ ర్త నిన్ను గాక మరొకరిని చేరదీస్తున్నాడని అనుమానం వస్తే అతను కట్టి విడిచిన బట్టని ఈ రక్తంలో ముంచినట్లయితే నీ భ ర్త నీ వాడవుతాడు." అని చెబుతాడు.

ఒక సారి హెరాక్లీజ్ ఒక బానిస పిల్ల ప్రేమలో పడతాడు. డియనీరా కి ఆ విషయం తెలిసింది. అప్పుడు తన భర్త కట్టి విడిచిన బట్టలని ఆ నరతురంగం ఇచ్చిన రక్తంలో ముంచింది. నిజానికి ఆ రక్తం ప్రమాదకరమైన విషం. ఆ విషం హెరాక్లీజ్ ని చంపింది. అప్పుడు జూస్ మెరుపులు పిడుగులతో కూడిన తన వజ్రాయుధాన్ని హెరాక్లీజ్ మృత శరీరం మీదకి విసురుతాడు. హెరాక్లీజ్ ఆత్మ ఒలింపస్ పర్వతం మీద ఉన్న ఇతర దేవగణాలని చేరుకుంది. హెరాక్లీజ్ భౌతిక శరీరం మీద మంటలు లేచాయి. ఆ మంటలు ఎగసి స్వర్గం దాకా వెళ్ళేయి. ఆకాశం ఎర్రబడింది. హెరాక్లీజ్ నక్షత్ర లోకంలోచిరస్థాయిగా నిలచిపోయేడు.

చీకటి రాత్రి తలెత్తి ఆకాశం వైపు చూస్తే హెర్క్యులిస్ నక్షత్ర మండలాన్ని గుర్తించడం అంత తేలిక కాదు. ఎందుకంటే ఆ రాశిలో పేరెన్నికగన్న నక్షత్రాలు ఏవీ లేవు. ఈ రాశి బూటెస్ (భూతేశ), లైరా (వీణ) మండలాలకు మధ్యస్తంగా, అఫియాకస్ కి తల తగులుతోందా అన్నట్లు తలకిందులుగా కనిపిస్తుంది.

హెర్క్యులిస్ నక్షత్ర మండలాన్ని జాగ్రత్తగా చూస్తే ఒక తెల్లని మచ్చ కనిపిస్తుంది. దీనిని దుర్భిణిలో చూస్తే ఇది ఆణిగుచ్ఛం (ఒక నక్షత్రాల గుత్తి, star cluster) అని తేలింది. దీనిని వేదకాలపు భారతీయులు గుర్తించి ఋగ్వేదం (1-154-5) వ మంత్రంలో, "విష్ణోః పదే పరమే మధ్య ఉత్సః" అన్నారు. అంటే "విష్ణుపద మండలంలో గొప్ప తేనెపట్టు వంటి చక్కని దృశ్యం" అని అర్థం!

హెరాక్లీజ్ గ్రీకు యోధులందరిలోకి ఎక్కువ కీర్తి ప్రతిష్ఠలు గణించేడు. ప్రపంచవ్యాప్తంగా ఇతనికి ఉన్నన్ని విగ్రహాలు మరే గ్రీకు యోధునికి లేవేమో! ఇతని విగ్రహాలన్నిటిలోను గడ్డం లేని ముఖం, కండలు తిరిగిన శరీరం, చేతిలో విల్లమ్ములకి బదులు దుడ్డుకర్ర ఉండడం, సింహపు చర్మం వీపు మీద వెళ్ళాడుతూ ఉంటే సింహపు పంజాలు మెడ కింద ముడేసినట్లు ఉండడం సర్వసాధారణం. హెరాక్లీజ్ చేసిన వీరవిహారాలలో భారతదేశపు పొలిమేరల లోకి కూడా వచ్చేడని ఒక నమ్మకం ఉంది. ఆ నమ్మకానికి ఋజువుగా మధురలో దొరికిన తల లేని హెరాక్లీజ్ విగ్రహం ఒకటి కోల్కతా లోని సంగ్రహాలయంలో ఉంది!



బొమ్మ. Indian Museum, Kolkata లో ఉన్న సింహాన్ని చంపుతున్న హెరాక్లిజ్ విగ్రహం (వికీపీడియా)

# 19. పంకజ ప్రాదుర్భావం

"The basic theme of mythology is that the visible world is supported and sustained by an invisible world."
– Joseph Campbell

ఎన్నో గ్రీకు పురాణగాథలలో కొన్నింటిని మాత్రమే ఇంతవరకు మచ్చు చూసేం. ఇక్కడ ప్రస్తావించకుండా దాటేసిన కథలు ఇంకా చాలా ఉన్నాయి. ఈ కథలు అన్నిటిలోను ఉమ్మడిగా కనిపించే అంశాలు: సృష్టి జరిగిన విధానం, ఆ సృష్టిలో మూడు తరాల అమరులు అధికారం కోసం ఒకరితో మరొకరు పోటీ పడడం. ఈ పోటీలో కేవలం ఒక ఆటవస్తువుగా మానవుడి స్థానం.

అమరులలో మొదటి తరం వారిని ప్రకృతి శక్తులకు ప్రతీకలైన, మూర్తిత్వం లేని, అభిజ్ఞానాలు (amorphous symbols) గా కానీ, అపరావతారాలు (personified concepts) గా కానీ భావించవచ్చు. ఇవే భూమి, ఆకాశం, వాటి కలయిక వల్ల పుట్టిన సముద్రాలు, కొండలు, వింతప్రాణులు, వగైరా. క్రమేపి మూడవ తరానికి వచ్చేసరికి ఒలింపస్ పర్వతం మీద స్థిరనివాసం ఏర్పరచుకున్న అమరులకు అతీంద్రియ శక్తులతోపాటు మానవ ఆకారాలు, మానవ బలహీనతలు వస్తాయి.

ఇలా పురాణగాథల మీద ఆధారపడ్డ తత్త్వ జ్ఞానంతో మన చుట్టూ ఉన్న ప్రపంచం ఇలానే ఎందుకు ఉందో చెప్పడానికి ప్రయత్నం చేసింది అలనాటి ఆ సమాజం. అనగా, ఎదురుగా జరుగుతున్న కార్యానికి వెనకనున్న కారణం ఏమిటో విశదీకరించడానికి ప్రయత్నం చేసింది. ఈ కారణం మనవాతీత శక్తుల ప్రభావం కూడా అయి ఉండవచ్చనే గట్టి నమ్మకం ఒకటి వారిలో ఉండేది. అనగా ప్రతి కర్మ వెనక కర్త ఒకటి ఉంటుందనిన్నీ, ఆ కర్త మానవుడైనా కావచ్చు, అమరలోకంలోఉన్న దేవుడైనా కావచ్చు.

ఉదాహరణకి సముద్రాలకి అధిదేవత అయిన పొసైడన్  సంగతి చూద్దాం. పెద్ద సముద్రతీరం ఉన్న ప్రాంతం కనుక గ్రీకులకి సముద్రదేవుడు చాల ముఖ్యుడు. ఈ  ప్రాముఖ్యత చూపడానికి పొసైడన్ ఆయుధం త్రిశూలం. పొసైడన్ కి కోపం వచ్చినప్పుడు ఆ త్రిశూలం పట్టుకుని నేలని గట్టిగా గుద్దుతాడు. ఆ తాకిడికి భూమి కంపిస్తుంది. అదే భూకంపం. గ్రీకుల కారణ–కార్య చయనికలో దేవుళ్ళ పాత్ర ఇలా ప్రవేశిస్తుంది. కనుక గ్రీకుల దృక్పథంలో పొసైడన్ సముద్రదేవుడు అవడమే కాకుండా భూకంపాలకి కారకుడు కూడా! ఈ కోణంలో చూస్తే ప్రాచీన కాలపు గ్రీసు దేశస్థులకి ఎదుట కనిపిస్తున్న దృగ్విషయం వెనుక ఎదో కారణం ఉండాలనే నమ్మకం ఉండబట్టే ఆ కారణం ఏదో తెలియక కంటికి కనపడని దేవుడిని ఆశ్రయించారు.

ఈ  సందర్భంలో హోమర్ తత్త్వజ్ఞానం గురించి మరి కొంచెం తెలుసుకుందాం. హోమర్ రచించిన ఇలియాడ్, ఆడెస్సిలు ప్రాచీన గ్రీకు సంస్కృతికి అద్దం  పడతాయి కనుక ఈ  రెండింటిని అధ్యయనం చేయడం గ్రీకుల  ఆలోచనా  విధానాన్ని  అర్థం చేసుకోవడానికి కీలకం;  ఆ మాటకి వస్తే పాశ్చాత్య నాగరికతని, సృష్టిలో మానవుని స్థానం గురించి వారి ఆలోచనా  విధానాన్ని  అర్థం చేసుకోవడానికి కూడా కీలకం. భారతీయ విలువలకి, సంస్కృతికి రామాయణ, మహాభారతాలు  ఎలాంటివో  పాశ్చాత్య విలువలకి, సంస్కృతికి ఇలియాడ్, ఆడెస్సిలు అలాంటివి అంటే అతిశయోక్తి కాదు.

ఇలియాడ్ లోని ఒకటి, రెండు ముఖ్యమైన అంశాలని తీసుకుని ఆ రోజులలో సృష్టి యొక్క నిజ స్వరూపం వారికి  ఎలా అర్థం అయిందో చూద్దాం.

ఒక ప్రశ్నతో మొదలు పెడదాం. ట్రోయ్ యోధుడు  హెక్టర్ ఎందుకు చచ్చిపోయాడు?

అక్షిల్లిస్ చంపేడు కనుక  హెక్టర్ చచ్చిపోయాడు!

అఖిల్లిస్ ఎందుకు చంపేడు? స్థూలంగా చెప్పుకోవాలంటే, గ్రీసు దేశానికీ ట్రోయ్ దేశానికి మధ్య యుద్ధం జరిగింది కనుక. ప్రత్యేకించి కారణం కావాలంటే, పాట్రోక్లస్ మరణానికి ప్రతీకారంగా అఖిల్లిస్ హెక్టర్ని చంపేడు.

ఇలా వెతుకుతూ పోతే ప్రతి సంఘటనకి, ప్రతి కార్యానికి వెనక ఒక కారణం కనిపిస్తుంది. లేదా, ఒక కారణ–కార్య చయనిక కనిపిస్తుంది.

మరొక మెట్టు పైకి వెళ్లి చూద్దాం. ఇంతకీ గ్రీసు దేశం, ట్రోయ్ దేశం ఎందుకు యుద్ధం చెయ్యవలసి వచ్చింది?

పేరిస్, హెలెన్ ప్రేమలో పడ్డారు కనుక. తన భార్య మరొకని యెడల అనురాగం చూపుతున్నాదని ప్రతీకార జ్వాలలతో మెనలయస్  మండిపడుతున్న కారణంగా. అగమెంనాన్ అధికారదాహం ఎక్కువ అయిన కారణంగా. అఖిలీస్ కి కీర్తి కాంక్ష ఎక్కువయి. ఇలా ఈ  జాబితాని పొడిగించుకుంటూ పోవచ్చు. హోమర్ దృక్ క్షేత్రంలో మానవుడు చేసే కృత్యాలకి ప్రేరణ కారణాలు అనేకం: ప్రేమ, ప్రతీకారం , అధికారదాహం, కీర్తి.

పైన ఉదహరించిన కారణ–కార్య చయనిక మానవ ప్రపంచంలో "సహజం" అని మనం సంతృప్తి పడవచ్చు. ఒక సంక్లిష్టమైన అంతర్నాటకంలో మానవుల కోరికలు, వాటి ప్రేరేపణలు, తద్వారా  జరిగే చర్యలు, ప్రతిచర్యలు  కారణంగానే ట్రోయ్ యుద్ధం లాంటి సమరాలు, హెక్టర్ మరణం లాంటి సందర్భాలు ఎదురవుతాయి.

కానీ హోమర్ చెప్పిన కథ ఇంత సజావుగా సాగదు; ఎందుకంటే ఆ  కథ అల్లికలో దేవుళ్ళకి కూడా ప్రముఖమైన పాత్ర ఉంది. హెక్టర్ కి అఖిల్లీస్  కి మధ్య  భీకర పోరాటం జరగబోయే ముందు హోమర్ కథా  గమనాన్ని దేవుళ్ళ వైపు తిప్పుతాడు. వారంతా జరుగుతున్న కార్యక్రమాన్ని స్వర్గంలో కూర్చుని చూస్తూ ఉంటారు – ఇద్దరు ప్రత్యర్థుల మధ్య జరుగుతున్న చదరంగపు పోటీని బయట నుండి ప్రేక్షకులు

చూస్తున్నట్లు. కానీ తటస్థంగా ఉండరు; ఇరు పక్షాలని సమర్థిస్తూ, వాళ్ళకి సలహాలు ఇస్తూ, వారి ఆటలలో కలుగజేసుకుంటూ  ఉంటారు. హెక్టర్ ని వెంటతరుముతున్న అక్కిలీస్  ని చూసి జూస్ ఒక పక్క అక్కిలీస్  ధైర్య సాహసాలని మెచ్చుకుంటూ, మరొక పక్క ప్రేమానుబంధంతో హెక్టర్ ని సమర్థిస్తూ ఉంటాడు. తాను ఎవరి పక్షం కాయాలి? తన్యతని భరించలేక ఇతరులని సలహా ఇమ్మని కోరతాడు.

"Come you immortals, think this through. Decide.
Either we pluck the man from death and save his life
or strike him down at last, here at Achilles' hands" (22:206–209)

ఎథీనా సలహా మేరకు హెక్టర్ చావుకే సమ్మతిస్తాడు, జూస్.


"Go.
Do as your own impulse bids you. Hold back no more."
So he launched Athena already poised for action —
down the goddess swept from Olympus' craggy peaks. (22: 200–223)

ఇలా గ్రీకు దేవతలు మానవులని చదరంగం లోని  పావులలా వాడుకుని ఆటలు ఆడుకున్నారు. వారిలో శక్తి యుక్తులు ఉన్నాయేమోకాని శీల సంపద ఉన్నట్లు కనిపించదు.  అటువంటి దేవతలకి సహజాతీతమైన, ఆధిదైవిక (supernatural) శక్తులు ఉన్నాయని నమ్మి, వారిని  ఆరాధించిన గ్రీకు ప్రజానీకానికి  మంత్రాల మీదా, మహిమల మీదా, దేవుళ్ళు ఇచ్చే వరాల మీదా, శాపాల మీదా నమ్మకం ఉన్నట్లు  కనిపిస్తుంది.

ఈ కాలపు ఆధునిక వైజ్ఞానిక, హేతువాద  దృక్పథంతో చూస్తే  వారిది చాల వెనకబడ్డ సమాజంలా అనిపిస్తుంది. ఇటువంటి "వెనకబడ్డ" సమాజం అకస్మాత్తుగా సా. శ. పూ.  5 శతాబ్దం వచ్చేసరికి ఒక్కసారి ఉలిక్కిపడి మేలుకున్నదా అనిపిస్తుంది. ఎందుకంటే నేడు ప్రపంచం నలుమూలల

ప్రజ్వరిల్లుతున్న ఆధునిక, శాస్త్రీయ, తార్కిక దృక్పథానికి పునాదులు గ్రీసు దేశంలోనే పడ్డాయి. పంకిలమైన బురద భూమిలో ఈ పద్మం ఎలా పుట్టుకొచ్చింది? ఈ మార్పు ఏ పరిస్థితులలో జరిగిందో ఇటుపైన విచారిద్దాం.

# 20. గ్రీకు తత్త్వవేత్తల ప్రాదుర్భావం




బొమ్మ. గ్రీసు తత్త్వవేత్తలు (గూగుల్ సౌజన్యంతో)

**1**

బురద లోంచి తామర పువ్వు పుట్టుకొచ్చినట్లు పురాణగాథలలో మునిగి తేలుతున్న గ్రీసు సమాజంలో అకస్మాత్తుగా విప్లవ వీచికలు తెరలు తెరలుగా తలెత్తడం మొదలయింది. ముందస్తుగా గ్రీసు చరిత్రలో కాలరేఖని ఒక సారి సమీక్షిద్దాం. గ్రీకు దేవతలు అస్తవ్యస్తత నుండి ఎప్పుడు పుట్టుకొచ్చేరో, ఒలింపస్ పర్వతం మీద ఎప్పుడు స్థిరపడ్డారో  మనకి తెలియదు. కానీ ట్రోయ్ యుద్ధం జరిగేనాటికి (ఉరమరగా సా. శ. పూ.1100) ఆ సమాజంలో ఆ దేవతల కథలు, ఆ నమ్మకాలూ స్థిరపడిపోయాయి.  ఆ నమ్మకాలని ఆధారంగా చేసుకుని హోమర్ తన ఇలియాడ్, ఆడెస్సి అనే గ్రంథాలని మౌఖిక ధోరణిలో (ఉ.  సా. శ. పూ. 800 లో) రచించి  ఉంటాడు. ఈ మౌఖిక సాహిత్యం గ్రంథరూపం దాల్చేసరికి మరికొంత కాలం పట్టి ఉండొచ్చు.

వీటన్నిటిని ఆధారంగా చేసుకుని హేసియోడ్ తన చరిత్రని (ఉ. సా. శ. పూ. 700 లో) రాసి ఉంటాడు. డెల్ఫీ**లో** ఉన్న ఓరకిల్ మీద నమ్మకాలు అలెగ్జాండర్ కాలం వరకు ఉన్నట్లు దాఖలాలు ఉన్నాయి కాబట్టి ఈ కథలు, ఈ నమ్మకాలు అలెగ్జాండర్ (ఉ. సా. శ. పూ. 350) కాలం వరకు ప్రచారంలో ఉన్నాయని మనం తీర్మానించవచ్చు.

ఇలాంటి వాతావరణపు నేపథ్యంలో మేఘాలు లేని ఆకాశం నుండి మెరుపులు మెరిసినట్లు, పిడుగులు పడ్డట్లు గ్రీకు సమాజంలో పెను మార్పు – విప్లవాత్మకమైన మార్పు – చోటు చేసుకోవడం మొదలయింది. వీటిని అర్థం చేసుకోవాలంటే గ్రీసు దేశపు చరిత్రని కొన్ని "యుగాలు" గా విభజించి అధ్యయనం చెయ్యడం సాంప్రదాయికంగా వస్తున్న ఆచారం. ఈ యుగాలని ఈ దిగువ పట్టికలో చూపెడుతున్నాను. (ఇక్కడ BCE అంటే Before the Common Era లేదా లేదా క్రీస్తు శకానికి పూర్వం (క్రీ. శ. పూ.) అని అర్థం. చూపిన సంవత్సరం పెద్దది అయినకొద్దీ కాలరేఖ మీద వెనక్కి వెళుతున్నామని గుర్తు పెట్టుకోవాలి.)

- నవశిలా యుగం (Neolithic Period, 6000–2900 BCE)
- కాంస్య యుగం (Early Bronze Age, 2900 – 2000 BCE)
- మినోవా యుగం (Minoan Age, 2000–1400 BCE)
- మైసీనియా యుగం (Mycenaean Age, 1100 – 600 BCE)
- అంధకార యుగం (The Dark Ages, 1100 – 750 BCE)
- ప్రాచీన యుగం (Archaic Period, 750 – 500 BCE)
- సంప్రదాయిక యుగం (Classical Period, 500 – 336 BCE)
- యూనాని యుగం (Hellenistic Period, 336 – 146 BCE)

సా. శ. పూ. 323 లో అలెగ్జాండర్ మృతి తరువాత నుండి సా. శ. పూ. 31 లో రోమన్ సామ్రాజ్యం ఏర్పడేవరకు గల కాలాన్ని చరిత్రలో యూనాని యుగం (Hellenistic Period) అంటారు.

ఇవన్నీ ఉరమర లెక్కలే – కొద్ది దశాబ్దాలు ఇటు అటుగా! పాఠకులు అర్థం చేసుకోడానికి వీలుగా మనకి పరిచయం ఉన్న కొన్ని సంఘటనలు, కొందరు వ్యక్తుల జీవిత కాలాలు ఈ కాలరేఖ మీద ఉంచుదాం.

- కలియుగం మొదలు (3300 BCE)
- సింధు నాగరికత: (3300 –1300 BCE)
- హోమర్ (800 – 700 BCE)
- థేల్స్ (624 – 548 BCE)
- అనాక్సిమేండర్ (610 – 546 BCE )
- పైథాగొరోస్ (570 – 495 BCE)
- కన్ఫ్యూషియస్ (551– 479 BCE)
- గౌతమ బుద్ధుడు (500 – 400 BCE)
- ఎంపిడోక్లీస్ (490 - 430 BCE)
- సోక్రటీస్ (470 – 399 BCE)
- ప్లేటో (428 - 348 BCE)
- అరిస్టాటుల్ (384–322 BCE)
- అలెగ్జాండర్ (336 – 323 BCE)
- మౌర్య సామ్రాజ్యం (321–185 BCE)
- ఆర్కిమిడీస్ (287 – 212 BCE)

సింధు నాగరికత అవసాన దశలో ఉన్న రోజులలో "మైసీనియా యుగం" మొదలయింది. మైసీనియా యుగం తొలి రోజులలో ట్రోయ్ మహా సంగ్రామం జరిగిందనడానికి ఆధారాలు దొరుకుతున్నాయి. తరువాత గ్రీసు దేశం దరిదాపు నాలుగున్నర శతాబ్దాలపాటు "అంధకార యుగం"లో – పురాణకథల ప్రభావంలో పడి – మగ్గిన తరువాత హోమర్ అప్పటికే ప్రచారంలోఉన్న కొన్ని కథలని గ్రంథస్థం చేసి "ప్రాచీన యుగం" కి వైతాళికుడయ్యాడు. తరువాత వచ్చిన "సంప్రదాయిక యుగం" లో పెద్ద పెట్టున

శాస్త్రీయ దృక్పథం పెరిగింది. తరతరాలుగా ప్రజలలో పాతుకుపోయిన ఆచార వ్యవహారాలని కొంతమంది ప్రశ్నించడం మొదలు పెట్టేరు. అయినా సరే "యునాని యుగం"లో అలెగ్జాండర్ భారతదేశపు సరిహద్దులకి వచ్చే వరకు గ్రీసు దేశపు ప్రజల మీద పురాణగాథల పట్టు సడల లేదు.

## 2

చరిత్రలో, చాల కాలం పాటు, ప్రపంచం నలుమూలల సత్యాన్వేషణ, భగవదాన్వేషణ అన్నవి పర్యాయ పదాలుగా వాడడం జరిగింది. భగవంతుని ప్రస్తావన తీసుకుని రాకుండా కేవలం ప్రకృతి సత్యాలని గురించి తెలుసుకోవాలనే కుతూహలం పుట్టేసరికి కొంత కాలం పట్టింది.

అది గౌతమ బుద్ధిని కాలం. ఎందువల్లనో ప్రపంచంలో, పలు చోట్ల, తార్కికమైన చింత బాగా పెరిగింది. దేవుడనే భావం మీద ఆధారపడకుండా, కంటికి ఎదురుగా ఉన్న సృష్టి విచిత్రాన్ని అవగాహన చేసుకుందుకి మానవుడు ప్రయత్నించేడు. భారతదేశంలో గౌతమ బుద్ధుడు, చైనాలో కన్ఫూషియస్ , గ్రీసు దేశంలో థేల్స్, అనాక్సిమేండర్, మొదలైన వారు సమకాలీకులవడం గమనార్హం!

భారతదేశంలో బౌద్ధ ధర్మం కార్య–కారణ వాదానికి విత్తులు నాటడం మొదలు పెట్టింది. "ఇది కీలకమైన సంఘటన. ప్రకృతికి అతీతమైన దానిని తిరస్కరిస్తూ బుద్ధుడు మూడు విధానాలు చెప్పాడు. మానవుడిని హేతువాద దృక్పథం వైపు నడిపించడం మొదటిది. మానవుడిని సత్యాన్వేషణ వైపు స్వేచ్ఛగా పయనింప చేయడం రెండవది. మూఢనమ్మకాలను అనుసరించడం ద్వారా మానవుడు అన్వేషణా శక్తిని కోల్పోతాడు అని చెప్పడం మూడవది. దీనినే కర్మ సిద్ధాంతం లేదా కార్య–కారణ సిద్ధాంతం (cause – effect theory) అంటారు. బౌద్ధ ధర్మంలో కార్య–కారణ సిద్ధాంతం అత్యంత కీలకమైంది. బౌద్ధ ధర్మం హేతువాద బద్ధం కానట్లయితే అది బౌద్ధమే కాదు. అందుచేత ప్రకృతికి అతీతమైన వాటిని నమ్మడం ధమ్మం కాదు." (బుద్ధుడు మరియు అతని ధమ్మం, (సం.) పేర్వారం జగన్నాథం, "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు," తెలుగు విశ్వవిద్యాలయం, 1994, సంపుటం 11, పుట 222).

ఇదే సమయంలో చైనాలో కన్ఫుషియస్ మరొక  దారి చూపేదు. పెద్దల యెడల, కుటుంబ సభ్యుల యెడల, దేశం యెడల గౌరవ ప్రపత్తులతో మెలగాలి అన్నది మొదటి సూత్రం. నేటికీ పెద్దల యెడల, అధికారుల యెడల చైనా వారు చూపే గౌరవ మర్యాదలు శ్లాఘనీయం. కుటుంబాభిమానం వారిలో ఎక్కువ. కలిసికట్టుగా సంఘ శ్రేయస్సు కోసం పాటుపడడం  అనేది కన్ఫుషియస్ ఆలోచనకి మూల స్తంభం. కుటుంబం కోసం, సంఘం కోసం, దేశం కోసం సమష్టిగా పని చెయ్యాలి. వ్యష్టిగా ఎవరి "మోక్షం" కోసం వారు  విద్యార్జన, ధనార్జన చేస్తే సరిపోదు;  సంఘ శ్రేయస్సు కోసం సమష్టిగా కూడా పని చెయ్యాలి.

ఈ  రకం ధర్మ సూక్ష్మాలు హిందువులకి తెలియనివి కావు. ఉదాహరణకి:

ఒరులేయవి యొనరించిన

నరవర యప్రియము దనమనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి

పరాయణము పరమధర్మ పదములకెల్లన్ (భారతం, శాంతి, 5-220)

హిందూ దృక్పథంలో, "మానవ సేవే మాధవ సేవ" అన్న సూక్తి కేవలం ప్రచారం కోసం "బేనర్" మీద రాసుకుందుకే!  "మనం ఉండే సంఘం బలంగా ఉంటే అదే మన బలం" అనే ఆలోచన మనలో తక్కువ. "ఎవరి కర్మ వారిది" అనే వేదాంత ధోరణిలో ఉన్న వారికి సంఘంతో పనేమిటి? మన నుదిటి రాత బాగులేకపోతే ఆ రాసినవాడి దగ్గరకే వెళ్లి వాడికే కాసింత లంచం ఇస్తే సరిపోలే? రెండు వందల సంవత్సరాల బ్రిటిష్ సంపర్కం ఉన్నప్పటికీ అది సంఘానికీ, వ్యక్తికీ మధ్య ఉన్న పరస్పరాధార బంధంపై మన దృక్పథాన్ని మార్చలేకపోయింది.

కానీ ఇదే దేశంలో తరతరాలబట్టి స్థిర నివాసం ఏర్పరచుకున్న పార్శీలు వితరణ శీలానికి, సంఘాభ్యుదయనికీ మధ్య ఉండే లంకె బాగా అర్థం చేసుకున్న వ్యక్తులు. అభివృద్ధి అనేది వ్యష్టిగా కాక

సమష్టిగా జరగవలసిన కార్యక్రమం అని వారు గుర్తించేరు. ఈ అభ్యుదయ దృక్పథంతో వారు మన దేశపు పునర్నిర్మాణానికి అవసరమైన సంస్థలు ఎన్నో స్థాపించేరు.

ఈ తర్జనభర్జనలని పక్కకి పెట్టి, బుద్ధుడి కాలానికి తిరిగి వెళదాం.  ఆ కాలంలో ఆధునిక వైజ్ఞానిక దృక్పథానికి ఆద్యుడు అనదగ్గ గ్రీకు తత్త్వవేత్త థేల్స్, "ఈ ప్రపంచం దేనితో తయారయింది?" అని ఒక సారి ప్రశ్నించేరు. మేఘాలు, మృగాలు, వృక్షాలు, ఇలా వివిధ రూపాలలో కనిపిస్తూన్న ఈ స్థూల ప్రపంచం అంతా సూక్ష్మ రూపంలో ఒక్కటేనా? (జోసెఫ్ కెంప్^బెల్ 20 వ శతాబ్దంలో ప్రతిపాదించిన monomyth కి ఇది సమాంతర భావం!) మనకి దృగ్గోచరమయే బహుళత్వంలో ఏకత్వం ఉందా? సృష్టి అంతా మన మేధకి అందనంత క్లిష్టమైనదా లేక విశ్లేషించి అధ్యయనం చేస్తే అర్థం అవుతుందా? ఇటువంటి ప్రశ్నలతో ఆయన చాల కాలం కుస్తీ పట్టేరు. మట్టితో ఇటికలు చేసి, ఆ ఇటికలని మూల పదార్థంగా వాడి రకరకాల ఆకారాలలో గోడలు, ఇళ్లు, గుడులు, గోపురాలు కట్టినట్లే సృష్టిలో మనకి కనిపించేవన్నీ – అంటే, మేఘాలు, మృగాలు, వృక్షాలు, వగైరాలు – ఒక మూల పదార్థంతో తయారయి ఉండాలని ఆయన వాదించేవారు. ఆ మూల పదార్థం ఏదయి ఉంటుంది? ఆయన సముద్రపు ఒడ్డున నివసించేవారు. రోజూ ఎదురుగా ఉన్న మహాసాగరాన్ని చూసి, చూసి సృష్టికి మూలం నీరు అన్నారు. అంటే, ప్రపంచంలోని పదార్థాలన్నీ నీటితో తయారు చెయ్యబడ్డాయని ఆయన ఆలోచన. సృష్టికి మూలం జలం. సర్వవ్యాప్తమయిన జలం నుండే సృష్టి మొదలయి ఉండాలి. ఇదీ ఆయన ప్రవచనం. ఈ కొత్త దృక్కోణంలో భగవంతుని ప్రస్తావన లేదు, మానవాతీత శక్తులకు స్థానం లేదు.

థేల్స్ ప్రవచనం అందరికీ ఆమోదయోగ్యం కాలేదు. అందరి వరకు ఎందుకు? ఆయన దగ్గర శిష్యరికం చేస్తూన్న అనాక్సిమేండర్ గురువుగారితో ఏకీభవించలేదు. ఇసకలో నీళ్లు లేవు. నీటి కంటె సర్వవ్యాప్తమైనది భూమి. కనుక సృష్టికి మూలం భూమి అన్నారు అనాక్సిమేండర్. నీటి కంటె, భూమి కంటె సర్వవ్యాప్తమైనది గాలి కనుక, సృష్టికి మూలం గాలి అవాలి అని అనాక్సిమేనీస్  వాదించేరు. సర్వవ్యాప్తం అయినంత మాత్రాన సరిపోదు, శక్తిమంతమై ఉండాలి కనుక సృష్టికి మూలం అగ్ని అయితే బాగుంటుందని హెరాక్లిటోస్ ముచ్చట పడ్డారు. ఇంతకీ ఈ నాలుగింటిలో దేనికి అగ్రస్థానం

ఇవ్వాలి?  ఈ తగువు తీర్చడానికి ఎంపిడోక్లీస్ అనే తత్త్వజ్ఞుడు మధ్యవర్తిత్వం వహించేడు. అన్ని పక్షాల వారి వాదనలని పూర్వపక్షం చేస్తూ, “సృష్టికి మూలం నీరు, నిప్పు, గాలి, మట్టి” అంటూ తుని తగవులా తీర్పు చెప్పేడీయన.

ఇలా  గ్రీసు దేశంలో థేల్స్, సోక్రటీస్, అరిస్టాటుల్,  ఆర్కిమిడీస్, ప్రభృతులు తరతరాలుగా ప్రజలలో పాతుకుపోయిన మూఢనమ్మకాలని, ఆచార వ్యవహారాలని ప్రశ్నించడం మొదలు పెట్టేరు.

సృష్టికి మూలం నీరు, మట్టి, గాలి, నిప్పు అనగానే సరిపోతుందా? వీటిల్లో దేనికి పెద్దరికం ఇవ్వాలన్న సమస్య ఎదురయింది. ఈ సమస్యని అరిస్టాటిల్ అనే తత్త్వవేత్త పరిష్కరించేరు. విశ్వానికి మధ్యలో భూమి ఉందన్నారు ఆయన. ఈ భూగోళం చుట్టూ ఆవరించుకుని జలగోళం ఉందన్నారు. భూమి మీద మనకి కనిపించే చెరువులు, సరస్సులు, నదులు, సముద్రాలే ఈ జలగోళం అంటే. ఈ జలగోళం చుట్టూ వాయుగోళం ఉందన్నారు. భూమిని ఆవరించుకుని ఉన్న వాతావరణమే ఈ వాయుగోళం. ఈ వాయుగోళం చుట్టూ అగ్ని గోళం ఉందన్నారు. అప్పుడప్పుడు వాయుగోళానికి చిల్లు పడితే, ఆవల ఉన్న అగ్ని గోళమే మనకి మెరుపుల రూపంలో కనిపిస్తుందని అరిస్టాటిల్ వాదించేరు. అగ్ని గోళానికి బయట ఏమి ఉంది? ఏమీలేదు. ఏమీ లేకపోవడమేమిటి? శూన్యం ఉంది కదా! ఆ ఏమీ లేని ఖాళీ ప్రదేశాన్నే – సున్నతో పరిచయం ఉన్న మనవాళ్లు – “ఆకాశం” అన్నారని నా అభిప్రాయం.

ఈ వాదనలన్నిటిని పూర్వపక్షం చేసింది ఆధునిక భౌతిక శాస్త్రం అన్న విషయం ప్రస్తుతానికి పక్కన పెడదాం. థేల్స్ సాధించినది అప్పటివరకు కరడు కట్టుకుపోయిన సహజాతీతమైన, ఆధిదైవిక శక్తుల మీద నమ్మకాన్ని తోసిపుచ్చడం!    అదే ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞానానికి ఆయువుపట్టు అయింది!

# 21. గ్రీకు  భాషలో  పేర్లు,  వాటి అర్థాలు, వాటి ఉచ్చారణలు

గ్రీసు పురాణాలలో పేర్లు ఎలా రాయాలో, ఎలా ఉచ్చరించాలో అన్న విషయంలో స్పష్టత లేదు. ఎందుకంటే కొన్ని గ్రీకు పేర్లని  లేటినీకరణ చేసి ఇంగ్లీషు లిపిలో రాస్తారు. వాటిని మనం తెలుగు లిపిలో రాసినప్పుడు దాని స్వరూపం మారిపోయే ప్రమాదం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సమాచారం ఇంగ్లీషులో దొరికినంత సులభంగా గ్రీకు భాషలో కూడ దొరకదు కనుక తెలుగులో రాసిన పేర్ల యొక్క వర్ణక్రమాన్ని ఇంగ్లీషులో కూడ ఇస్తూ వచ్చేను. ఉదాహరణకి ఈ మూడు పేర్లు చూడండి: Eros, Eris, Ares. వీటిని తెలుగు లిపిలో రాసినప్పుడు Eros ని ఎరోస్ అనిన్నీ, Eris ని అరిస్ అనిన్నీ,  Ares ని ఏరీస్ అనిన్నీ రాసేను. ఉచ్చారణలో ఇంత దగ్గరగా ఉన్న పేర్లు ఇంకా ఉన్నాయి. సంస్కృతంలో జనకుడి కూతురు జానకి, వసుదేవుడి కొడుకు వాసుదేవుడు అయినట్లే గ్రీకు పేర్లలో  కూడా ఈ బాణీ కనబడుతూ ఉంటుంది. అందుకని ఈ దిగువ కొన్ని ముఖ్యమైన పేర్లని తెలుగు, ఇంగ్లీషు, గ్రీకు లిపులలో చూపించేను.

అక్షిలీస్ ACHILLES Ἀχιλλεύς  m

ట్రోయ్ యుద్ధంలో గ్రీసు తరఫున పోరాడిన మహావీరులలో ఒకడు. చిట్టచివరికి ట్రోయ్ రాకుమారుడు పేరిస్ వదలిన బాణం అక్షిలీస్ మడమలోని ఆయువుపట్టుకి తగలడం వల్ల మరణించేడు.

అగమెంనాన్ AGAMEMNON Ἀγαμέμνων m

మైసీని కి రాజు. మెనలయస్ (Menelaus) సోదరుడు. ట్రోయ్ యుద్ధంలో గ్రీసు సేనాధిపతి.  స్వకార్య ధురంధరత్వముతో, యుద్ధంలో ఖైదీగా పట్టుబడ్డ ఒక అమ్మాయి కోసం, మహావీరుడైన అక్షిలీస్ తో స్పర్ధలు పెట్టుకున్నాడు.

ఏజాక్స్ AJAX Αἴας m

గ్రీకు పురాణకథలలో ఇద్దరికి  ఈ పేరు ఉంది – ఒకరు టెలిమాన్ కొడుకు, మరొకరు ఓయిలస్ కొడుకు.  అక్షిలిస్ యుద్ధంలో చచ్చిపోయినప్పుడు అతని కవచం – ఒడీసియస్ తో వచ్చిన పోటీలో –

తనకి దక్కలేదన్న కోపంతో ఏజాక్స్ టెలిమానియన్ (అనగా, టెలిమాన్ కొడుకు ఏజాక్స్) ఆత్మహత్య చేసుకుంటాడు.

అలెగ్జాండర్ ALEXANDER Ἀλέξανδρος (Alexandros) m

గ్రీకులో ἀλέξω (alexo) అంటే "సహాయం చేయు, రక్షించు" కనుకనున్ను, ἀνήρ (aner) అంటే మనిషి (షష్ఠీ విభక్తి ἀνδρός) కనుకనున్ను అలెగ్జాండర్ అంటే ప్రజల రక్షకుడు. హెలెన్ ని దొంగిలించి ట్రోయ్ యుద్ధానికి ప్రేరణ కారణమైన పేరిస్ కి అలెగ్జాండర్ అనే పేరు కూడా ఉంది.

ఆల్^క్మిని ALCMENE Ἀλκμήνη f

ఏం^ఫిట్రియాన్ భార్య. ఏం^ఫిట్రియాన్ యుద్ధరంగంలో ఉన్న సమయంలో ఏం^ఫిట్రియాన్ వేషంలో జూస్ గదిలో ప్రవేశించి ఆల్^క్మినితో సంగమించడం వల్ల హెరాక్లిస్ (హెర్క్యులిస్) తో గర్భవతి అవుతుంది.

ఆండ్రోమెడా ANDROMEDA Ἀνδρομέδα, f

గ్రీకు భాషలో ἀνήρ (aner) అంటే "మనిషి, పురుషుడు" (మనిషియందు , పురుషునియందు ), μέδομαι (medomai) అంటే శ్రద్ధాళువు. ఆండ్రోమెడా ఇథియోపియా రాకుమారి. పెర్సియస్ ఈమెని అపాయం నుండి రక్షిస్తాడు. ఉత్తర ఆకాశంలోఉన్న ఒక నక్షత్రరాశికి ఈమె పేరు పెట్టేరు. ఈ నక్షత్రరాశిలో కనిపించే ఒక క్షీరసాగరానికి కూడా ఈమె పేరే పెట్టేరు.

ఏంటిగోనీ ANTIGONE Ἀντιγόνη f

ఎడిపస్ (Oedipus), యొకాస్తా (Jocasta) ల కూతురు.

ఏఫ్రోడీటీ APHRODITE Ἀφροδίτη f

ప్రేమకి, అందానికి అధిదేవత. ఎఫ్రోస్ <u>ἀφρός</u> (aphros) అంటే నురగ కనుక ఈమె సముద్రపు నురగ నుండి పుట్టిందనే కథకి బలం చేకూరుతుంది. దేవతల కమ్మరి అయిన హెఫయెస్టస్ ఈమె భర్త. ప్రేమ దేవుడు ఎరోస్ (Eros) ఈమె కొడుకు అని ఒక కథనం.

అపాలో APOLLO Ἀπόλλων m

లేతో కి జూస్ వల్ల పుట్టిన కొడుకు. ద్వాదశ ఒలింపాయనులలో ఒకడు. ఆర్టెమీస్ కి కవల సహోదరుడు. భవిష్యత్తులో ఏమి జరగబోతుందో చెప్పగల సమర్ధుడు. జ్యోతిషం, వైద్యం, సంగీతం, లలిత కళలు, వివేచన ఈ దేవుడి అధీనంలో ఉంటాయి.

అర్ఖిమిడీస్ ARCHIMEDES Ἀρχιμήδης m

గ్రీకు భాషలో <u>ἀρχός</u> (archos) అంటే ప్రవీణుడు అనిన్నీ <u>μήδομαι</u> (medomai) అంటే ఆలోచన, ప్రణాళిక కనుక నిదానంగా ఆలోచించి పని చెయ్యడంలో ప్రవీణుడు అనే అర్థం వస్తుంది.

ఏరీస్ ARES Ἄρης m

గ్రీకు భాషలో <u>ἀρή</u> (are) అంటే ధ్వంసం లేదా <u>ἄρσην</u> (arsen) అంటే మగ. ఏరీస్ (Ares) ద్వాదశ ఒలింపాయనులలో ఒకడు. జూస్ కీ హేరా కి పుట్టిన బిడ్డ అయినప్పటికీ వారికి అయిష్టుడు. ఇతను రక్త పిపాసి. యుద్ధాలకి అధిపతి. ఇతడే గిత్త రూపం దాల్చి పేరిస్ పెట్టిన పందెంలో గెలిచినప్పుడు పేరిస్ నిష్పక్షపాత బుద్ధి దేవలోకంలో తెలుస్తుంది. ఇతని సహచరులలో ముఖ్యులు డైమోస్ (Deimos), ఫోబోస్ (Phobos) యుద్ధరంగంలో ఏరీస్ రథాన్ని నడిపే వ్యక్తులు. కలహభోజని అరిస్ (Eris) కూడా ఇతని సాహచర్య వర్గం లోనిదే!

ఆర్టెమీస్ ARTEMIS Ἄρτεμις f

లేతో కి జూస్ వల్ల పుట్టిన కుమార్తె. అపాలో కి కవల సహోదరి. ద్వాదశ ఒలింపాయనులలో ఒకతె. ఆర్టెమీస్ మృగయావినోదాలకి, చంద్రుడికి అధిపత్ని. అమెరికా ప్రభుత్వం చంద్రుడి మీదకి రెండవసారి వెళ్లే ప్రయత్నంలో వారి నాభొనౌకకి పెట్టిన పేరు.

ఎతీనా ATHENA Ἀθηνᾶ f

గర్భవతిగా ఉన్న మేటీస్ ని జూస్ మింగేసిన తరువాత అతని శిరస్సుని చీల్చుకుని, సచేలంగా, సాలంకృతంగా పుట్టిన బిడ్డ. ద్వాదశ ఒలింపాయనులలో ఒకతె. ఏథెన్స్ నగరపు ప్రాపక దేవత అవడం వల్ల ఎతీనా అనే పేరు వచ్చి ఉండవచ్చు. ఈమె వివేకానికి, పాండిత్యానికి, యుద్ధకళలకి అధిదేవత.

బ్రిసేయిస్ BRISEIS Βρισηΐς f

తండ్రి పేరు బ్రిసియస్ Βρισεύς (Briseus) నుండి ఉత్పన్నమైన కూతురి పేరు. (జనకుడి పేరు జానకి అయినట్లు.) ఈమె అసలు పేరు హిప్పొడేమియా. ట్రోయ్ యుద్ధంలో ఈమెని అక్షిలీస్ బందీగా పట్టుకుంటాడు. ఒక "వంకాయల బేరం"లో అగమెంనాన్ ఈమెని తనకి కావాలని తీసుకున్నాడు. అందుకని కోపం వచ్చి అక్షిలీస్ యుద్ధం చెయ్యనని భీష్మించుకుని కూర్చుంటాడు.

కసాండ్రా CASSANDRA Κασσάνδρα f

గ్రీకు భాషలో Κασσάνδρα (Kassandra), లేదా κέκασμαι (kekasmai) అంటే "ప్రకాశించు" అనిన్నీ ἀνήρ (aner) అంటే "పురుషుడు" (షష్ఠీ విభక్తిలో ἀνδρός) అనిన్నీ అర్థం. కసాండ్రా ట్రోయ్ రాకుమారి, ప్రియం, హెకూబాల కూతురు. ఆపాలో ఈమెకి భవిష్యత్తులోకి చూడగలిగే కాలజ్ఞానం అనే వరం ఇచ్చేడు. అయినా ఈమె ఆపాలో ప్రేమని తిరస్కరించింది. అందుకని ఆమె చెప్పిన మాటలు ఎవ్వరు నమ్మరు అని ఆపాలో శపించేడు.

క్రోనస్ CRONUS Κρόνος m

ఇతను గ్రీకు దేవతల మూలవిరాట్టు. ఇతని పిల్లలే టైటనులు. ఇతని పిల్లలలో ఒకరు ఇతని చంపుతారని ఒకరు జోశ్యం చెప్పగా ఇతను తన భార్య రేయా కన్న పిల్లలని కబళించడం మొదలు పెట్టేడు. రేయా తన కడసారం పిల్లడు జూస్ ని క్రోనస్ కళ్ల పడకుండా కాపాడింది. చివరికి జూస్ ఎదిగిన తరువాత క్రోనస్ ని చంపి దేవలోకానికి రాజు అవుతాడు.

డిమీటర్ DEMETER (1) Δημήτηρ f

గ్రీకు భాషలో **δᾶ** (da) అంటే భూమి, **μήτηρ** (meter) అంటే మాత. ద్వాదశ ఒలింపాయనులలో ఒకతె. డిమీటర్ వ్యవసాయానికి అధినేత్రి. ఈమె క్రోనస్ కూతురు, జ్యూస్ కి సోదరి, పెర్సిఫోనీ (Persephone) కి తల్లి.

ఎరిబస్ EREBUS Ἔρεβος m

గ్రీకు భాషలో **Ἔρεβος** (Erebos) ఎరిబస్ అంటే పాతాళలోకపు చీకటి.

అరిస్ ERIS Ἔρις f

అరిస్ (Eris) అంటే కలహభోజని. ఈర్ష్య, అసూయ ఈమె తత్త్వాలు. తగాదాలు పెట్టడంలో దిట్ట. ఈమెకి ఎక్కడా దేవాలయాలు లేవు. ఈమె తల్లిదండ్రులు ఎవ్వరు అన్న విషయం మీద నిర్ధిష్టమైన సమాచారం లేదు; ఒకొక్క "పురాణం" లో ఒకొక్కలా ఉంది. ఒక కథనం ప్రకారం ఈమె జూస్ కి హేరా కి పుట్టిన బిడ్డ. ఈ లెక్కని ఈమె ఒలింపియను యుద్ధ దేవత ఏరిస్ (Ares)కి తోబుట్టువు కానీ సహచరి కాని; స్పష్టత లేదు. మరొక కథనం ప్రకారం ఈమె నిక్స్ (Nyx) కి మగ సంపర్కం లేకుండా పుట్టిన బిడ్డ (parthenogenous child). ఈ కోణం నుండి చూస్తే ఈమె ఎరోస్ (Eros) వలెనే ఒక అపరావతారం (personified concept). వేరొక కథనం ప్రకారం ఈమె నిక్స్ కి ఎరిబస్ (Erebus) కి పుట్టిన బిడ్డ.

ఎరోస్ EROS Ἔρως m

గ్రీకు భాషలో ఎరోస్ అంటే ప్రేమ. ఎరోస్ (Eros) మన్మధుడి లాంటి వ్యక్తి. ఒక కథనం ప్రకారం సృష్టికి ముందు ఉన్న అవ్యక్త అస్తవ్యస్త స్థితి నుండి ఉద్భవించిన త్రయంలో (గాయా, టార్టరస్, ఈరోస్) లో ఈ కామ దైవం ఒకడు. ఈరోస్ ఏఫ్రొడీటీ కొడుకు అని కొన్ని చోట్ల ఉంది. కామదైవం అయిన ఎరోస్ (Eros) పేరు, కలహభోజని అయిన అరిస్ (Eris) పేరు ఒకదానితో మరోకటి పోలి ఉండడం కేవలం కాకతాళీయం కాకపోవచ్చు. తొలిచూపులో కలిగిన కామోద్రేకం కాలక్రమేణా కలహాలకి దారి తీయడం చూస్తూనే ఉన్నాం కదా!

గాయా GAIA Γαῖα f

గ్రీకు భాషలో గాయా γαῖα (gaia), అంటే భూమి కనుక గాయా భూదేవి. టైటన్లకి, సైక్లాపులకి ఈమె, తల్లి, యూరెనస్ తండ్రి.

హెక్టర్ HECTOR Ἕκτωρ m

ఈ పేరుని గ్రీకు భాషలో Ἕκτωρ (Hektor) అంటారు, అనగా గట్టిగా పట్టుకునేవాడు అని అర్థం. ఇతను ట్రోయ్ వీరులలో అగ్రేసరుడు. తన ప్రాణ స్నేహితుడైన పాట్రోక్లస్ ని యుద్ధంలో చంపేదన్న కక్షతో అక్కిలీస్ ఇతనిని దారుణంగా చంపి, ఆ మృతదేహాన్ని తన రథానికి కట్టి యుద్ధభూమిలో వీరవిహారం చేస్తాడు.

హెకూబా HECUBA Ἑκάβη f

ఈమె ట్రోయ్ నగరానికి రాజైన ప్రియం యొక్క పట్టపు రాణి. వీరిద్దరికి కలిగిన సంతానంలో ముఖ్యులు: హెక్టర్, పేరిస్, కస్సాండ్రా.

హెలెన్ HELEN Ἑλένη f

ఈ పేరు గ్రీకు భాషలోని Ἑλένη (Helene), నుండి కానీ ἑλένη (helene) నుండి కానీ పుట్టి ఉండవచ్చు. లేదా దీని మూలం σελήνη (selene) – అనగా, చంద్రుడు – అయి ఉండవచ్చు. ఈమె జూస్ కి లేదా కి పుట్టిన పిల్ల కనుక దైవాంశ ఉన్న వ్యక్తి. ఈమెని పేరిస్ అపహరించడం ట్రోయ్ యుద్ధానికి ప్రేరణ కారణం అయింది.

హెఫయెస్టస్ HEPHAESTUS Ἥφαιστος m

గ్రీకు దేవతల కమ్మరి. కురూపి. ఈ కురూపిని చూసి తల్లి హేరా ఇతనిని ఒలింపస్ పర్వతం మీదనుండి కిందకి విసిరేసింది. చంచలమైన అందాలరాసి ఏఫ్రోడీటీ ఇతని భార్య.

హేరా HERA Ἥρα f

ఈ పేరుకి మూలం ఏమిటో తెలియదు: గ్రీకు భాషలో ἥρως (heros) అంటే "నాయకి, యుద్ధ నైపుణ్యం కల వ్యక్తి"; ὥρα (hora) అంటే "గంట కాలం"; αἱρέω (haireo) అంటే "ఎంపిక అయినది" అనే అర్థాలు ఉన్నాయి కనుక వీటిల్లో ఏదయినా అవొచ్చు. హేరా దేవతల మహారాణి, జూస్ చెల్లెలు, పట్టమహిషి. ఈమె వివాహ బంధాలకి, ప్రసవాలకీ అధినేత్రి.

హెరాక్లిస్ HERAKLES Ἡρακλῆς m

గ్రీకు భాషలో κλέος (kleos) అంటే ప్రభ కనుక HERAKLES అంటే హేరా యొక్క ప్రభ. ఇతను మానవ వనిత ఆల్^క్మిని కి జూస్ వల్ల పుట్టిన బాలుడు. తన సవతి కొడుకని హేరా అష్టకష్టాలు పెట్టింది. ఇతనే హెర్క్యులీస్ అన్న పేరుతో ప్రఖ్యాతి గణించుకున్నాడు.

హెర్మీస్ HERMES Ἑρμῆς m

గ్రీకు భాషలో ἕρμα (herma) అంటే "సరిహద్దుని సూచించే రాళ్ళపోగు." హెర్మీస్ దేవతల వార్తాహరుడే కాకుండా బాటసారులకి, రచయితలకి, క్రీడాకారులకి, వక్తలకి, చోరులకి ప్రాపకుడు.

హెరడోటస్ HERODOTUS Ἡρόδοτος m

గ్రీకు భాషలో δοτός (dotos) అంటే వరం లేదా వరప్రసాదం. కనుక Ἡρόδοτος (Herodotos), అంటే హేరా దేవత ఇచ్చిన వరప్రసాదం.

హెస్టియా HESTIA Ἑστία f

గ్రీకు భాషలో ἑστία (hestia) అంటే "పొయ్యి, అగ్నిగుండం, గాడిపొయ్యి" అనే అర్థాలు స్ఫురిస్తాయి. ఈమె గృహ జీవితానికి అధినేత్రి.

హైపీరియన్ HYPERION Ὑπερίων m

గ్రీకు భాషలో <u>ὑπέρ</u> (hyper) అంటే "మీద, పైన." ఇతను థియా ద్వారా సూర్యుడు (Helios), చంద్రుడు (Selene)కి, ఉషస్సు (Eos) కీ తండ్రి.

అయాపిటస్ IAPETOS Ἰαπετός m

గ్రీకు భాషలో <u>ἰάπτω</u> (iapto) అంటే "గుచ్చు, పొడుచు" అని అర్థం. ఇతను నీతికి అధిపతి. ఏట్లస్ (Atlas), ప్రొమీథియస్ (Prometheus), ఎపిమీథియస్ (Epimetheus) ల తండ్రి.

యొకాస్తా JOCASTA Ἰοκάστη f

గ్రీకు భాషలో ఇయోకాస్తా <u>Ἰοκάστη</u> (Iokaste), ఇంగ్లీషులోకి వచ్చి యొకాస్తా అయింది. ఈమె ఎడిపస్ ని లయస్ వల్ల కన్న తల్లి, గుర్తు పట్టలేని పరిస్థితులలో ఎడిపస్ భార్య అయింది.

లేడా LEDA Λήδα f

జూస్ హంస రూపంలో వచ్చి కలిసిన ఫలితంగా ఈమెకి పుట్టిన బిడ్డలు: కేస్టర్ (Castor), పోలక్స్ (Pollux), హెలెన్ (Helen), క్లైటెమ్^నెస్ట్ర (Clytemnestra).

మెడ్యూసా MEDUSA Μέδουσα f

గ్రీకు పురాణాలలో కనిపించే ఒక వికారమైన స్త్రీ. ఈమె తలలో కేశములకు బదులు పాములు ఉంటాయి. ఈమె ఎవరిని చూస్తే వారు శిలలు అయిపోతారు.

మెనలయస్ MENELAUS Μενέλαος m

<u>Μενέλαος</u> (Menelaos) = <u>μένος</u> (menos) అనగా బలం + <u>λαός</u> (laos) అంటే ప్రజలు. ఇతను స్పార్టా కి రాజు, హెలెన్ కి భర్త. హెలెన్ ని పేరిస్ అపహరించిన కారణంగా గ్రీసు సేనలు

ట్రోయ్ ని ముట్టడించేరు. యుద్ధం అయిపోయిన తరువాత మెనలయస్ సుఖంగా హెలెన్ తో శేష జీవితం గడిపేడు.

మెరొపీ MEROPE Μερόπη f

మెరొపీ, గ్రీసు పురాణాలలో ఈ పేరు చాల మందికి ఉంది. ఎడిపస్ పెంపుడు తల్లి పేరు, కృత్తిక కన్యలలో ఒకామె పేరు కూడా ఇదే!

మెతీస్ METIS Μῆτις f

మెతీస్ అంటే గడుసుతనం. ఈమె సంతానం జూస్ ని మించిపోతారని ఒకరు జోస్యం చెప్పగా, గర్భవతిగా ఉన్న ఈమెని ఈగగా మార్చేసి మింగేస్తాడు, జూస్! కానీ మెతీస్ కడుపులో ఉన్న పిల్ల పూర్తిగా పెరిగి సచేలంగా, సాలంకృతంగా జూస్ శిరస్సుని చీల్చుకుని బయటకి వస్తుంది.

మైదస్ MIDAS Μίδας m

తాను ఏది ముట్టుకుంటే అది బంగారం అయిపోయేటట్లు డయోనిసిస్ వద్ద వరం పుచ్చుకున్న రాజు.

నేమొజీన్ MNEMOSYNE Μνημοσύνη f

ఈమె జ్ఞాపకశక్తికి అధినేత్రి. జూస్ వల్ల ఈమెకి పుట్టిన తొమ్మిదిమందిని "మ్యూజ్" లు అంటారు.

నెస్టర్ NESTOR Νέστωρ m

గ్రీకు భాషలో <u>νέομαι</u> (neomai) అంటే "తిరిగి వచ్చు, తిరిగి ఇచ్చు." ఇతను పైలాన్ కి ప్రభువు. వృద్ధుడు, గ్రీకు సైన్యాలకి సలహాదారుడు.

నైకీ NIKE Νίκη f

గ్రీకు భాషలో "నైకీ" అంటే విజయం. ఈమె విజయానికి అధిదేవత.

నిక్స్ NYX Νύξ f

గ్రీకు భాషలో "నిక్స్" అంటే రాత్రి. ఈమె రాత్రికి అధిదేవత. ఈమె ఎరిబస్ (Erebos) కి కేయాస్ పుట్టిన కూతురు.

తీటస్, THETIS Θέτις f

గ్రీకు భాషలో "తీటస్" అంటే కుదుర్చు, స్థాపించు. ఈ సముద్రపు జలకన్య పెలియస్ భార్య, అక్కిలీస్ తల్లి. ఈమె (చిన్న టెతీస్) టెతీస్ మనుమరాలు.

టెతీస్, TETHYS Τηθύς f

ఈమె (పెద్ద టెతీస్) టైటను. ఓషనస్ చెల్లెలు, భార్య. నదులకి తల్లి.

థీమస్, THEMIS Θέμις f

యూరెనస్–గాయా ల పుత్రిక. జూస్ భార్యలలో ఒకరు

సంప్రదించిన మూలాలు

https://www.behindthename.com/names/usage/ancient-greek

https://www.behindthename.com/names/usage/greek-mythology

## వేమూరి వేంకటేశ్వరరావు తెలుగు పుస్తకాలు

1. English-Telugu & Telugu-English Dictionary & Thesaurus, Asian Educational Services, New Delhi, 2002. ఈ నిఘంటువుని తెలుగు వికీపీడియాలో, వికీబుక్స్ లో ఉచితంగా కూడ సంప్రదించవచ్చు. https://te.wikibooks.org/wiki/%E0%B0%B5%E0%B0%BE%E0%B0%A1%E0%B1%81%E0%B0%95%E0%B0%B0%E0%B0%BF:Vemurione
2. జీవరహశ్యం, ప్రతులు అలభ్యం
3. రసగంధాయ రసాయనం, ప్రతులు అలభ్యం
4. కించిత్ భోగో భవిష్యతి, (వైజ్ఞానిక కథలు), కినిగె
5. అమెరికా అనుభవాలు, ఎమెస్కో
6. అలనాటి అమెరికా అనుభవాలు, కినిగె
7. జీవనది: రక్తం కథ, కినిగె.
8. నిత్యజీవితంలో రసాయనశాస్త్రం, కినిగె.
9. విశ్వస్వరూపం, కినిగె.
10. ప్రాణి ఎలా పుట్టింది?, కినిగె.
11. మహాయానం, (వైజ్ఞానిక కల్పనలు), కినిగె.
12. తెలుగులో కొత్త మాటలు, కినిగె
13. ఒకటి, రెండు, మూడు, ... అనంతం
14. మన నాయకులకి కావలసిన భౌతిక శాస్త్రం
15. రామానుజన్ నుండి ఇటూ అటూ, కినిగె, ఉచితం
16. ఫెర్మా చివరి సిద్ధాంతం, కినిగె, ఉచితం
17. చుక్కల్లో చంద్రుడు: చంద్రశేఖర్ చరిత్ర, కినిగె, ఉచితం

# వేమూరి వేంకటేశ్వరరావు జీవిత సంగ్రహం

భారతదేశంలో తుని, మచిలీపట్నం, కాకినాడలలో విద్యాభ్యాసం. ఉన్నత విద్యకి 1961 లో అమెరికా ప్రయాణం. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ కేలిఫోర్నియా, డేవిస్ కేంద్రంలో విశ్రాంత ఆచార్యులు. నివాసం ప్లెజంటన్, కేలిఫోర్నియాలో. సైన్సు విషయాల మీద విశేషంగా తెలుగులో రాసేరు. యూనివర్సిటీ ఆఫ్ కేలిఫోర్నియా, బర్క్లీ కేంద్రంలో తెలుగు పీఠం స్థాపించడానికి 2006 నుండి అవిరామంగా పాటుపడుతున్నారు. శాశ్వత నిధి 2017 నాటికీ $500,000 చేరుకుంది.